సంపుటి: 39
సంచిక: 2

ఫోన్ నెం:
6[illegible]843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

సెప్టెంబరు, 1984

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

తొలిమాట

నమస్కారము. అపన ధర పెంచకుండా వుండాలని గత రెండు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నాము. కాని రోజురోజుకు పెరుగుతున్న పత్రికా నిర్వహణ వ్యయం తట్టుకోవటం మావల్ల కావటంలేదు. అందువలన వచ్చేనెల నుండి పత్రిక ధరను స్వల్పంగా పెంచక తప్పటంలేదు. పాఠకులు ఎప్పటివలె మాతో సహకరిస్తారని ఆశిస్తున్నాము.

వచ్చే నెలనుండి 'అపరాధ పరిశోధన' మరియు 'అపరాధ పరిశోధన సప్లిమెంట్'ల ధర రు. 6-00 లు. ఏడాది చందా రు. 72-00 లు.। అయితే 'హోమ్ డెలివరీ' సభ్యులకు యీ పెరుగుదల వర్తించదు. వాళ్ళకు ఎప్పటి మాదిరిగా రెండు పత్రికలు కలిపి వి పి. రు. 10/- లకే పంపబడుతుంది.

'హోమ్ డెలివరీ'ని ఇకనుండి మా ఏజెంట్లు లేని ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేస్తున్నాము. అయితే ప్రస్తుతం వున్న సభ్యులకు మాత్రం యథాప్రకారంగానే 'హోమ్ డెలివరీ' కొనసాగించబడుతుంది. ఏజెంట్లు వున్నచోట ఏజెంటు దగ్గరనే పత్రికలు తీసుకోవలసిందిగా మా పాఠకులను కోరుతున్నాము.

ఈ నెల సప్లిమెంట్‌లో బొమ్మిడి అచ్చారావుగారి 'కళ్యాణ దుర్గం' సీరియల్ పూర్తయింది. 10 భాగాలుగా వచ్చిన యీ సీరియల్ పాఠకులను ఎంతగనో ఆకట్టుకొంది. ఇదే సంచికలో మరో కొత్త సీరియల్ 'అగ్ని కిరీటం' ప్రారంభమైంది. ప్రతాప రవిశంకర్ గారు వ్రాసిన ఈ సీరియల్ కూడా మా పాఠకులను ఉత్తేజపరచగలదని ఆశిస్తున్నాము.

సెలవా మరి —

మీ

శ్యామ దామోదర్ రెడ్డి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. కొండ లోయల్లో శవాలు—బొమ్మిడి అప్పారావు
21. పోలీసు బాధితులు—చంద్రశేఖర అజాద్
42. కత్తిపట్టిన వీర వనిత—బి. రాజేశ్వరి
60. చిన్నవాడి మాజిక్—అజీజ్
83. అడవి దారి—షి. అరుణ
98. రెండవ టికెట్టు—కె. వి. రమణ
106. తారాపథం—చంద్రశేఖర అజాద్
119. రక్తం—స్వరూప్
141. ఫోన్ కాల్స్—ఎమ్. వి. వి. సత్యనారాయణ
163. కాంచన శిఖరం (సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. ఎర్ర సముద్రము—చంద్రశేఖర అజాద్
34. పాముల పుట్ట—బి. రాజేశ్వరి
79. మూడు ఫోటోలు—టెంపోరావ్
111. డేగ కళ్ళు—బొమ్మిడి అప్పారావు
152. కళ్యాణ దుర్గం (సీరియల్)—బొమ్మిడి అప్పారావు
180. అగ్ని కిరీటం (సీరియల్)—ప్రతాప రవిశంకర్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

Kattukolu Subba Reddy Home Library Pedaogirala.

కొండలోయల్లో శవాలు

• బొమ్మిడి అచ్చారావు

“లొకేషన్ బావుంది. చక్కటి సెలక్షన్, థాంక్యూ!” అన్నాడు జనార్ధనం ఆమెవంక ఆరాధనగా చూస్తూ.

నీల నవ్వింది. హాయిగా, తీయగా మత్తుగా.

జనార్ధనం పరవశించిపోయాడు. “నిన్ను సరిగా అర్థం

చేసుకోలేకపోయాను సుమా! నామీద ప్రేమ లేదను కున్నాను” అన్నాడు ఆమెవంక ప్రేమ నిండిన కళ్ళతో చూస్తూ.

నీల నవ్వుతూనే, “నీలాంటి మగాణ్ణి ఏ ఆడదైనా కోరుకుంటుంది. ఆ గొప్పతనం ఆడదానిది కాదు, నీది!” అన్నది.

“నువ్వు పదిమందిలోను నన్ను తిట్టినపుడు ఎంతగా భయపడిపోయానో తెలుసా!? అంతకుమించి నువ్వు తిరస్కరించావనే బాధ, అవమానం నా నర నరాన్ని పిండేసి నన్ను అశక్తుణ్ణి చేశాయి.”

“అంత తొందరగా, నువ్వెంత గాఢంగా ప్రేమిస్తున్నావో తెలీకుండా నిన్నెలా నా వాడిగా అంగీకరించగలను? అందుకే చిన్న పరీక్ష పెట్టాను. పదిమందినీ పిలిచి నువ్వు అల్లరి చేశావని చెప్పాను. అప్పుడు కూడా నువ్వు వాళ్ళందరితోనూ నన్ను ప్రేమించానని ధైర్యంగా చెప్పావు. ఆ ఫ్రాంక్‌నెస్ నాకు బాగా నచ్చింది—నా మనసు దోచుకుంది. అందుకే నా ప్రేమ సందేశం పంపాను!” నీల కళ్ళు కాంతివంతంగా మెరుస్తున్నాయి.

జనార్దనం మనసు ఆకాశంలోని విహంగంలా విహరిస్తోంది. ఏవో దివ్యలోకాలను సందర్శించి వస్తోంది. పరిమళభరితమైన కుసుమాల అత్తరుతో స్నానం చేసినంత హాయిగా, మత్తుగా వున్నది.

నీల నవ్వుతోంది—అదే నవ్వు. మగవాణ్ని పిచ్చివాణ్ని చేసే నవ్వు. సామ్రాజ్యాలనైనా తన కనుసన్నతో శాసించగల ఠీవి వుందామె కళ్ళలో, ఆమె నిల్చున్న తీరులో, ఆ భంగిమలో; ఎంతగా యిసపకచ్చడాలు కట్టిన మహర్షి అయినా నిష్ఠ వదలివచ్చి ఆమె పాదాక్రాంతుడయ్యేలా చేయ

గల మహత్తు వున్నది.

సామాన్యుడైన జనార్దనం ఏపాటి?

జనార్దనం చుట్టూ పరికించి చూశాడు. చుట్టూ లోతైన లోయలు. అడుగున ఏముందో కనిపించనంత వూహాకంద నంత లోతు. పైకి ఎక్కిరావటానికి కనీసం ముప్పావు గంట పట్టింది. దాన్ని ఏనుగుల కొండ అంటారు వాడుకగా. కాని ఆ పేరు సరికాదు. ఆకాశకొండ అనాల్సింది. తన ఆలోచనకు లోలోన నవ్వుకున్నాడు.

"ఏమిటి నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?" అన్నది నీల అతన్ని సమీపించి కళ్ళలో కళ్ళుపెట్టి చూస్తూ. ఆ సమ్మోహనాస్త్ర ఘాటికి జనార్ధనం నిలవలేకపోయాడు. ఆమె కళ్ళలో ఏదో వింత కాంతి. అంతు తెలీని మత్తు.

ఆ క్షణాన అతని మనసు దివ్యలోకాల్లో విహరిస్తోంది. కాని కాళ్ళు మాత్రం లోయ అంచున వున్నాయి.

మరుక్షణం అతని కేక లోయలో ప్రతిధ్వనించింది. అతని శరీరం లోయ దిగువకు చేరి అక్కడి బండలమీద పడి తునాతునకలైపోయింది.

2

"అందరూ అలాగే తియ్యగా కబుర్లు చెపుతారు. కాని పెళ్ళి చేసుకోవాలనేసరికి పరుగులు పెడతారు. మీ మగాళ్ళ సంగతి యెవరికి తెలీదు?" మూతి మూడు వంకర్లు తిప్పింది నీల.

"ఎంత మాట? నీ కడగంటి చూపుకోసం కాలేజిగేటు దగ్గర ఎన్నిసార్లు, ఎన్నిరోజులు పడిగాపులు కాశానో నీకు తెలీదు నీలా! నువ్వు ఊఁ అంటే యీ క్షణంలో పెళ్ళి చేసుకుంటాను!" సిన్సియారిటీ ధ్వనించింది ప్రసాద్ గొంతులో.

నీల విరగబడి నవ్వింది—ఆమె నవ్వుతుంటే పమిట పైగా వేసుకున్న లాకెట్ ఆమె రెండు వక్షోజాలమీద అటు ఇటు ఎగిరిపడింది. ఆ దృశ్యం మరీ పిచ్చెక్కించేలా వుంది ప్రసాద్‌కి.

"ఎందుకలా నవ్వుతావు?...." అన్నాడు తనూ నవ్వుతూ.

"నీ జోక్‌కి!"

"జోకా? నిజంగా యిది జోకే!"

"నాది కాదు నీదే జోక్. లేకపోతే ఏమిటి? మనం యిప్పుడెక్కడున్నాం?"

"ఏనుగుల కొండమీద!"

"అవునా? ఈ క్షణంలో యిక్కడ నన్ను పెళ్ళి చేసుకుంటానంటే నవ్వు రాదా మరి?"

ప్రసాద్ పెద్దగా నవ్వేశాడు. "ఓ అదా? అదయితే జోకే! ఏదో మాటవరసకి అన్నాను"

"పెళ్ళి చేసుకొంటాననటం మాటవరసా?"

"అబ్బ, కాదనుకో! నువ్వు ఊఁ అనాలేగాని యిరవై నాలుగ్గంటలు తిరక్కుండా నీ మెళ్ళో రత్నాల తాళి కట్టెయ్యనూ?"

నీల మనోహరంగా నవ్వింది.

"అలాగే ఇరవై నాలుగ్గంటలు ఎంతలో గడుస్తాయి? అదేమిటి, నీ వెనక....?"

అతను కంగారుపడి వెనుతిరిగాడు. కాలికింద చిన్న రాయి కదిలింది. కొంచెం తూలాడు.

కాలు జారింది. మరుక్షణం లోయలోపలి నుంచి అతని కేక ఆమెకు మృదుమధురంగా వినిపించింది.

నీల లోయవైపు ఓసారి చూసి, నిర్లక్ష్యంగా నవ్వుకుని

వెనుతిరిగింది. ఆమె ముఖంలో నవ్వు మాయమైపోయింది. ఆశ్చర్యం, గగుర్పాటు. చోటు చేసుకున్నాయి.

ఎదురుగా ముత్యాలరావు నవ్వుతున్నాడు. వ్యంగ్యంగా, గర్వంగా, హేళనగా, రకరకాలుగా కనిపించిందామె కతని నవ్వు.

"వెల్‌డన్ మిస్ సీలా! చాలా తెలివిగా నీ దారినుంచి అడ్డు తొలగించుకున్నావు ప్రసాద్‌ని! నువ్వు హత్య చేశావంటే యీ లోకంలో యెవడూ నమ్మడు. నీ అందం, అమాయకత్వం అలాంటివి! నువ్వేదో ప్రేమదేవతవని నీ వెంటబడి, తన ప్రేమకు గుర్తుగా ప్రాణాలనే బలి యిచ్చిన ప్రసాద్ జన్మ ధన్యమైంది. పాపం, ప్రేమ పూజారి!"

"ముత్యాలరావ్. ఏమిటి నువ్వనేది? ప్రసాద్ కాలుజారి లోయలో పడిపోయాడు. అతన్నే ప్రేమించి, అతన్నే పెళ్ళాడాలనుకున్న నాకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చి వెళ్ళి పోయాడు. ఈ వెల్లాంటి నీ మాటల్తో నన్ను బాధపెట్టకు, ప్లీజ్!"

ముత్యాలరావు విరగబడి నవ్వాడు.

"ఎవడయినా అతి తేలికగా నమ్మగలడు. నువ్వు కావాలనే ప్రసాద్‌ని కొండ అంచుకు నడిపించుకుంటూ వెళ్ళావని, అతన్ని నీ మత్తులో ముంచేసి అతను లోయలో పడే వరకు అతన్ని నడిపించావని ఎవడూ అనుకోలేడు హాట్సాఫ్ టు యూ!"

"అతిగా మాట్లాడకు. ప్రసాద్ ప్రమాదవశాత్తు పడి పోయాడు. అందులో నా ప్రమేయం ఏమీలేదు"

"అలాగా. పాపం! ఊరొదిలి ప్రేమికులు ఈ ఏనుగుల కొండమీదికే ఎందుకు రావలసివచ్చిందో? దీనికి విహారంగా

ఎవరూ రారని నీకు బాగా తెలిసేవుంటుంది.... గతంలో చాలామంది ప్రమాదవశాత్తు లోయల్లో పడిపోవటం జరిగాక, ప్రజలు యీ కొండ యెక్కకూడదని పోలీసులు హెచ్చరించారు. ఎవరూ యిటువైపు కనీసం తొంగిచూడటానికయినా ఇష్టపడరు. అలాంటిది నీ ప్రియుడితో ఈ కొండకు విహార—అదే ప్రేమయాత్రకు వచ్చావంటే ఎవడయినా నమ్మే విషయమేనా?"

"నిజం, నా మాట నమ్ము. పెళ్ళికావలసినదాన్ని. పెళ్ళికి ముందే నలుగురి నోట్లోనూ నానటం దేనికని నేను, ప్రసాద్ కూడబలుక్కుని యీ కొండమీదికి వచ్చాం. కాసేపు సరదాగా గడిపి వెళ్ళిపోదామనుకున్నాం. కాని, దైవం మరోలా తలచింది. అతను అజాగ్రత్తగా నిల్చుండటంవల్ల జారి లోయలో పడిపోయాడు."

ముత్యాలరావు నవ్వాడు. "మరి, పెళ్ళి కావలసినదానివి మొన్నటిదాకా మా జనార్దనంతో యెందుకు ప్రేమ నటించావు? ఇప్పుడు మళ్ళీ ప్రసాద్‌ను ఎంత త్వరలో ప్రేమించేశావు? నీది చాలా విశాల హృదయంలా వుందే! అందులో యెంతమంది మగాళ్ళకయినా స్థానముందనుకుంటాను పుష్పక విమానంలాగా!" అన్నాడు.

"జనార్దనం పిరికివాడు. నామీద ప్రేమను పరీక్షించుదామనుకున్నాను. కాని యింతలోనే వూరు వదలి ఎక్కడికి పోయాడో మరి....?"

ఆమె ఆ మాటలంటుండగానే ముత్యాలరావుకి ఏదో స్ఫురించింది.

"ఇప్పుడు అర్ధమవుతోంది నాకు మా జనార్దనం ఏమయిందీ? నువ్వే వాడిని యీ కొండపైకి తీసుకొచ్చి యిదే విధంగా వాడ్ని లోయలోనే తోసేసి వుంటావు. అవునా,

నిజం చెప్పు నా తమ్ముడు బతికిలేడు, అవునా! చెప్పు!"
ముత్యాలరావు కళ్ళలోకి ఎరుపుజీర వచ్చేసింది.

"నో, నాకేం తెలీదు! మీ తమ్ముడు ఓసారి నడివీధిలో నా చెయ్యి పట్టుకున్నాడు ప్రేమను తెలియజేసే పద్ధతి అది కాదని నచ్చచెప్పాను. అసలు మనసులో నాకు మీ తమ్ముడంటే మొదట్నుంచీ యెంతో ప్రేమాభిమానాలున్నాయి. నేనే నా మనసు నతని కెరిగించాలనుకున్నాను. ఇంతలోనే కంగారు పడిపోయాడు. పదిమందిలో అతను పట్టుకోగానే సహజంగానే భయంవేసింది. అరిచాను అప్రయత్నంగా. నలుగురు చేరి పెద్ద గొడవయింది ఆ అవమానం భరించలేక అతను వూరొదలి వెళ్ళిపోయాడు."

ముత్యాలరావు తల విదిలించాడు.

"కాదని నీకూ నాకూ కూడా తెలుసు! నేనింకా మా తమ్ముడు యెక్కడో ఓ చోట బతికే వున్నాడనుకుంటున్నాను.... కాని యీ రోజు ప్రసాద్‌ని నువ్వు లోయలోకి తోయటం కళ్ళారా చూశాక నీమీద మొదటిసారిగా అనుమానం వచ్చింది.

నిన్ను యీ రోజు ప్రసాద్‌తో చూశాక ఎందుకో నా మనసు కలుక్కుమంది. నిన్ను కోరిన నా తమ్ముడు ఏమయిపోయాడో తెలీకుండా పోయినట్లే ప్రసాద్ కూడా నీ పిచ్చిలో పడి మతి పోగొట్టుకుంటాడని హెచ్చరించాలనుకున్నాను. మీ యిద్దరు ఆటో ఎక్కటం చూశాను. వెంబడించాను.

"మీరు సరాసరి యీ ఏనుగుల కొండకు రావటం చూశాను. మీ యిద్దరికి కనపడకుండా అనుసరించి నేనూ పైకి యెక్కాను. కాని అప్పటికే ఆలస్యమయింది. నువ్వు ప్రసాద్‌ని ప్రేరేపించి కొండ అంచుదాకా నడిపిం

చావు. అతను పడకుండా బాలెన్సు చేసుకోబోతుంటే స్వయంగా చేతుల్తో తోశావు. నా కంట బడిపోయావు. నా తమ్ముడ్నీ యిలాగే తోసి చంపేశావు, అవునా?" ముత్యాలరావు ఆయాసపడుతున్నాడు.

నీల తల అడ్డంగా తిప్పింది.

"చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు. నా కే పాపమూ తెలియదు. నీ తమ్ముడు వూరొదలి వెళ్ళిపోయుంటాడు. అవమానం భరించలేక!....ప్రసాద్‌ని నే నేమీ తొయ్యలేదు, ప్రమాదవశాత్తు...."

"స్టాపిట్ రాక్షసీ! నువ్వింక బతికి వుండటానికి వీల్లేదు. నీ మాయలో పడి యింకా యెందరు కాలేజి కుర్రాళ్ళు ప్రాణాలు పోగొట్టుకుంటారో....నా తమ్ముడి లాంటి అమాయకుల్ని ఎందర్ని పొట్టన పెట్టుకుంటావో యిది జరగనివ్వను. నీ అంతు యీ క్షణంలోనే తేల్చేస్తాను...."

"ఆగు! నీ తమ్ముడు నావల్లనే చచ్చిపోయాడనటానికి రుజువేమిటి? కనీసం లోయలో నీ తమ్ముడి శవాన్ని చూశావా? ఏ విధంగా నన్ను హంతకిగా నిర్ణయించావు? నీ తమ్ముడు బతికేవున్నాడేమో! ప్రసాద్‌ని పోనీ నేను తోసేశాననే ఆరోపిస్తున్నావు కదా. నీ తమ్ముడి శవం వెరిఫై చేసుకో, అప్పుడు నువ్వే శిక్ష విధించినా నేను సిద్ధం!"

"నీ చావు తెలివితేటలు నా దగ్గిర ప్రదర్శించకు. నేను మా తమ్ముడి శవంకోసం నిర్ధారణ చేసుకోవటానికి లోయలోకి తొంగిచూస్తే తేలిగ్గా తోసేద్దామనుకుంటున్నావా? అయినా. వారంరోజుల తర్వాత శవం యింకా కుళ్ళిపోయి, జీర్ణమైపోకుండా వుంటుందా? నేను నీకన్న ఓ సంవత్సరం సీనియర్ని. నీ కన్న తెలివైనవాడ్ని. నన్ను మోసంగించా

లని చూడకు....కడసారిగా దేవుణ్ణి స్మరించుకో!...."
దగ్గరగా జరుగుతున్నాడు ముత్యాలరావు.

"ప్లీజ్. నన్నేం చెయ్యకు! జీవితాంతం నీకు దాసిగా వుంటాను. నీకు సేవలు చేసుకుంటూ నన్ను నే కర్పించుకుంటాను..."

"ఛీ నీలాంటి వగలాడిని కోరుకునేటంత అధముణ్ణి కాదు. నువ్వు విషసర్పానివి! నీ కాటు సరాసరి నరకానికి దారి చూపిస్తుంది. నీ లాంటి విషపురుగుని...." అత నా మాటలు అంటూ ముందుకొస్తున్నాడు. ఆమె చటుక్కున అతని కాళ్ళకు తన కాలు అడ్డుపెట్టింది.

ముత్యాలరావు ఒక్క క్షణం పక్కకు తూలేడు. ఆ ఒక్క క్షణాన్ని మెరుపువేగంతో వుపయోగించుకుంది నీల. బలంగా అతన్ని లోయ అంచువైపు నెట్టింది. పడిపోయి నిలదొక్కుకున్నాడు ముత్యాలరావు కాని అప్పటికే ఆలస్య మైంది. బ్యాలెన్సు కుదర్లేదు. పెద్దగా కేకపెట్టి లోయలో పడిపోయాడు.

నీల విరగబడి నవ్వుకుంది. నేలని గట్టిగా తన్ని చకచక ఏనుగులకొండ దిగసాగింది.

3

"ఇదేమిటయ్యా. ఒక్క వారం రోజుల కాలంలో ముగ్గురు యువకులు మాయమయ్యారట! పోనీ చిన్నపిల్లలు కాదుగదా. ఎక్కడో తప్పిపోయారనుకోనటానికి! ముగ్గురూ కాలేజి స్టూడెంట్సే! వారంరోజుల క్రితం తమ్ముడు, నిన్న అన్న కనపడకుండా పోయారు. నిన్ననే ప్రసాద్ అనబడే మరో కాలేజి కుర్రాడు కనపడకుండా పోయాడు.... కేసు చాలా విచిత్రంగా వుంది!" అన్నాడు క్రైంబ్రాంచ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్.

సార్జంట్సు రాజు, శివం అతనివంక దీక్షగా చూస్తు న్నారు.

"మాకూ అంతుబట్టడంలేదు సార్! కాలేజి కుర్రాళ్ళు పెద్ద విప్లవం లేవదీస్తున్నారు సార్ మనమీద! అదో ఉద్య మంగా మారకముందే మనం కేసులు డిస్పోజ్ చెయ్యాలి సార్!" అన్నాడు శివం.

"అదే గదయ్యా, నా బాధను. నిన్నటివాకా ఒక్క కేసే! ఇప్పుడు మూడు! ఒక్కటీ పరిష్కారం కాలేదు, మూడు ఎలా సాల్వ్ చేసేది?"

"నా అనుమానం మూడిటికీ లింక్ వుందేమో అను కుంటున్నాను సార్! ఒకటి తెలిస్తే తక్కిన రెండూ బయటపడతాయి" అన్నాడు రాజు.

"నిజమే! ఆ ఒకటీ తెలియాలికదా....అన్నట్టు డిటెక్టివ్ కిరణ్ విషయం కనుక్కున్నావా?"

"కనుక్కునే వస్తున్నాను సార్! ఆయన ఢిల్లీనుంచి యింకా తిరిగిరాలేదు."

"మరెలా యిప్పుడు? కనీసం ఆ టెలిఫోన్సువాళ్ళ కయినా చెప్పావా? రెండురోజులుగా ఫోను డెడ్. పోలీస్ స్టేషనులోనే ఫోను పని చెయ్యకపోతే యీ టెలిఫోను డిపార్టుమెంటు ఎందుకయ్యా?"

"బిల్లు లివ్వటానికి సార్!" చటుక్కున చెప్పాడు శివం.

శ్రీనివాస్‌కి తెరలు తెరలుగా నవ్వొచ్చింది, శివం జోక్‌కి.

"కరెక్టు!....ఇంకా మంచి జోక్‌నే చెపుతాను. మొన్న మా ఫ్రెండుకి పన్నెండువేలు బిల్లొచ్చింది."

"అలాగా, అదేమిటి సార్. ఆయన పెద్ద బిజినెస్

మానా? లేక ప్రాంకాల్స్ విపరీతంగా చేసే అలవాటున్న మనిషా?" శివం అనుమానం వెలిబుచ్చాడు.

"అతను ఓ సామాన్య ఉద్యోగి. బ్యాంకు క్లార్కు."

"మరిదేమి వింత?" రాజు సందేహం.

"వింతల్లోకెల్లా వింత. అసలు మా ఫ్రెండుకి టెలిఫోను కనెక్షనే లేదు!" అన్నాడు శ్రీనివాస్.

కాసేపు ఆ గది నవ్వులతో మార్మోగిపోయింది.

శ్రీనివాస్ చటుక్కున నవ్వాపేశాడు. టెలిఫోను మోగుతోంది, ఆనందంగా రిసీవర్ ఎత్తాడు.

"హల్లో పోలీస్‌స్టేషన్...."

అవతలినుంచి "మీనార్ ఎక్స్‌ప్రెస్ ఎరైవల్ యెప్పుడండీ?" అనడిగారెవరో.

శ్రీనివాస్‌కి యిట్టే కోపం వచ్చేసింది. "బాబూ, యిది రైల్వేస్టేషన్ కాదు, పోలీస్‌స్టేషను. పెట్టెయ్యి" అన్నాడు.

అవతల క్లిక్ మన్నాక రిసీవర్ రెస్టుమీద వుంచి, "రాక రాక ఫోన్‌కాల్ వస్తే ఫోను బాగయిందని సంతోషించాను గాని. యిలాంటి రాంగ్‌నంబర్‌తో ప్రారంభమవుతుందనుకోలేదు" అంటూ రిసీవర్ చెవిదగ్గర పెట్టుకుని డయల్ చేశాడు.

డెడ్ సౌండ్! చిరాగ్గా రిసీవర్ క్రెడిల్‌చేసి, రాజు, శివంవంక చూశాడు. వాళ్ళకి అర్థమై పోయింది.

"అంత తొందరగా బాగయిపోతే టెలిఫోన్ వాళ్ళు బాధపడరా సార్!!" అన్నాడు శివం ఓదార్పుగా.

క్రైతాన్ కేసు ఫైలు పరిశీలించటం మునిగిపోయాడు. తర్వాత తలెత్తి శివంవంక చూసి.

"ఈ ముగ్గురూ కాలేజి కుర్రాళ్ళే కదా! పైగా ముగ్గురు

ఒకే కాలేజి అందులో జనార్ధనం. ప్రసాద్ బిఎస్సీ రెండో సంవత్సరం. ముత్యాలరావు మూడో సంవత్సరం—ఐ మీన్ ఫైనలియర్! వీళ్ళు ముగ్గుర్లో యెవరయినా ప్రేమలో పడ్డారా, పడితే ఆ ప్రేమకు ప్రేరణ ఎవరైనా వున్నారా? ఉంటే యెవరు? యీ వివరాలు సేకరించుకుని రా!" అన్నాడు.

శివం సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

రాజువంక తిరిగి ఏదో చెప్తూండగా, ఓ వ్యక్తి లోపలికి వచ్చి శ్రీనివాస్‌కి విష్ చేశాడు.

శ్రీనివాస్ అతనివంక పరిశీలనగా చూశాడు. పైజామా లాల్చీ ధరించాడు. సిల్కుది. ఖరీదైనవి. రెండు చేతుల వేళ్ళకూ నాలుగు ఉంగరాలు. ఖరీదయిన రిస్టువాచీ. చేతిలో గోల్డ్ ఫ్రేమ్ కళ్ళజోడు పెట్టుకుని వున్నాడు. మరో చేతిలో ఖరీదయిన సిగరెట్ ప్యాక్ వున్నాయి. చాలా ఖరీదయిన వ్యక్తిలా వున్నాడు.

"ఎవరు కావాలండి?" అనడిగాడు శ్రీనివాస్.

"కెన్ ఐ సిట్ సర్?" అన్నాడతను మర్యాదగా.

"విత్ ప్లజర్!" అన్నాడు శ్రీనివాస్.

అతను కూచున్నాడు.

"ఈ రోజు పేపర్లో యిద్దరు కుర్రాళ్ళు.... అదే, కాలేజి కుర్రాళ్ళు మాయమైనట్టు చూశాను. నా అనుమానమే నిజమయితే వాళ్ళీపాటికి చనిపోయి వుంటారు" అన్నాడు.

శ్రీనివాస్ అదిరిపడి చూశాడతని వంక. "ఏమిటి మీ రంటున్నది?" అన్నాడు.

"అవును సార్! నిన్న నేను ఏనుగుల కొండవైపుగా కారు డ్రయివ్ చేసుకుంటూ వెళ్తున్నాను. రేస్‌కోర్సులు అటు

వైపే కదా! నాకు రేసుల పిచ్చి వుంది.

అదే సమయానికి ఇద్దరు అబ్బాయిలు, ఓ అమ్మాయి ఏనుగుల కొండ ఎక్కడం కళ్ళారా చూశాను. ఏనుగుల కొండ ప్రమాదస్థలమని నిషేధిస్తూ ఆ మధ్య పోలీసులు ప్రకటన విడుదల చేశాక యెవరూ ఆ వైపే తొంగి చూడటం లేదుకదా! ఆ కుర్రాళ్ళు వెళ్ళటం చూసి, పాపం తెలియక వెళ్తున్నారు, ఆపి విషయం చెపుదా మను కున్నాను—కాని చెప్పలేక పోయాను" అన్నాడతను.

"అదేం?"

"మొదటి కారణం, రోడ్‌కి ఏనుగుకొండ దూరంగా వుండటం—రెండోది, నాకు రేసులకి టైం అయిపోవటం! పదివేలు పందెం వేశాను. ఆ ఆత్రుతకొద్దీ ఆగకుండా వెళ్ళి పోయాను."

"వాళ్ళు కాలేజి స్టూడెంట్సు అని యెలా ఊహిం చారు....?"

"ముగ్గురు కాలేజిపిల్లల వయసులోవాళ్ళే! చదువు కుంటున్న కుర్రాళ్ళని చూడగానే చెప్పొచ్చు!....

"మరి వాళ్ళే వీళ్ళని ఎలా చెప్పగలం."

"అదేదో మీరు చూసుకోండి. చెప్పటం వరకే నా బాధ్యత. ఓ బాధ్యతగల పౌరుడిగా నా పని చేశాను. తర్వాత మీ యిష్టం."

"అహ, అందుకు మీకు చాలా థాంక్స్! ఓ 'క్లూ' యిచ్చారు. అయితే ఆ అమ్మాయి తప్పిపోయినట్టు యెలాంటి రిపోర్టు మాకు రాలేదు కాబట్టి, వాళ్ళు యీ కేసులో కుర్రాళ్ళు కాకపోవచ్చని ఊహిస్తున్నాను. పైగా వాళ్ళు చనిపోయారనే యెలా చెప్పగలం? కాసేపు కొండ మీద కూచుని కబుర్లు చెప్పుకొని వెళ్ళిపోవచ్చు కదా."

అతను లేచి నించున్నాడు. "క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గారయితే యిన్ని ప్రశ్నలు వేసి, అనవసరంగా టైం వేస్టు చెయ్యరు మీ పేరేమిటో తెలియదుగాని, మీరు యీ డిపార్టుమెంటులో వుండాల్సినవారు కాదు. లింక్ అందితే అంతా అల్లుకుపోగలిగిన వాళ్ళే యీ డిపార్టు మెంటులో వుండాలి!" అన్నాడు కోపంగా.

శ్రీనివాస్‌కి అతని మాటలు కొరడా దెబ్బల్లా తగి లాయి. తనే శ్రీనివాస్ అని చెప్పి అంతదాకా అతనికి తనపై వున్న సదభిప్రాయాన్ని పోగొట్టుకోవటం ఇష్టం లేక, బలవంతంగా నవ్వు ముఖాన పులుముకుని, "థాంక్యూ సార్! వెంటనే రంగంలోకి దిగుతాం. మీ పేరేమిటో తెల్సుకోవచ్చా?" అన్నాడు.

"నన్ను దివాకర్ అంటారు సరూర్ నగర్‌లో మాకు ద్రాక్షతోటలున్నాయి ఇదిగో నా విజిటింగ్ కార్డు!" అంటూ విజిటింగ్ కార్డు అందించి, వేగంగా బయటికి వెళ్ళి పోయాడు దివాకర్.

బయట కారు స్టార్టయిన శబ్దం వినిపించింది.

అంతదాకా శ్రోతలా నిలబడివున్న సార్జంట్ రాజు వంక సాభిప్రాయంగా చూశాడు శ్రీనివాస్.

"ఇప్పుడే ఏర్పాట్లు చేస్తానుసార్!" అంటూ వెళ్ళి పోయాడు రాజు.

పదినిమిషాల్లో పోలీస్‌స్టేషన్ నుంచి శ్రీనివాస్, తన బలగంతో ఏనుగుల కొండవైపు దూసుకుపోయాడు.

4

మాంసం కుళ్ళిపోయి అస్థిపంజరంగా మారుతున్న జనార్దనం శవాన్ని, అప్పుడే కుళ్ళబోతున్న ప్రసాద్,

ముత్యాలరావు శవాల్ని వరసగా పడుకోబెట్టారు పోలీసులు.

శ్రీనివాస్ దృష్టి మూసివున్న ముత్యాలరావు గుప్పిట మీద పడింది. గుప్పిట నుంచి బయటకి ఏదో మెరుస్తూ కనిపించింది.

గుప్పిట బలవంతాన తెరిచాడు.

బంగారుగొలుసు! లాకెట్ అమర్చిన గొలుసు! ఎవరో ఆడపిల్లది!

శ్రీనివాస్ కళ్ళు మెరిశాయి. దాన్ని జాగ్రత్తగా జేబులో వేసుకున్నాడు.

ఆధారాల కోసం మరో గంటవరకు పరిశోధించి తిరుగు ముఖం పట్టాడు శ్రీనివాస్.

అతనొచ్చేసరికి సార్జెంట్ శివం సరికొత్త సమాచారంతో సిద్ధంగా వున్నాడు.

"జనార్దనం నీల అనే అతని క్లాస్‌మేట్‌ని ప్రేమించాడు సార్! అదే నీల జనార్దనం కనిపించకుండా పోయాక తన క్లాస్‌మేట్ ప్రసాద్‌తో చనువుగా తిరుగుతోందని తెలిసింది" అన్నాడు.

శ్రీనివాస్ సన్నగా యీలవేశాడు.

సార్జెంట్ రాజు మార్చ్యురీ నుంచి అప్పుడే వచ్చాడు.

"సార్, శవాల్ని గుర్తుపట్టారు సార్. మనకి లాకెట్ దొరికిన శవం ముత్యాలరావుది - అంటే జనార్దనం అన్నయ్యది. రెండోది ప్రసాద్‌దే! అస్థిపంజరానికున్న దుస్తుల్నిబట్టి, శవం ఆకారాన్నిబట్టి అది జనార్దనం శవమని తేలిగ్గానే తెల్సిపోయింది!" అన్నాడు రాజు.

శ్రీనివాస్ కళ్ళముందు తెరలు విడిపోయాయి.

"ఆల్‌రైట్ మీ ఇద్దరు నాతోరండి. శివం, నీల అడ్రసు తెల్సుగా?!" అన్నాడు శ్రీనివాస్.

"తీసుకున్నానుసార్!" అన్నాడు శివం.

సాయంత్రం అయిదయింది. ఆ సమయంలో నీల యింటిదగ్గరే వుండి వుండాలి. కాలేజి సైంకాదు!

నీల యింటిదగ్గర జీప్ ఆగింది.

అప్పుడే కాలేజినుంచి వచ్చి దుస్తులు మార్చుకుంటున్న నీల అదిరిపడింది.

నీల తల్లి బయటికి తొంగిచూపి, బిగుసుకుపోయింది భయంతో.

శ్రీనివాస్ లోనికొచ్చాడు. నీల తల్లిని అడిగాడు.

"ఉందిబాబూ, యిప్పుడే కాలేజినుంచి వచ్చింది" అంటూ నీలను పిలవటానికి లోపలి గదిలోకి వెళ్ళింది.

నీల సాధ్యమైనంత మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తోంది.

"మిస్ నీలా! ఈ లాకెట్ ఎవరిదో గుర్తుపట్టగలరా?" శ్రీనివాస్ లాకెట్‌ని ఆమె ముందుంచాడు.

నీల కలవరపాటును బయటికి కనపడకుండా వుండటానికి ప్రయత్నం చేసింది.

"ఏమో నాకు తెలీదు!" అన్నది.

"పోనీ, జనార్దనం ప్రసాద్‌తో నువ్వు నడిపిన లవ్ ఎఫైర్ తెలుసా?"

"ఏమిటి మీరు మాట్లాడేది?"

"పోనీ ముత్యాలరావు సంగతైనా తెలుసా!"

"వాళ్ళు మా కాలేజీలోనే చదువుతున్నారు. ఎందుకు తెలియదు?"

"సో. వాళ్ళు ముగ్గుర్నీ నువ్వే హత్య చేశావంటాను. ఏమైరైట్?"

నీల గట్టిగా అరిచింది. "ఏమో, నాకేం తెలియదు.

నాకేం తెలీదు!"

శ్రీనివాస్ లాకెట్ మూత తెరిచాడు. లోపల నీల ఫోటో, లాకెట్‌లో సరిపడే ఫోటో అమర్చివుంది.

నీల నిస్సహాయంగా చూసింది. ఆ వెంటనే ఆమె కళ్ళ వెంట నీళ్ళు జల జల రాలిపోయాయి. నిస్సహాయంగా కూలబడిపోయి రోదించసాగింది.

శ్రీనివాస్ కొద్ది క్షణాలు ఆమెని ఏడవనిచ్చి, "ఇంత ఘోరంగా ముగ్గురు అబ్బాయిల్ని దారుణంగా హత్యచేశావే, ఏమిటి వాళ్ళు నీకు చేసిన ద్రోహం?" అన్నాడు మెల్లిగా.

నీల కళ్ళు తుడుచుకుని చెప్పింది.

"నాకు యీ ముసలి తల్లి తప్ప నా అనేవాళ్ళు లేరు. మమ్మల్ని రాజారావు అనబడే ఓ ధనవంతుల కుర్రాడు పోషిస్తున్నాడు. నేను అతనికి నా సర్వస్వం అర్పించుకున్నాను. నా మీద మరెవరి నీడ పడినా అతను సహించడు.

జనార్దనం పదిమందిలో నా చెయ్యి పట్టుకున్నాడని తెలిసి వాడ్ని చంపెయ్యమన్నాడు. ఏనుగుల కొండమీదికి తీసుకువెళ్ళి ఎలా చంపాలో అతనే పథకం వేశాడు. నన్ను ప్రేరేపించి జనార్దనాన్ని ఏనుగుల కొండకు తీసుకు వెళ్ళేలా చేశాడు. నామాట నమ్మి వచ్చిన జనార్దనాన్ని లోయలోకి తోసి చంపేశాను.

రెండోసారి ప్రసాద్‌ని మొన్న అలాగే తీసుకు వెళ్ళాను. అయితే ముత్యాలరావు ప్రసాద్‌ని చంపటం చూసి బెదిరించాడు. విధిలేక అతన్నీ చంపేయాల్సి వచ్చింది" అన్నది.

సార్జంట్లు ఆమెను జీప్ ఎక్కించారు.

జీప్ రాజారావు యింటివైపు సాగిపోయింది. □

పోలీసు బాధితుడు

చంద్రశేఖర ఆజాద్

పట్టణానికి క్రొత్త యస్.ఐ. వస్తున్నాడని తెలిసే సరికి కొన్ని వర్గాల్లో ఆందోళన వ్యక్తమయింది. తిరిగి కొన్నాళ్ళపాటు వారికి ఇబ్బందికరంగా ఉంటుంది. ఆ యస్. ఐతో పరిచయాలు పెంచుకోవటం. ఓవేళతను నిజాయితీగా ఉంటే మెల్లగా అతన్ని కూడా ముగ్గులోకి

దించి, తమ తమ కార్యకలాపాలకు ఎలాంటి అడ్డులేకుండా చూసుకోవటానికి కొంత సమయం పడుతుంది. ఓవేళ అతగాడు ఇలాంటి వాటికి లొంగకపోతే అనుసరించాల్సిన పద్ధతుల్ని కూడా ఆలోచించాల్సి ఉంటుంది.

కొందరయితే అప్పుడే రాబోయే యస్ ఐ గారి గురించి వివరాలు సేకరించటం ప్రారంభించేరు. ఆయన స్ట్రిక్ట్ అనే విషయం వారికి తెలిసింది. వారు చాలామంది స్ట్రిక్ట్ ఆఫీసర్లను చూశారు.

అందుకని వారి కెలాంటి సంకోచంలేదు.

యస్ ఐ రాజా ఛార్జి తీసుకున్నాక ఒకసారి నేరస్థుల ఫైలు తిరగేసి వివరాలన్నింటినీ నోట్ చేసుకొన్నాడు.

పట్టణంలో జేబు దొంగతనాలు, సైకిల్‌దొంగల బెడద ఎక్కువగా ఉంది. కానిస్టేబుళ్ళందరినీ పిలిచి హెచ్చరించాడు. నెలరోజుల లోపు పట్టణంలో అవన్నీ తగ్గిపోవాలని గట్టిగా చెప్పాడు.

డ్యూటీలో జాయినయిన వారంరోజులకు యస్.ఐ రాజాకు ఫోన్ వచ్చింది.

"రౌడీ మామూళ్ళ బెడదగా వుందని కనీసం మీ పాలనలో అయినా వాటి బారినుండి మమ్మల్ని రక్షించ మంటూ" ప్రాధేయపడ్డారు.

"నెలరోజులు టైం ఇవ్వండి" అంటూ చెప్పి ఫోన్ పెట్టేశాడు.

అతనికి బాగా తెలుసు. పోలీసు శాఖలోని అన్యాయాల్ని లంచగొండితనాన్ని అమాంతం తుడిచెయ్యలేనని, అలాగే సామాజిక జీవితంలోని రౌడీల్ని, నేరస్థుల్ని కూడా నిర్మూలించటం సాధ్యంకాదని, తాను కొంతమేరకే చేయగలడని ఆ మేరకు తాను చేసే కృషినయినా కొందరు హర్షించరని

కూడా అతని అనుభవంలో ఋజువయింది.

రాజా తరచుగా బదిలీ అవుతుంటాడు. అందుకు అతనేం బాధపడలేదు. ముఖ్యంగా అతని కెదురవుతున్న అనుభవాల మూలంగా విరక్తిచెంది తానూ మారలేదు.

"తాను ఈ ఉద్యోగంలోనే ఉండాలి. నీతిగానూ, నిజాయితీగానూ పనిచేయాలి. అలాంటి అవకాశాలు సంపూర్ణంగా మృగ్యం అయితే - ఆ రోజు ఉద్యోగానికి రాజీనామా చెయ్యాలి."

ఈ నిర్ణయం ఆ ఉద్యోగంలో చేరబోయే ముందే తీసుకున్నాడు.

సాయంకాలం మఫ్టీలో ఓసారి పట్టణం అంతా చుట్టి రావటానికి బయలుదేరాడు.

2

ఆ సెంటర్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అక్కడున్న హోటళ్ళూ, షాపులూ ఎప్పుడూ క్రిక్కిరిసి ఉంటాయి. ఆ ప్రాంతానికి చెందిన రౌడీలకు కాలక్షేపం అక్కడే. వారి వ్యాపారం కూడా జోరుగా సాగిపోతుంటుంది.

కిళ్ళీకొట్టు అత్యంత అందంగా అలంకరించబడివుంది. ఆరడుగుల ఆజానుబాహుడో కాయన అక్కడ సిగరెట్ పెట్టె తీసుకుంటున్నాడు. ప్రక్కనుండి ఏవేవో మాటలు వినపడుతున్నాయి. అతను చిల్లర తీసుకుంటున్నా చెవులు మాత్రం ఆ మాటల్ని వింటుండిపోయాయి.

"కొత్త యస్.ఐ వస్తే భయమా? మా మామూలు మా కివ్వాలి. ఆ యస్. ఐ కాదు వాడి బాబొచ్చినా ఇచ్చి తీరాల్సిందే" అంటున్నాడతను.

"ఇంకేం కావాలిసార్" అన్నాడు కొట్టతను.

"ఓ అరటికాయ ఇవ్వు"

కొట్టతను ఓ కాయ త్రెంచి ఇచ్చాడు. అందుకొని వెనక్కి తిరిగాడు తింటూ ఆ వైపుకు చూడటం ప్రారంభించాడు. అతనింకా అరుస్తూనే ఉన్నాడు. తినటం పూర్తయింది. చిల్లరడబ్బులు ఇచ్చి, ముందుకు నడిచి రౌడి భుజం మీద చెయ్యివేశాడు.

"ఎవడుబే" అంటూ వెనక్కి తిరిగాడతను.

"మా బాబెందుకురా నేనే వచ్చాను" అన్నాడు

పరీక్షగా చూపి గుర్తు పట్టాడు.

"ఇది మా సెంటర్" అన్నాడతను బింకంగా.

మరుక్షణం కళ్ళముందు చుక్కలు కనిపించాయి. గజం దూరంలో పడి ఈల వేశాడు. ఆ ప్రాంతంలో ఉన్న చిన్న రౌడీలంతా చేరిపోయారు వారందరి చేతుల్లోనూ చెయిన్లున్నాయి.

రాజా చొక్కా విప్పాడు.

వారంతా ముందు కొచ్చారు.

అక్కడివారంతా పదినిముషాలు జేమ్స్‌బాండ్ సినిమా చూస్తున్నట్లుండిపోయారు. అందరూ పారిపోగా, నేలకు కరచుకున్న ఆ రౌడిని ఓ రిక్షా పిలిచి స్టేషన్‌కు తీసుకు పొమ్మని చెప్పాడు.

అక్కడకు చేరినవారిలో కొందరు రాజాను గుర్తు పట్టారు. చెవిలో మెల్లగా "యస్. ఐగారు" అంటూ ప్రక్కవాళ్ళకు చెప్పారు. విప్పిన చొక్కా అందుకొని బయలుదేరాడు.

స్టేషన్‌కు వెళ్ళాక హెడ్ కానిస్టేబుల్ని పిలిచాడు.

"ఈ ఊర్లో రౌడీ అనే ప్రతివాడిని పిలిపించు"

"యస్ సర్" అంటూ శాల్యూట్ కొట్టి వెనక్కి తిరిగాడు.

సాయంకాలానికి అందరూ హాజరుకాబడ్డారు.

వాళ్ళ జీవితంలో అలాంటి అనుభవం ఎప్పుడూ ఎదురు కాలేదు. రాజా వారందరినీ పిచ్చిగా బాదేశాడు.

"గుర్తుంచుకోండి. ఈ ఊర్లో ఎవడైనా రౌడి అని తలెత్తితే చంపేస్తాను. రుస్తుం మామూళ్ళంటూ ఎవడైనా రుబాబ్ చేసినట్లు తెలిసిందా ఖబడ్దార్." కఠినంగా హెచ్చరించి వెళ్ళిపోయాడు.

ఈ చర్యతో రాజా పేరు మారుమ్రోగిపోయింది. రౌడీల వైభవం తగ్గిపోయిండి.

పట్టణంలోని రెస్టారెంట్లన్నింటిని, బార్‌లు వైన్ షాప్‌లూ పదిగంటలకల్లా మూసి వెయ్యాలని నిర్ణయించ బడింది. మామూలుగానే ఆ విషయాన్ని కొందరు ఖాతరు చేయలేదు. రాజా ఆధ్వర్యంలో రెయిడ్ చేయబడ్డాయి. మత్తుగా త్రాగుతున్న జనాన్నికూడా హెచ్చరించాడు.

మరికొన్నిచోట్ల రాత్రిపూట నృత్యగానాల పేరుతో నగ్న ప్రదర్శన జరుగుతుండేది. అమ్యూజ్‌మెంటు పార్కులు సాయంకాలం పూట కళకళలాడు తుండేవి. ఆ ఊరి కిళ్ళీ కొట్లదగ్గర కనిపించే సాధారణ దృశ్యం. పలకలు తగిలించి వాటిమీద అంకెలు వేయటం....అక్కడచేరిన కొందరు పేపరు ముందేసుకొని భూతద్దంతో వెదుకుతుండ టం. అలాటి వారందరినీ అరెస్టు చేయించి మూయించేశాడు రాజా.

పట్టణంలో వరసగా తీసుకుంటున్న ఈ చర్యల మూలంగా అనేకులు సంతోషించారు.

క్యాబరే డ్యాన్సుల నిషేధం....తమ తమ జూదపు వ్యాపారాల్ని మూయించటంతో ఆ పెద్దలు డబ్బుమూటలు తీసుకెళ్ళి భంగపడి వచ్చారు.

ఈలోపు ఓ సంఘటన జరిగిపోయింది.

కొంతమంది విద్యార్థులు రాత్రి చూసిన సినిమా ప్రభావంతో ఓ పందెం కట్టుకున్నారు. అందులో భాగంగా కాలేజీ నుండి వస్తున్న ఓ అమ్మాయిని ఓ విద్యార్థి ముద్దు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి సరాసరివచ్చి రాజాకు రిపోర్ట్ చేసింది-ఏడుస్తూ. రాజా వెంటనే మోటార్ సైకిల్ వేసుకెళ్ళి వాడితోపాటున్న వారందరినీ తీసుకొచ్చి బాదేశాడు.

వారంతా డబ్బుగల వారిబిడ్డలు.

ఆఫ్టరాల్ కుర్రవాడు తెలియకచేస్తే మాత్రం ఇంత దారుణంగా వ్యవహరించాలా? వాడి పొగరు అణచాలి.

పెద్దలంతాచేరి బ్యాంక్ లో డబ్బు డ్రాచేసి కుర్రాళ్ళకిచ్చారు. వారంతా మందు కొట్టేశాక ఏకగ్రీవంగా ఓ నిర్ణయానికొచ్చారు.

"యస్. ఐ. రాజా విద్యార్థులపట్ల అమానుషంగా ప్రవర్తించాడు. ఆయన్ని వెంటనే బదిలీ చెయ్యాలి లేదా ఆయన విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి. అందుకోసం ముందుగా కాలేజీలు విడిచి ప్రదర్శనలు చేస్తారు. అలా కూడా కాకుంటే ఆ పట్టణంలో బంద్ జరుగుతుంది."

యస్.ఐ బాధితులంతా ఆ కార్యక్రమానికి మద్దతు ఇచ్చారు.

పి.ఐ.తో కొందరు పెద్దలు మాట్లాడారు.

ఆయన రాజాను పిలిచాడు.

"ఏమిటి గొడవ."

"ఏముంది. పందెం కోసం ఓ పేదపిల్లను నడిబజార్లో ముద్దు పెట్టుకున్నారు. వాళ్ళనిలా వదిలిపెడితే పందెం కోసం హత్యలు చేసేట్టున్నారు."

పి.ఐ. వెంటనే ఏం మాట్లాడలేకపోయాడు.

అతనికి రాజా నీతి, నిజాయితీల గురించి బాగా తెలుసు. అలాగే రూల్స్ విషయంలో అతనెంత ఖచ్చితంగా ఉంటాడో కూడా ఆయనకు తెలుసు. 'సరోజ' హత్య కేసులో అటు ప్రజల్లోనూ ఇటు డిపార్ట్‌మెంటులోనూ రాజాకు విపరీతమైన పేరు వచ్చింది. తరచుగా మార్చుతున్నా రాజా లెక్క చేయటంలేదు.

"జస్టనవ్ ఫోన్‌వచ్చింది. కాలేజి ఆవరణలో విద్యార్థులంతా చేరి నానాగొడవ చేస్తున్నారట. వాళ్ళకు మీరు క్షమాపణ చెబితేనేగాని సమ్మె విరమించరట"

"నేను వెళ్ళవస్తాను" అన్నాడు రాజా గంభీరంగా.

"వెళ్ళండి. ఆ గొడవలు ముదరకుండా చూడండి" తన భావం వివరిస్తూ చెప్పాడు.

"తప్పకుండా" అంటూ లేచాడు రాజా.

3

విద్యార్థుల్లో ఓ వర్గం నిలబడి అరుస్తున్నారు. వారిలో చాలామంది రౌడీలున్నారు. వారంతా స్టూడెంట్స్‌లా వేషాలేసుకున్నారు. షోడాబండి దగ్గర్లో ఉంచబడింది. వారందరిదగ్గరా రకరకాల మారణాయుధాలున్నాయి. కాలేజికి వెళ్ళాలనుకుంటున్నవారిని బెదిరిస్తున్నారు. అక్కడి వ్యవహారం కాల్పులదాకా పోవచ్చునని కొందరు వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు.

జీప్‌లో కూర్చున్న యస్.ఐ. రాజా కళ్ళు ఎర్రబడి వున్నాయి. జీవితం దుర్భరమయింది. అందులోనూ నిజాయితీగల ఆఫీసర్‌గా పోలీస్ డిపార్ట్‌మెంటులో సాగటం కత్తిమీద సామువంటిది-రెండు ప్రక్కలనుండీ.

కాలేజికి దూరంగా జీపు ఆగింది. దాని వెనుక వ్యాన్ ఆగింది. విద్యార్థులు అంతా గమనించారు. అందరిచేతుల్లోకి

మారణాయుధాలు రావటానికి తయారుగావున్నాయి. ఏమయితే అయింది యస్.ఐని పైకి పంపించాలని కూడా కొందరు నిర్ణయించుకున్నారు.

జీపులోనుండి పాదం బయటపెట్టాడు. వ్యాన్‌లోనుండి బిలబిలమంటూ దిగారు.

రాజా నిలబడి వారివంక చూశాడు.

"మీరిక్కడే వుండండి. నేను వెళ్ళివస్తాను" అన్నాడు యస్.ఐ రాజా.

"సర్. అది ప్రమాదం" హెడ్‌కానిస్టేబుల్ చెప్ప బోయాడు.

రాజా అతని మొఖంలోకి చూశాడు.

"మన ఉద్యోగాలే ప్రమాదకరమైనవి. అవసరమయితే రండి" అంటూ ముందుకు చూశాడు.

విద్యార్థులు గుంపులు గుంపులుగా వున్నారు. వారంద రిలో ఎవరు విద్యార్థులో, ఎవరు కాదో వెంటనే గుర్తు పట్టడం కష్టం. వాళ్ళలోకి వంటరిగా వెళ్ళటం ఓ రకంగా మూర్ఖపు సాహసం అవుతుంది.

రాజా అడుగు ముందుకువేశాడు.

విద్యార్థులంతా దిగ్భ్రమచెంది చూస్తున్నారు.

తమ శత్రువు నడిచివస్తున్నాడు ఎదురుగా

వంటరిగా!

అతని చేతిలో లాఠీ కూడా లేదు.

ఆ మొఖంలో గంభీరత మాత్రం చోటుచేసుకొంది.

ఏ భావం లేనట్లు నడుస్తున్నా చురుకయిన ఆ కళ్ళు ఆ ప్రదేశాన్ని వ్యక్తుల్ని నిశితంగా పరిశీలిస్తున్నాయి.

రాజా వారి ముందుకెళ్ళాడు.

వారెవరిలోనూ కదలికలేదు.

ఓ వింతదృశ్యం చూస్తున్నట్లు అలానే నిలబడిపోయారు. వారికి తెలియకుండానే ప్రక్కకు తొలిగారు. ఇరుప్రక్కలా విద్యార్థులు దారి ఇస్తుంటే నడుచుకుంటూ వెళ్ళి కాలేజి గేటు ముందు ఆగి వెనక్కు తిరిగాడు.

షోడాబుడ్లు పగలలేదు!

మారణాయుధాలు విజృంభించలేదు!

అంతా ప్రశాంతంగా వుంది.

హెడ్ కానిస్టేబుల్‌కు సైగచేశాడు. అందరూ మార్చ్ చేసుకుంటూ వచ్చారు. చూట్టానికదో పెరేడ్‌లావుంది. యస్ ఐ. రాజాగొంతు సవరించుకొన్నాడు.

"మీలో ఎవరైనా కాలేజికి వెళ్ళదలుచుకుంటే నిర్భయంగా వెళ్ళవచ్చు" కంగున మ్రోగింది.

ఒక్కొక్కరే లోపలకు నడవటం ప్రారంభించారు. తిరిగి పట్నంలో రాజాపేరు మారు మ్రోగిపోయింది.

అదలా వుండగా ఆ పిల్లకు జరిగిన అన్యాయానికి తగిన శిక్ష విధించాలంటూ ఓ వర్గం పెద్ద ప్రదర్శన జరిపింది. ఇలాంటి పరిణామాన్ని వారు ఊహించలేదు.

ఆ పెద్దలతో తనకుండే సన్నిహిత సంబంధాల మూలంగా వారిని పిలిచి ఈ వ్యవహారం మంచిగా సెటిల్ చేసుకోవటం బాగుంటుందని సూచించాడు. ఫలితంగా ఆ అమ్మాయిని అవమానించిన వ్యక్తి కాలేజీలో అందరి ముందు "నన్ను క్షమించు చెల్లాయి" అని ప్రాధేయపడ్డాడు.

ఆ సంఘటన అలా గడిచిపోయింది. తమ ప్లాను విజయవంతం కాకపోవటంతో తాత్కాలికంగా వారంతా వెనకడుగు వేశారు.

4

రెండు నెలలు గడిచాయి.

హత్యలతోనూ, కొట్లాటలతోనూ తరచుగా పేపరెక్కే ఆ ఊరు ఈ నడుమ అరుదుగా కనపడుతోంది.

ప్రధానంగా ఆ ఊరిలో రోడ్లన్నీ ఆక్రమించుకోబడ్డాయి. లారీలు, చిల్లర అమ్మకం దారులు బండ్లు, రిక్షాలు, వీటన్నింటని తొలగించి ప్రత్యేకస్థలాలు ఏర్పాటుచేశారు. రఫ్ డ్రైవింగ్ మూలంగా తరచుగా జరిగే ప్రమాదాల్ని తీవ్రచర్యల ద్వారా నివారించారు. వన్‌వే ట్రాఫిక్ కొనసాగించుచున్నారు.

రాత్రిపూట డ్యూటీలో వుంటున్న పోలీసులు తమ తమ ఏరియాల్ని ఖచ్చితంగా విజిట్ చేస్తున్నారు. వ్యభిచార గృహాలు మూసుబడ్డాయి

వీటన్నింటి మూలంగా పోలీసుల్లో కొన్నివర్గాలు కూడా అసంతృప్తిచెందాయి. వారందరూ చిల్లర మామూళ్ళకు అలవాటు పడిపోయారు. ఒక్కసారిగా అవన్నీ తగ్గిపోవటంతో వారు భరించలేక పోతున్నారు.

ముఖ్యంగా పి.ఐ.గారికి తీవ్రంగా అసంతృప్తికలిగింది. యస్.ఐగా రాజా రాకముందు ఆయనకు ఖచ్చితమైన రాబడి వుండేది. పట్టణంలో ఎవరైనా కొట్టుకున్నా, చుట్టు ప్రక్కల ఎలాంటి తగాదాలు జరిగినా ఇరుప్రక్కల నుండీ ఆదాయం లభిస్తుండేది. ఇంక ఖూనీలయితే పండగే.

ఇప్పుడు కేసులు పెండింగులో వుండటంలేదు. స్టేట్‌మెంట్స్, రిపోర్టులు తల్లక్రిందులు కావటం జరగటంలేదు. ఓ రకంగా పి.ఐ.గారికి పనిలేకుండా పోయింది. ఆయన దగ్గరకొచ్చి మొత్తుకునేవారిలో నేరస్థులు, దొంగ పెద్దమనుషులు ఎక్కువ. అలాంటివారందరికీ ఏక పక్షంగా

సహాయం చేయలేదు. ఏం చేయాలన్నా క్రింది నుండి సహకారం లభించాలి. ఆయన పరిస్థితి చాలా ఇరకాటంగా వుంది. అయినా ఆయన బయట పడటంలేదు.

అందుకు కారణం ఆయనకు సాంస్కృతికరంగమన్నా, సాహిత్యరంగమన్నా 'మహా ఇష్టం'. ఆయన పట్టణంలో జరిగే కార్యక్రమాలన్నింటికీ, అతిథిగానో, ఉపన్యాసకుడిగానో పాల్గొంటుంటారు. కాగా ఆయనపట్ల కొందరికి గౌరవాభిప్రాయాలున్నాయి. వాటన్నింటిని రాజామీద డైరెక్ట్‌గా ఎటాక్ చేయటం ద్వారా పోగొట్టుకోవాలని కోరుకోవటంలేదు. అవకాశం కోసం ఆయన ఎదురుచూస్తున్నాడు.

యస్.ఐ. రాజా ఎప్పుడు ఎలా ప్రత్యక్షమవుతాడో ఎవరికీ అర్థం అయ్యేదికాదు. సాయంకాలం అయిదు గంటలకు ఆయన మోటార్ సైకిల్ శబ్దం వినిపిస్తుంటే సామాన్య ప్రజానీకం వింతగానూ, ఆనందంగానూ గమనించేవారు. ఆయనతోపాటు ఎప్పుడూ లాఠీ వుంటుంది. రద్దీగావుండే సెంటర్లో బండి ఆపి పదినిముషాలు నిలబడి పరిసరాలను గమనిస్తుండేవాడు. తిరిగి బండి కదులుతుంది మరోచోటికి.

అలా రాత్రంతా తిరుగుతూనే వుంటాడు. ఆయన ఎప్పుడు నిద్రపోతాడో తెలియదు. ఆదమరిచి నిద్రపోదామని భావించినా ఏ క్షణం రాగలడోననే భయంతో బలవంతంగా డ్యూటీ చేస్తుంటారు పోలీసులు.

మొత్తంమీద పట్టణ ప్రజానీకం ఎలాంటి టెంక్షన్ లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నారు.

వారిమీద బ్రతికే జనం మాత్రం కుట్రలు సాగిస్తూనే వున్నారు.

5

నెలరోజులుదాకా పట్టణంలో శ్రద్ధ తీసుకున్నాక తమ పరిధిలోకి వచ్చే గ్రామాలపట్ల శ్రద్ధవహించాడు రాజా.

అక్కడ చిన్నసైజు 'నాయకుల్ని', గడ్డివాములు తగల బెట్టేవారిని, పురుల్లో ధాన్యం ఎత్తుకుపోయేవారిని పట్టుకొని వాయించేశాడు. అలాంటివారెవరూ తలెత్తటం లేదు.

హెడ్ కానిస్టేబుల్‌గారు నల్లగానూ, మొద్దుగానూ వుంటారు. ఆయన కళ్లెప్పుడూ సంతృప్తితో తళతళ లాడవు. లాటరీలో లక్షరూపాయలొస్తే, పదిలక్షలు రాలేదే అని బాధపడతాడు. ఆయన్ను ఎడారుల్లోకి పంపితే ఆ ఇసక నుండి తైలం తీసి దేశసేవ చేస్తాడు.

ఆయనకో 'బామ్మర్ది' వున్నాడు. ఆయనకు వేరే కార్య క్రమం అంటూలేదు రోజూ తాగుతుంటాడు. మరి తాగ టానికి, తింటానికి, తిరగటానికి ఆయనకు డబ్బులుకావాలి కాబట్టి, వాళ్ళ బావగారు ఎవరినయినా జైల్లో తోసేసి కుళ్ళ బొడిచేయగలరు కాబట్టి, ఆయన ఊరిమీద పడుతుంటాడు. ఆ ఊర్లో పంటలు కోసుకపోతుంటాడు. రౌడీలందరి తరపున వకాల్తా పుచ్చుకొని జనానికి జరిమానాలు విధిస్తుం టాడు. ఆ గ్రామానికి ఆయనో చిన్నసైజు రాజు.

బామ్మర్ది బావగారికి 'అయ్య'గారితో సంబంధాలు బాగు న్నాయి కాబట్టి ఆయన్ని గ్రామం భరిస్తూనేవుంది. అతని మీద రిపోర్టు ఇవ్వటానికి ఎవరూ ముందుకు రాలేదు.

వారందరూ యస్.ఐ. రాజా వచ్చాక పట్టణంలో వస్తున్న మార్పుల్ని గమనించారు. ఆ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలందరూ క్రొత్త యస్.ఐ. గారి పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

రాజాకు హెడ్ కానిస్టేబుల్‌గారి బామ్మర్ది గురించి తెలి

సొచ్చింది. ఆయన కార్యక్రమాలూ, జబర్దస్తీ తెలిసేక అతగాడి విషయం చూడాలనుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ గారి ఎదుట వాళ్ళ బామ్మర్దిని పరామర్శించటం ఇష్టంలేక వేరే పనిమీద బయటకు పంపించాడు.

ఆయన్నటుపంపి తానా గ్రామం వెళ్ళాడు. ఆ సరికి ఆయన మంచి రసపట్టులో వున్నాడు. ఎవరితోనో తగాదా పడుతున్నాడు. పోలీసు జీపును చూడగానే ఆయనకి మరింత ఉత్సాహం వచ్చింది.

"మరి సంపేగల్నా కొడుకల్లారా....జైల్లో తోయించే గల్నా బిడ్డల్లారా, ఏమనుకుంటున్నారో"

మిగతా అందరూ భయంతో మెల్లగా ప్రక్కకు తప్పుకోవటం ప్రారంభించారు.

రాజా జీపు దిగాడు. బామ్మర్ది ఇంకా అరుస్తూనే వున్నాడు. రాజా వెళ్ళాడు.

"జైలు నీ బాబుగాడిదిరా" అంటూ మెడమీద చెయ్యి వేసి నెట్టాడు.

"ఏంటిది నేనెవర్నో మీకు తెలీదనుకుంటా" అన్నాడు కోపంగా బామ్మర్ది.

"నువ్వు ఎవడివైతే ఏంటిబే స్టేషన్‌లో చెబుదువుగాని పద" అంటూ నెట్టాడు.

బామ్మర్ది జీపుమందు బొక్కబోర్లగా పడ్డాడు. గ్రామ ప్రజలంతా ఆనందంగా చూస్తుంటే బామ్మర్ది 'పరువు' పోయిందనే కోపంతో లేచాడు. వళ్ళంతా దుమ్ము.

"మా బావయ్యతో చెప్పి."

"ఎవడురా నీ బావ" అంటూ ఇంకో గుద్దుగుద్దాడు. తిరిగి అంతదూరంలో పడ్డాడు.

"వాడ్ని లోపలెయ్యండి" అన్నాడు. ఇద్దరు కొని స్టేబుల్స్ లోపలవేశారు. జీపులో అరుస్తూనే వున్నాడు. రాజా వెళ్ళి మొఖంమీద కొట్టాడు. పళ్ళన్నీ కదిలిపోయి నట్లయినాయి.

"అరిచావా ప్రాణం తీస్తా."

బామర్ది నోరు మూసుకుపోయింది.

స్టేషన్‌కు వెళ్ళాక సెల్‌లో పడేసి స్వయంగా వెళ్లాడు. అరగంట తర్వాత కర్చీఫ్‌తో మొఖం తుడుచుకుంటూ బయటకు వచ్చాడు.

మరుసటిరోజు హెడ్ కానిస్టేబుల్ టూర్‌నుండి వచ్చాడు. బామ్మర్దిని చూసుకొని గుండెలు బాదేసుకొన్నాడు.

"ఇంత దారుణమా, సాటి ఉద్యోగస్థుడి మనిషనయినా లేకపోయిందే. నా బామ్మర్దని కొట్టడానికే నన్ను ఊరు పంపించారు" అంటూ తెగ బాధపడిపోయాడు.

రాజా ముందుకు వెళ్ళి తలవంచుకొని అన్నాడు.

"ఆడు నా బామ్మర్దని తెలిపి ఇలా చేయటం ఏం బాగుండలేదు. ఆడేమన్నా సేస్తే నాతో ఓ ముక్క అంటే నేను తిట్టేవాడిని" అని మాత్రం నిరసన తెలియ చేసు కున్నాడు

"నువ్వేం బాధపడకు. నీ బావమరిది తిడితే వినే స్థాయి దాటిపోయాడు. ఆ గ్రామంలోకి వెళ్ళి కనుక్కో, మనవాడి లీలలు తెలుస్తాయి. మన ఉద్యోగాల అండచూసుకొని మన బంధువులు బరితెగించకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే."

హెడ్ కానిస్టేబుల్ శాల్యూట్ కొట్టి వెనక్కి తిరిగి వచ్చాడు. ఈ విషయం మీద గొడవచేద్దాం అని కొందరు పట్టుబట్టినా అతను ఒప్పుకోలేదు. తనకు చెందిన కొన్ని

లంచగొండి కేసులు ఆయన దగ్గర రికార్డ్‌గా వుండి పోయాయి.

చేసేదేం లేక 'అయ్య'గారి ముందు మొర పెట్టుకున్నాడు. పి ఐ గారు గంభీరంగా విన్నారు.

అంతకంటే ఆయన మాత్రం ఏం చెయ్యగలరు!

6

మర్నాడు—

పట్టణంలో సంచలనం కలిగించే సంఘటన ఒకటి జరిగింది.

ఆ పట్టణ ప్రముఖుడూ, వ్యాపారస్థుడూ, వివిధ సంస్థల అధ్యక్షుడూ అయిన ఓ పెద్ద మనిషి తన తమ్ముడితో కలిసి తన భార్యను తగలేశాడు.

ఆమె తమ్ముడు పుట్టింటికి తీసుకెళ్ళటానికి వచ్చాడు. అతని కళ్ళముందే ఆమెకు నిప్పంటించారు. ఆ కుర్రవాడు తన అక్కను రక్షించమంటూ ప్రాధేయపడ్డాడు. అయినా వారి హృదయాలు కరగలేదు. వద్దని ప్రాధేయపడుతున్నా ఆ అమ్మాయి భర్త బకెట్ నీళ్ళు తెచ్చి ఆమె మీద గ్రుమ్మరించాడు. చుట్టుప్రక్కల వారు ప్రోగవటంతో హాస్పిటల్‌కు తీసుకుపోయారు. హాస్పిటల్‌కు వెళ్ళే దారిలోనే లాయర్ గారిని కలుసుకున్నాడు భర్త. ఆమె పోయింది.

"ఇది హత్య" అంటూ ఆమె తమ్ముడు ప్రకటించాడు. ఆ చుట్టుప్రక్కలవారు ఆ విషయం ధృవీకరించారు.

రోజూ ఆమెను విపరీతంగా కొట్టేవారని, ఆమె కేకలు వినపడకుండా రేడియో ఫుల్‌సౌండ్ పెట్టేవారని, చెప్పారు. వాళ్ళ అబ్బాయి కూడా 'నాన్న రోజూ అమ్మని సిగరెట్‌తో తొడలమీద కాల్చేవాడని' చెప్పాడు. "బాబాయి అమ్మను కొడుతుండేవాడు" అంటూ కూడా చెప్పాడు. ఈ హత్యకు

కారణం అయిన వారందరినీ నిర్బంధంలోకి తీసుకున్నారు.

పట్టణంలో వున్నవారంతా ఈ సంఘటనతో చలించి పోయారు.

పోస్టుమార్టం అయ్యాక శవాన్ని అప్పగించారు. విద్యార్థులూ....యువకులూ ఆ శవాన్ని ఊరేగించారు. ఆమె భర్తను కూడా అప్పగించమని కోరారు. యస్.ఐ. సరే నన్నాడు. శవంక్రింద వాడ్ని కట్టేశారు. వాడి ముఖంమీద అంతా ఊశారు. పేడనీళ్ళు పోశారు. ఇంటింటికి తీసుకెళ్ళి.

"చూడండమ్మా. ఆమెను శవంగా మార్చింది వాడు. వాడి కెలాంటి శిక్ష విధిస్తారో వెయ్యండి."

కొందరు స్త్రీలు ఘాంద్రించి ఊశారు.

చీపుర్లతో కొట్టారు.

చెప్పుల దండలు వేశారు.

క్రుళ్ళిన టమేటాలు....కూరలు విసిరారు.

శవయాత్ర సాగుతూనే వుంది. అయినా వాడు అవన్నీ భరించి నిస్సిగ్గుగా బ్రతికే వున్నాడు.

బెయిల్‌మీద బయటికొచ్చాక వారి కులంలోని బేవార్స్ రకాల్ని కూడగట్టాడు.

"దేశంలో ఇలాంటివి ఎన్ని జరగటం లేదు. అయినా మన విషయంలోనే ఎందుకలా జరిగింది. మన కులం వారు పైకి రావటాన్ని ఇక్కడ భరించటం లేదు. అందుకే కుట్రతో ఇలా చేశారు. కాగా మన కుల ప్రాబల్యం కాపాడుకోవాలంటే మనం ఐక్యంగా ఈ కుట్రల్ని ఎదుర్కోవాలి." అంటూ శపథం పూనారు.

ఆ ప్రముఖుడి కులం సి.ఐ. గారి కులం ఒకటే!

"ఈ యస్.ఐ. ఇక్కడవుంటే మనకు మరణశిక్షే" అందా వర్గం.

"పై లెవల్లో తీవ్రంగా కృషిచేసి వెంటనే బదిలీ చేయించాలి."

7

చాలా కాలంగా ఎదురు చూస్తున్న అవకాశం వారికి లభించింది.

నలభై సంవత్సరాల మహిళ బహిర్భూమికి వెళుతుంటే ఓ వ్యక్తి మానభంగం చేయబోయాడు. సహజంగానే ఎస్.ఐ.లో వున్న ఆవేశం ఈ వార్త వినగానే కట్టలు త్రెంచుకుంది. ఆ వ్యక్తిని తీసుకొచ్చి విపరీతంగా కొట్టేశాడు. అతని కాలు విరిగిపోయింది.

ఆవేశం దిగాక రాజా పశ్చాత్తాపం చెందాడు. అతన్ని హాస్పిటల్లో జాయిన్ చేయించాడు. అతనికి నష్టపరిహారం యివ్వగలనంటూ హామీ ఇచ్చాడు.

ఆ వ్యక్తి హాస్పిటల్‌లో వుండగానే, యస్.ఐ. రాజా పాశవిక చర్యకు నిరసనగా పట్టణంలో తీవ్ర నిరసన మొదలయింది. ఈ సంఘటనమీద న్యాయవిచారణ జరిపించకుంటే తాను ఛస్తానంటూ ఓ శిబిరం వేసుకొని ఓ యువజన నాయకుడు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు.

"యస్.ఐ. రాజా దుర్మార్గం."

"నశించాలి."

"యస్.ఐ. అక్రమాలపై."

"దర్యాప్తు జరిపించండి."

"యస్ ఐ. ను తక్షణం."

"బదిలీ చెయ్యాలి."

"రంగయ్య విషయంలో."

"విచారణ జరిపించాలి"

పట్టణంలో ప్రదర్శనలు జరుగుతున్నాయి. బహిరంగ

సభలు పెట్టారు. తాసిల్దారుగారికి, కలెక్టరు గారికి వినతి పత్రాలు సమర్పించబడ్డాయి.

పి.ఐ.గారు జరుగుతున్న విషయాలన్నింటిమీద సవివరమైన రిపోర్టు పంపించారు.

డిపార్టమెంటల్ విచారణకు ఆదేశం ఇవ్వబడింది

వాటితోపాటు మరో పరిణామం కూడా ఏర్పడింది.

"యస్.ఐ. రాజాను బదిలీ చేయించాలనే కుట్రల్ని ఖండించండి" అంటూ కరపత్రాలు పంచబడ్డాయి. వారు కూడా బహిరంగ సభలుపెట్టి యస్.ఐ రాజాను బదిలీ చేయించటానికి ఏ ఏ వర్గాలు కుట్రలు పన్నుతున్నాయో వివరించి ఆ వాదనలకు ప్రభుత్వం మోసపోకూడదంటూ హెచ్చరించారు.

ఆ విధంగా పట్టణంలో యస్.ఐ. రాజా విషయంలో రెండు వర్గాలుగా ఏర్పడి పనిచేస్తున్నారు. స్థానిక రాజకీయ పార్టీలు కూడా ప్రత్యక్షంగానూ. పరోక్షంగానూ, అనుకూలంగానూ. వ్యతిరేకంగానూ పాల్గొంటున్నాయి.

అన్ని పార్టీల్లోని అభ్యుదయవాదులు యస్ ఐ బదిలీని వ్యతిరేకిస్తున్నారు. అందుకు కారణం చాలాకాలం తర్వాత యస్.ఐ. రాజా వచ్చాక పట్టణంలో ప్రశాంత పరిస్థితులు నెలకొనటమే. తిరిగి పూర్వ పరిస్థితులు పునరుద్ధరింపబడకూడదని వారి ఆరాటం.

యస్. ఐ. రాజా మాత్రం ఏ విషయాలూ పట్టించుకోవటం లేదు. తన డ్యూటీ తాను చేసుకుంటున్నాడు.

ఆ రోజు డిపార్టమెంటల్ విచారణ ప్రారంభమవుతోంది. డిపార్టమెంటుకు చెందిన పెద్దలు విచ్చేశారు.

అప్పుడు వారిని ఆశ్చర్యపరిచే అరుదయిన దృశ్యం ఒకటి కనపడింది.

ఆ చుట్టుప్రక్కల గ్రామాలనుండి, లారీలద్వారా, ట్రాక్టర్లద్వారా, ఎడ్లబండ్లమీద ప్రజానీకం వచ్చారు. వారంతా యస్.ఐ బదిలీ ఆపాలని నినాదాలు చేస్తున్నారు.

వారు ఇలాంటి ఊరేగింపుల్ని చాలా చూశారు. రాజకీయ నాయకులకూ, సినిమాతారలకు ఇంత ప్రచారం లభిస్తుంది. కానీ ఒక యస్.ఐ. బదిలీకి వ్యతిరేకంగా ఇంతగా ప్రజలు కదలటం తమ డిపార్టమెంటుకు చెందిన వ్యక్తిగా రాజామీద కొందరికి గౌరవం కలగగా, కొందరికి ఆ అభిమానం చూసి ద్వేషం కలిగింది.

ఆ ప్రజలనుండి ప్రతినిధివర్గం అధికారుల దగ్గర కొచ్చింది.

"యస్.ఐ. రాజాను ఇక్కడే ఉంచాలి.

అది మా ప్రజానీకపు కోర్కె" అంటూ వివరించారు.

"సారీ ఇది మా డిపార్టమెంటు వ్యవహారం. ఎవర్ని ఎక్కడ ఉంచాలనే విషయంలో మా నిర్ణయాలు మావి."

"కాదని మేం అనం. అయితే యస్.ఐ. వచ్చాక మా పట్టణంలో శాంతి భద్రతలు బాగుపడ్డాయి. అందుకే ఆయన్ను తక్షణం బదిలీ చేయాలని కుట్రలు పన్నుతున్నారు"

"ఎవరి కుట్రలకూ మేం బలికాం"

"మంచిదే. ఏ రకంగా చూసినా బదిలీచేయటం జరిగితే అన్యాయమే అవుతుంది. అదే జరిగితే చాలా గొడవలు జరుగుతాయి. ఇది మా విజ్ఞప్తి!"

"ఇట్సాల్ రైట్" అన్నారంతా గంభీరంగా.

తిరిగి అందరూ నినాదాలు చేసుకుంటూ బయలుదేరి వెళ్ళిపోయారు.

డిపార్టమెంటల్ విచారణ ప్రారంభమయింది. రంగయ్య

తీసుకురాబడ్డాడు. ఈ దెబ్బతో యస్.ఐ. అహంకారం అణిగిపోతుందని అందరూ ఆశిస్తున్నారు. హెడ్ కాని స్టేబుల్. సి ఐ. ఇంకా డిపార్టుమెంటులోని బాధితులు ఈసారితో రాజా రికార్డు పాడుకావటం. ట్రాన్స్ఫర్ కావటం ఖాయం అనే ఆనందంలో వున్నారు.

రంగయ్య విషయంలో పెద్ద కుట్ర జరిగింది. డిపార్ట మెంటు మనుష్యులనుండి, కొంతమంది 'పెద్దల' దాకా రంగయ్యకు జీవితంగురించి 'దిగులొద్దని' హామీ ఇచ్చారు. కాలు లేకపోయినా బ్రతికే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

"నీ పేరేమిటి?"

"రంగయ్య"

"కాలికేమిటి కట్టు?"

"విరిగిందండి"

"ఎలా విరిగింది?"

భయంకరమైన నిశ్శబ్దం....

రాజా మొఖం ప్రశాంతంగా వుంది.

తుఫాన్కు ముందుండే ప్రశాంతత!

అందరూ చెవులు రిక్కించారు.

"మొన్న వస్తుంటే కాలుజారి ఓ గోతిలో పడిపోతే ఇరిగిపోయిందండి"

"నో" అరిచాడు సి.ఐ.

అంతలోనే తమాయించుకున్నాడు.

అందరూ ఆశ్చర్యంగా చూశారాయన వంక.

"నీకేం భయంలేదు. నిజం చెప్పు?"

"నిజమే బాబు"

"నీ ప్రాణాలకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది" స్ట్రెస్ చేశారు.

"నిజమే బాబు. నేను చెప్పేది నిజంగా నిజం. నా కాలు ఇరగటానికి ఆ బాబు కారణంగాదు. కామంతో నా కళ్ళు మూసుకుపోయాయి. తల్లిలాటి ఆడదాన్ని సెరపట్టా లనుకున్నాను. నా కిలా కావలసిందే. ఇందుకా బాబు నేర వేం లేదు. ఆయనమీద సెప్పమని ఎందరెన్ని చెప్పినా, ఎంత డబ్బిస్తానన్నా....నా వల్లకాదు బాబూ....నావల్లకాదు. మీకు దండవెడతాను. ఆ బాబును ఇక్కడినుండి మార్చకండి బాబూ మార్చకండి....ఆయన దేవుడు బాబూ....దేవుడు"

భోరున ఏడుస్తున్నాడు రంగయ్య.

అధికారులంతా నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

హెడ్‌కానిస్టేబుల్ పి.ఐ.ల మొఖాలు మాడిపొయ్యాయి.

యస్.ఐ. రాజాలో కలిగిన ఉద్విగ్నతనుండి రెండు కన్నీటిచుక్కలు బయటపడ్డాయి. □

కత్తి పట్టిన వీర వనిత

ఎల్. రాజేశ్వరి

ముఖాన్ని కప్పేస్తోంది. అతను ఆమెకేసి చూస్తూ అదోలా నవ్వుతున్నాడు ఎప్పుడూ చూసిన ముఖంలా అనిపించటం లేదు.

తననికాదేమో నన్నట్టు మీనాక్షి ముఖం తిప్పేసుకుంది. బస్టాండులోని చాలామంది వ్యక్తుల చూపులు తన మీదే వున్న విషయం ఆ ఒక్కసారి చూపులోనే గ్రహించ గలిగింది.

భాగ్యనగరంలో ఆడవాళ్ళని చాలా గౌరవంగా చూస్తారు 'పైకి.' మళ్ళీ, అవకాశం దొరికితే ఆ స్త్రీనే నాశనం చెయ్యటానికి కూడా వెనుతియ్యరు. ఎవరు మంచి వారో ఎవరు గూండాయో తెలుసుకోవటం చాలా కష్టం! ఆ గడ్డపు వ్యక్తిని చూడగానే ఆమెకు సదభిప్రాయం కలగలేదు.

అతను వున్నచోటునించి కదిలాడు. ఆమెకు మరింత దగ్గరగా వచ్చాడు.

"మిమ్మల్నేనండి. మీ పేరు మీనాక్షియే కదా!" అన్నాడా యువకుడు.

మీనాక్షి అతనివంక సూటిగా చూసి, "నాతో మీకేం పని?" అన్నది.

"చిన్ననాటి స్నేహితుడ్ని అంత తొందరగా మర్చి పోవటం, గడ్డిపరకలా తీసెయ్యటం చాలా అన్యాయం!" అతడు నవ్వుతున్నాడు. కాని ఆ నవ్వుని గడ్డం కప్పే స్తోంది. అతనికళ్ళు కొంటెతనాన్ని చిందిస్తున్నాయి.

"సారీ....మీ రెవరో నాకు నిజంగా గుర్తులేదు...." తప్పించుకోవాలని ప్రయత్నించింది మీనాక్షి. ఆమెక్కావల సిన నూట ముప్పయిఅయిదో నంబరు బస్సింకారాలేదు. వెంకటరమణ నగర్ కాలనీకి వెళ్ళాలి.

అతను మళ్ళీ నవ్వి, "నా పేరు వైకుంఠం. మీ చిన్ననాటి స్నేహితుడ్ని. మనిద్దరం ఎస్సెసెల్సీ వరకు క్లాసు మేట్సు." అన్నాడు.

ఆమెకు చటుక్కున గుర్తొచ్చింది. ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం సంగతి. అప్పుడు తెలిసీ తెలియని వయసు. ఎదిగే వయసులో వున్న కుర్రాళ్ళు. ఆ తర్వాత నాలుగైదేళ్ళకే గుర్తు పట్టరాకుండా మారిపోయిన వాళ్ళెంతమందో!

మగవాళ్ళయితే యింకా ఘోరంగా మారిపోతుంటారు. మీసకట్టు కూడా సరిగా రానివయసు నుంచి, ఆజానుబాహులుగా మారటమో, అడ్డ కురచగా పెద్ద పెద్ద పొట్టలతో లావయిపోవటమో, సన్నగా రివటలా జబ్బుపడి లేచిన వాళ్ళలా అయిపోవటమో—జరగటానికి యీ పదిహేనేళ్ళ కాలం చాలు!

అందుకే ఆడపిల్లల్ని గుర్తుపట్టినంత తేలిగ్గా, చిన్నప్పుడు కల్సి చదువుకున్న మగపిల్లల్ని గుర్తుపట్టడం, గుర్తుపెట్టుకోవటం - కష్టం!

అయితే అతని పేరునిబట్టి ఆమె గుర్తుపట్టేసింది. వైకుంఠంలాంటి పేర్లు అరుదుగా వుంటాయి. తమ క్లాసులో వైకుంఠం అనే కుర్రాడుండేవాడు. ఉత్త ఆకతాయి కుర్రాడు. పాఠాలు సరిగా చెప్పనిచ్చేవాడు కాదు. మాష్టర్లని అసందర్భమైన ప్రశ్నలతో వేధించేవాడు. మాస్టార్లతోబాటు, పిల్లల ఆగ్రహానికి కూడా గురయ్యేవాడు.

ఓసారి లెక్కల మాస్టారు బోర్డుమీద లెక్క చేస్తుంటే అల్లరిపెట్టాడు - చాక్‌పీసులు గురిచూసి ఆయన బట్టబుర్ర కేసి కొట్టి.

ఆయన అసలే చండశాసనుడని పేరున్నవారు. స్కూల్లో

అందరికీ ఆయనపట్ల భక్తీ భయం రెండూ వున్నాయి. లెక్కల్ని అరటిపండు వలిచి చేతిలో పెట్టినంత తేలిగ్గా చక్కగా విడమర్చి చెప్పేవాడు. లెక్కలంటే భయపడే వాళ్ళని కూడా అందులో నిష్ణాతుల్ని చేశాడాయన. అలాంటి మాష్టార్ని చాక్‌పీసుతో కొట్టడం అమానుషమే కాదు, అందుకెంతో ధైర్యం కావాలి!

చటుక్కున వెనుతిరిగిన మాష్టారి దృష్టి సూటిగా వైకుంఠంమీద పడింది. అంతే, ఆయన పరశురాముడై పోయాడు. ఒక్కసారిగా రెండంగల్లో వెళ్ళి వైకుంఠాన్ని జుట్టు పుచ్చుకుని వీపుమీద వంచి గుద్ది, గెంటేశాడు. ఆ అదురుకు వైకుంఠం వచ్చి ఆడపిల్లలు కూర్చున్న డెస్క్ మీద పడిపోయాడు. తల డెస్కుకోణానికి కొట్టుకుని చిట్లింది. రక్తం ధారకట్టింది.

లెక్కల మాస్టారి ఆవేశం చప్పున చల్లారిపోయింది. ఆయనే వెంటనే గాయానికి ప్రథమచికిత్స చేసి వైకుంఠాన్ని హాస్పిటల్‌కి వెంటబెట్టుకుపోయాడు. అదిగో ఆనాటి దెబ్బ తాలూకు మచ్చ నుదుటిమీద స్పష్టంగా కనిపిస్తోంది!

ఆమె ముఖకవళికల్నే జాగ్రత్తగా చూస్తున్న వైకుంఠం "హమ్మయ్య గుర్తొచ్చానన్నమాట, ధన్యుడ్ని!" అన్నాడు.

మీనాక్షికి అతనితో మాట్లాడానికి చాలా యిబ్బందిగా వుంది. క్లాస్‌మేట్ అయితే కావచ్చుగాని, అలాంటి చరిత్ర వున్న వ్యక్తితో మాట్లాడటం తనకి అంతరాంతరాల్లో ఏ మాత్రం నచ్చలేదు!

మర్యాదకి పైకిమాత్రం, "ఆ గుర్తొచ్చింది!" అన్నది పొడి పొడిగా.

"పెళ్ళయిందా!" వైకుంఠం అడిగిందానికె మౌనంగా తలూపింది.

"పిల్లలా?"

"ఇద్దరు" అయిష్టంగానే చెప్పింది.

"ఫుల్‌స్టాపా?" అతను తన అంతరంగిక విషయాలను తరచి అడగటం ఆమెకు నచ్చలేదు. అందుకే సమాధానం చెప్పలేదు.

"ఉద్యోగం చేస్తున్నట్టున్నారు?"

మౌనంగా తలూపింది.

"మీవారు ....?"

"ఆయన బ్యాంకులో చేస్తున్నారు."

"మీరు ....?"

చెప్పింది.

"ఇకనేం దాదాపు మూడువేలు సంపాదించుకుంటున్నారన్నమాట యిద్దరూ కలిసి. ధనవంతులకిందే లెక్క!"

"ఎంతొచ్చినా యీ మహానగరంలో ఏ మూలకీరాదు. అసలు నేనుద్యోగం చేసేది కూడా వారి జీతం సరిపోకనే...."

"గుడ్ గుడ్....నా గురించి అడగరేం?"

నిజానికి ఆమెకు అతని గురించి తెల్సుకోవాలని ఏ మాత్రం ఆసక్తిలేదు. కాని అతనలా అన్నాక మర్యాదకు, "ఏం చేస్తున్నారు?" అన్నది.

"నిరుద్యోగం!" అని అదో పెద్ద జోక్ అన్నట్టు పగలబడి నవ్వాడు.

బస్ స్టేజిలోవున్న వాళ్ళంతా దాదాపు అతనివంక, మీనాక్షి వంక మార్చి మార్చి చూశారు. మీనాక్షికి ఒంటికి కారం రాసుకున్నట్టనిపించింది. ఏమిటీమనిషి? ఏ మాత్రం మేనర్సు లేకుండా....మనసులోనే విసుక్కుంది.

"మీరెక్కడుంటున్నారు?" అడిగాడు ఆమె మాట్లాడక

పోవటంచూసి.

ఇదెక్కడి తద్దినంరా బాబూ అనుకొంటూ "వెంకట రమణనగర్ కాలనీ" అన్నది.

"నేను నారాయణగుడాలో వుంటున్నానండి. అక్కడో స్నేహితుడియింట్లో ఆశ్రయం దొరికింది. వుద్యోగంకోసం కాళ్ళరిగేటట్టు తిరుగుతున్నాను. ఏదీ దొరకలా...." అన్నాడతను.

"నీ ముఖానికి ఉద్యోగమెవడిస్తాడు? చూడగానే గూండాలావున్నావని అవతలికి పొమ్మంటారు" అనుకున్నది మనసులోనే.

"మీ యింటికి రమ్మని మాటవరసకైనా అన్నారు కాదు!" అన్నాడు నిష్ఠూరంగా.

'నిన్నా....! కోరి కొరివితో ఎవరైనా తల గోక్కుంటారా ఎవరైనా....' అనుకున్నది మీనాక్షి.

వైకంఠం తన ధోరణిలో తనున్నాడు.

"అవునండీ, యిప్పుడు ప్రకాశరావెక్కడున్నాడో....?" అన్నాడు జనాంతికంగా.

మీనాక్షి తుళ్ళిపడింది. ఇప్పుడు ప్రకాశరావు సంగతి ఎందుకు ప్రస్తావిస్తున్నట్టు? ప్రకాశరావుపట్ల తనకు తెలిసీ తెలియని ఆ వయసులో అదో విధమైన ఆకర్షణ వుండేది. క్లాసులో అన్నింటా ఫస్టువచ్చే అతనంటే తనకెందుకో తెలియకుండానే యిష్టం ఏర్పడింది. అతను కూడా క్లాసులో తనకన్న అందమైన అమ్మాయిలున్నా తనంటే ప్రత్యేక శ్రద్ధ కనపరిచేవాడు.

తమ సాన్నిహిత్యాన్ని ఎవడో ప్రబుద్ధుడు గోడలకి ఎక్కించిననాడు తను తలెత్తుకొని స్కూల్లో తిరగలేక పోయింది. అందుకు వైకుంఠమే కారణమని అప్పట్లో

తను అనుమానించింది కూడా. అలాంటి మనిషి యిప్పుడు అనుకోకుండా ఎదురుపడి ఆనాటి సంఘటన గుర్తు చేయ టంలో అతని ఉద్దేశ్యమేమిటి? పాడుమనుషులు, పాడు లోకం....స్పష్టంగా విసుక్కుంది మీనాక్షి.

"సారీ, అతని విషయం గుర్తుచేసి మీ కేదైనా బాధ కలగజేశానేమో....చూడండి, మిమ్మల్ని నువ్వు అనిపిలిచే అధికారం నాకు లేదా? 'మీరు' అని మన్నిస్తుంటే మనిద్దరి మధ్య ఎంతో అగాధమున్నట్టు, మనం చిన్ననాటి స్నేహితు లం కాదన్నట్టు అనిపిస్తోంది....ఏమంటారు?"

"చిన్నప్పుడు వ్యక్తిత్వాలు పూర్తిగా వికసించకముందు ఎలా పిల్చుకున్నా ఫరవాలేదు. ఇప్పుడు అలా పిలిపించు కోవటం నా కిష్టం లేదు. అంతేకాదు. యింకోసారి మనం కల్సుకోవటం కూడా నా కిష్టంలేదు. గుడ్ బై!" అంటూ అప్పుడే ఆగిన తొమ్మిదోనంబరు బస్ ఎక్కేసింది. ఖైరతాబాదు జంక్షన్‌లో దిగి నడవాల్సి వుంటుంది యీ బస్ ఎక్కితే! అయినా ఫరవాలేదు. ఈ మనిషిని తప్పించు కోవటాని కంతకన్న మార్గంలేదు.

2

మూడోరోజు యింటికొచ్చేసరికి భాస్కర్రావు ఎవరి తోనో మాట్లాడుతూ కనిపించాడు. ఆ ఎవరో పోల్చుకునే సరికి ఆమెకు ఒంటిమీద తేళ్ళు, జెర్రులు పాకుతున్నట్టని పించింది.

అతను వైకుంఠం!

అతనికి తన యిల్లెలా తెలుసు? బహుశా నిన్న తనతో బాటు తెలియకుండా ఫాలో అయి తెల్సుకున్నాడన్నమాట. బాస్టర్డ్! వీడి కిదేంరోగం? ఆయనతో ఏం చెప్పాడో?

ఆ రోజు శనివారం కావటం వల్ల బ్యాంకు రెండు

గంటలతో మూసెయ్యటంతో ఆయనకి పెందలాడే రావటానికి వీలయింది. అది అవకాశంగా తీసుకుని యీ వైకుంఠం తనింట్లో బైఠాయించి అవాకులు, చవాకులు వాగుతున్నాడు.

ఎంత గుండె ధైర్యం? బహుశా ప్రకాశం గురించిన తన చనువుగురించి రంగులుపూసి చెప్పలేదుకదా! తమ పరిచయం స్కూల్ ఫైనల్‌తోనే ఫుల్‌స్టాప్ పడింది ఆ మాటకొస్తే పవిత్రమైన తమ స్నేహం గోడలకెక్కిననాడే, దానికి పూర్తిగా చరమగీతం పాడేసింది తను!

కాని, వైకుంఠం దాన్ని సజీవంగా చిత్రించి చిలవలు పలవలు అల్లి భర్త మనసులో విషం చిమ్ముతుండవచ్చు. కాని ఆయన సంగతి తనకు తెల్సు. తనంటే యీషణ్మాత్రం అనుమానం లేదు. ఉంటే తనని ప్రోత్సహించి యీ ఉద్యోగంలో చేరమనేవారే కాదు!

కాని.... ఒక్క విషబిందువు చాలు ... కడివెడు పాలని కలుషితం చేయటానికి.

"హలో, మీనా, యీాయన మీ క్లాస్‌మేట్ అట కదా! నాకెప్పుడూ చెప్పలేదే !?" అన్నాడు భాస్కర్రావు.

మీనాక్షి వైకుంఠంవైపు చురుగ్గా చూపింది. అతను నవ్వుతున్నాడు. ఆ నవ్వు ఆమెకు కంపరం పుట్టించింది. గడ్డం వెనకనుంచి కూడా ఆ నవ్వు స్పష్టంగా కనిపిస్తోంది. ఎందుకా వెర్రినవ్వు? నిన్ను సాధించాను సుమా అని గర్వంగా, క్రూరంగా నవ్వుతున్న నవ్వు అది!

తనేదో అనాలి కాబట్టి మాటవరసకు "ఆఁ. ఆయన యీ వూళ్ళో వున్నసంగతి మొన్ననే తెలిసింది. బస్టాప్‌లో కనపడి చెప్పాడు." అని తుంచేసింది.

వైకుంఠం వెంటనే, "అవునండి. అడ్రసు అడిగి

తెల్పుకున్నాను. ఈరోజు వీలయింది. ఓసారి మీ యిద్దర్నీ చూసిపోదామని వచ్చాను. మీ పిల్లలెవరూ కనిపించరేం?" అన్నాడు.

మీనాక్షి అక్కడ నిలబడటం యిష్టంలేక ఏదో అర్జంటు పనున్న దానిలా లోపలికి వెళ్ళిపోయింది.

భాస్కర్రావు చెప్పుతున్నాడు "ఇద్దరూ వుద్యోగాల మీద పోతే వాళ్ళ ఆలనా పాలనా ఎవరు చూస్తారు? పెద్దవాడిని కాన్వెంటు హాస్టల్లో వేశాం. పాపని కొన్నాళ్ళు బేబీ కేర్ సెంటర్లో వుదయం యిచ్చేసి సాయంత్రం తెచ్చేసుకునేవాళ్ళం. మూడేళ్ళు నిండాయి. ఈ సంవత్సరమే నర్సరీలో చేర్చి హాస్టల్లో పెట్టేశాం."

ఫార్మాలిటీగా కాఫీలు పంపించక తప్పలేదు మీనాక్షికి. ఎలాగో హాల్లోకి వచ్చి కాఫీని యిచ్చేసి వంటగదిలోకి వచ్చేసింది వైకుంఠం తిరిగి వెళ్ళేవరకు బయటికి రాలేదు.

భాస్కర్రావు ఆ తర్వాత కేకేసి చెప్పాడు. "మీనూ, వైకుంఠంగారు వెళ్ళిపోతున్నారు" అంటూ.

తను వంటగదిలోంచే సమాధాన మిచ్చింది.

"స్టవ్ మీద సూపు పెట్టేనిప్పుడే, నేనొస్తేమాడిపోతుంది! అలాగేనని చెప్పండి!" అని.

భాస్కర్రావు రెండు నిమిషాల తర్వాత సరాసరి వంటగదిలోకి వచ్చేసి, "అదేమిటోయ్, పాపం అతనేమనుకుంటాడు? కర్టసీకయినా ఒకసారి బయటకొచ్చావుకాదు!" అన్నాడు నిష్ఠూరంగా.

"అబ్బ, ప్రతివాడికీ ముందుపడి చెప్పటం నా వల్లకాదు బాబూ! ఏదో తెలిసినవాడు కదా అని, పలకరిస్తే మాట్లాడాను. అంత మాత్రానికి యింటికి రావాలా? పిలవని పేరంటానికొచ్చే యిలాంటి వాళ్ళను గుమ్మంలోనించే

వెనక్కి పంపేస్తేనేగాని బుద్ధి రాదు. ఈయనగార్ని ఎవరు రమ్మని ప్రాధేయపడ్డారుట?" అంటూ రుసరుసలాడింది.

3

సోమవారంనాడు సాయంత్రం వస్తూనే కబురు మోసు కొచ్చాడు భాస్కర్రావు.

"మీనూ, యీ రోజు మీ ఫ్రెండు వైకుంఠం మా బ్యాంక్‌కి వచ్చాడోయ్!" అన్నాడు.

మీనాక్షికి గుర్తుగావుంది. ఏలిన్నాటి శనిలా వీడిలా దాపరించాడేం అనుకున్నది. అతనిపట్ల ఏ మాత్రం ఆసక్తి చూపకూడదని నిర్ణయించుకుంది.

భాస్కర్రావు చెప్పుకుపోతున్నాడు, "సెల్ఫ్ ఎంప్లాయి మెంటు స్కీము కింద లోన్ యిప్పించమని వచ్చాడు. ఇద్దరు ష్యూరిటీ కావాలన్నాడు. నారాయణగూడాలో వున్న తన స్నేహితుడు ఓ ష్యూరిటీ యిస్తాడన్నాడు. రెండోది అడిగితే, నాకు మీకన్న ఆప్తులెవరున్నారు? మీరుగాని, మినాక్షిగారు గాని యివ్వలేరా?" అనడిగాడు."

"కొంపతీసి ఒప్పుకున్నారా?"

"అదేం? అతను తెలిసిన వాడేకదూ?"

"ఎప్పుడో చదువుకునే రోజుల్లో తెల్సు. ఇప్పుడు అత నెవరో, మనమెవరమో! అయినా యిన్నాళ్ళ తర్వాత అత నెలాంటి వ్యక్తో ఎన్ని వ్యసనాలను వంటబట్టించుకున్నాడో మనకేం తెల్సు? నిజంగా స్వయంవుపాధి కోసమే అడిగాడో లేక ఏ జూదంలో తగలెయ్యటాని కడిగాడో అప్పు?"

"అంత నిర్దాక్షిణ్యంగా మాట్లాడకోయ్. వైకుంఠం నువ్వూహించినట్టు చెడ్డవాడేం కాదు. చాలా మంచివాడు, స్నేహశీలి! కనీసం సిగరెట్టు కూడా కాల్చడం చూళ్లేదు!"

"అదంతా నటన-మిమ్మల్ని నమ్మించటానికి అదే

నాటకం. అతను పైకి కనిపించేటంత మంచివాడు కాదు!" అని అతని గురించి చెప్పేసింది భర్తకి.

4

"హలో, మీనా...." అతని మాటను మధ్యలోనే తుంచేసి నిశ్చలంగా చెప్పింది మీనాక్షి.

"నా పూర్తి పేరు పెట్టి పిలిస్తే బావుంటుంది. నా భర్తకి తప్ప అలా చనువుగా పిలిచే అధికారమెవరికీలేదు" మీనాక్షి మాటలు కరుగ్గా తగిలాయి వైకుంఠానికి.

"సారీ, నువ్వు మరీ యింత సీరియస్‌గా తీసుకుంటా వనుకోలేదు! ఏదో చిన్ననాటి స్నేహానికి విలువనిస్తా వనుకుని, కాస్త చనువు తీసుకున్నాను. నువ్వు వద్దంటే అలాగే మానేస్తాను." అన్నాడు వైకుంఠం

మీనాక్షి మాట్లాడలేదు. రాని బస్సుకోసం విసుగ్గా రోడ్ మీదికి మెడ రిక్కించి చూసి, వాచీలోకి చూసుకొని నిట్టూర్చింది

వైకుంఠం గొంతు సవరించుకుని "మీ ఆయనకు చెప్పి నాకు లోన్ యివ్వద్దని రికమెండ్ చేసినందుకు చాలా థాంక్స్!" వ్యంగ్యంగా అన్నాడు.

మీనాక్షి వులిక్కిపడింది. ఆ విషయం యితనికెలా తెలుసు? బహుశా ఊహించి వుంటాడు.

వెంటనే అన్నది; "ఏమో. ఆ సంగతులన్నీ నాకేం తెలుస్తాయి? రూల్స్ ఒప్పుకోకపోతే ఆయనేం చేస్తారు?" అన్నది.

"రూల్సు ఒప్పుకున్నా దాన్ని అమలుచేయకుండా ఎన్నో అడ్డంకులు__అన్నీ మనిషి కల్పించినవే!"

మీనాక్షి మాట్లాడలేదు.

"ఏదోనాటికి నా అవసరం రాకపోదు. ఇప్పుడు పైచేయి

మీదే అయినా, నాది పైచేయి కావటం కూడా జరగొచ్చు. మనిషన్నాక మరో మనిషితో ఎప్పుడూ అవసర ముంటుం దని మీరు గ్రహిస్తే మంచిది. ఈ వైకుంఠాన్ని అవమా నించావు, ఫలితం అనుభవించటానికి సిద్ధంగావుండు!" అంటూ బుసలుకొడ్తూ చరచర వెళ్ళిపోయాడు వైకుంఠం.

మీనాక్షి నిర్ఘాంతపోయి అటే చూస్తూ, మూటముప్పయి అయిదో నంబరు బస్ ఆగటం, మళ్ళీ వెళ్ళిపోవటం గమ నించనే లేదు.

5

కొద్ది క్షణాలు భర్త చెప్తున్నదేమిటో అర్ధంకాలేదు మీనాక్షికి. భర్తవంకే కళ్ళప్పగించి భయంగా చూస్తూండి పోయింది.

"అదేమిటి, మీనూ మరీ అంత బేలవైపోతే ఎలా? మూడు రోజులేగా! ఇది చాలా ముఖ్యమైన బాధ్యతాయుతమైన పని. అందుకే మా మేనేజర్ నా మీద పెట్టాడు. నేను వెళ్ళక తప్పని పరిస్థితి! జస్ట్ త్రీడేస్!" అనునయంగా అన్నాడు భాస్కర్రావు ఆఫీసు పనిమీద కాకినాడ బయల్దేరుతూ. మర్నాడుదయం పేపరు చూస్తూనే వులిక్కిపడింది మీనాక్షి.

నగరంలో మతకల్లోలాలు పాత బస్తీకే పరిమితం కాకుండా జైరతాబాదు వరకు పాకిపోయాయి. జైరతాబాదు రైల్వేస్టేషన్ దగ్గర ముగ్గురు పొడుచుకు చచ్చారు. కార్చి చ్చులా ఆ వార్త చుట్టుపక్కల ప్రాంతాలకు పాకిపోయింది. పరిస్థితి ఉద్రిక్తంగా వుంది. ఏ క్షణంలోనైనా ఆ ప్రాంతంలో కర్ఫ్యూ విధించేలా వున్నారు.

మీనాక్షికి తన గుండె కొట్టుకుంటున్న శబ్దం తనకే విపరీతంగా వినిపిస్తున్నట్టనిపించింది వెంకటరమణ నగర్ కాలనీ జైరతాబాద్‌కి ఆనుకునే వుంది. ఆ మాట కొస్తే

జైరతాబాద్‌లో ఆ కాలనీ ఓ భాగమని చెప్పవచ్చు.

భగవాన్ ఎలా యిప్పుడు? సమయానికి ఆయన యింటి వద్దలేరు, ఊళ్లోనే లేరు! ఎలా?

ఆమె చేతులెత్తి భగవంతుడికి నమస్కారం పెట్టింది. ఆఫీసుకి ఆ రెండు రోజూలూ సెలవు పెట్టెయ్యాదల్చుకుంది. మూడోరోజు ఉదయమే భాస్కర్రావు వచ్చేస్తాడు, ఫరవా లేదు!

చకచకా సెలవురాసి తమ కాలనీలోనే వున్న ఆఫీసు కోలీగ్ చంద్రరావుకి అందచేసింది—ఆఫీసులో యిచ్చెయ్యమని.

ఏం తిన్నదో, ఎలా గడిపిందో ఆమెకే తెలీకుండా ఆ రోజు గడిచిపోయింది. కర్ఫ్యూ అయితే విధించలేదుగాని పరిస్థితి యింకా ఉద్రిక్తంగానే వుంది. అల్లర్లు జరుగుతునే వున్నాయి.

భగవాన్ యీ రాత్రి క్షేమంగా తెల్లవారనియ్యి రేపు వుదయమే ఆయన వొచ్చేస్తారు. ఈ గండం గట్టెక్కించు- అంటూ మొక్కుకుంది.

6

రాత్రి పదయ్యింది.

కాలనీ సద్దుమణిగింది. మీనాక్షికి నిద్రపట్టడంలేదు. ప్రక్కమీద అశాంతిగా దొర్లుతోంది. ఆరోజే హోం డెలీవరీలో వచ్చిన 'అపన' పుస్తకాల పార్సిలు కూడా విప్పలేదు. రాగానే రెండు పుస్తకాలూ ఏక బిగిన చదివేసే మీనాక్షి పార్సిలు విప్పకపోవటం ఆమె మనస్సంక్షోభానికి ప్రత్యక్ష నిదర్శనం!

పదకొండున్నర ప్రాంతాల ఎక్కడో సవ్వడి వినిపించింది. చెవులు రిక్కించి విన్నది. అనుమానం లేదు.

ఎవరో పెరటివైపు నుంచి లోపలికి దూకిన శబ్దమే అది!
ఆమె గుండెలు గుబగుబలాడాయి. హృదయస్పందన తీవ్ర తరమయింది.

'భగవాన్, నన్ను రక్షించు. ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనా జరక్కుండా చూడు' పదే పదే దేవుణ్ని తలుచుకుంటోంది.

చెవులు రిక్కించింది. అడుగుల చప్పుడు. చాలా దగ్గర్లో దొడ్డివైపు తలుపుదగ్గిర వంటగది పక్కనుంచి ఎవరో నడిచివచ్చిన శబ్దం స్పష్టంగా వినబడింది.

తలుపు గడియ పక్కకు తప్పుకుంది. సన్నటి చాకు తలుపు రంధ్రంగుండా పైకి కిందికి ప్రయాణంచేసి గడియని తప్పించింది.

తలుపులు తెరుచుకున్నాయి.

మీనాక్షి గుండె వేగం బాగా పెరిగింది. టెన్షన్‌తో ఆమె మెదడులోని నాళాలు తెగిపోయేలా వున్నాయి. తను అరిచినా లాభంలేదు. ప్రతియిల్లు కిటికీలతోబాటు బంధించేసుకున్నారు యింట్లోవున్న వాళ్ళు! ప్రతివాళ్ళకీ ప్రాణభయమే! అసలు ఆరున్నరయ్యేసరికే ఆ కాలనీ అంతా నిర్మానుష్యమయి పోయింది. అందరు గాఢనిద్రలో వుంటారు. మెలకువగా వున్నా పొరపాటున కూడా తలుపులు తెరవరు. ప్రస్తుతం పరిస్థితి అలాంటిది!

ఓ ఆకారం లోపలికి ప్రవేశించింది. చేతిలో ఆ చాకు తప్ప మరే ఆయుధంలేదు! అప్పటికే కూరలు తరిగే కత్తి చేతిలో పట్టుకుని సిద్ధంగా వుంది మీనాక్షి. శత్రువుని చంపడమో. తను చావడమో ఏదోకటి జరగాలని కృత నిశ్చయంతో వుంది.

ఆ వ్యక్తిని చూసి వులిక్కిపడింది మీనాక్షి.

వైకుంఠం!

ఆమె చెయ్యి కత్తిమీద బిగుసుకుంది. రాస్కెల్. వీడా? ఇలాంటి సమయంలో తనని నాశనంచేసి, అది మత విద్రోహక చర్యకింద అందరు జమకడతారని, తననెవరూ అనుమానించరని—ప్లాన్ చేశాడన్నమాట! వీడిమీద తనకి మొదటినుంచీ సదభిప్రాయం లేదుగాని యింత నీచుడని అనుకోలేదు.

వైకుంఠం నవ్వుతున్నాడు. రెడ్ లాంపు వెల్తుర్లో అతని ముఖం చాలా క్రూరంగా, మేకమీదికి పంజా విసరబోతున్న పులి ముఖంలా వుంది.

"నువ్వా?" అన్నది అసహ్యం, గగుర్పాటువల్ల కలిగిన వణుకును కలగలిపి.

"అవును, నేనే! అవకాశం కోసం ఎదురుచూస్తున్న వేటగాడ్ని! నీ అంతు చూడాలనే వచ్చాను. చిన్ననాటి స్నేహితురాలవుకదా అని అభిమానంతో పలకరించి నువ్వు పిలవకపోయినా నీ యింటికి స్నేహపూర్వకంగా వస్తే నన్ను అవమానించావు. నీ భర్తకు కూడా నా గురించి చెడుగా చెప్పి అతను నాకు చేయబోయిన సహాయాన్ని కూడా చెడగొట్టావు. పైగా నన్నొక పురుగుకింద జమ కట్టి కించపరిచావు.

నాకు మొదట్లో నీ పట్ల ఎలాంటి చెడుభావనా లేదు. కాని నీవు నన్ను అవమానించాకనే, నాలో పరాభవాగ్ని రాజుకుంది. దాన్ని చల్లార్చుకోటానికి సమయం కోసం వేచి చూస్తుంటే, లక్కీగా యీ మతకల్లోలాలు ప్రారంభమయ్యాయి. నిన్నిప్పుడు ఏం చేసినా సాయం ఎవరూ రారు సరికదా, నా కెలాంటి ఆటంకమూ వుండదు. మత విద్రోహులెవరో దాడి చేశారనుకుంటారు. ఎలావుంది నా ప్లాన్?"

వైకుంఠం విషపునవ్వు, అతని కోరచూపులు భరించ లేకపోతోంది మీనాక్షి

వైకుంఠం అంతకంతకూ ఆమెను సమీపిస్తున్నాడు. ఆమె చెయ్యి కత్తిమీద బిగుసుకుంటోంది.

"ఓహో, కత్తి ధరించి వీర ఝాన్సీబాయిలా మెరిపి పోతున్నావా? సరే, ఆ కత్తి సంగతి నేను చూస్తాను." అంటూ మెరుపువేగంతో ఆమెమీదికి ఉరికి, ముందుకి చాపిన ఆమె చేతిని మెలితిప్పాడు. కత్తి నేలమీద పడిపోయింది. చెయ్యి విరిగిపోయినట్టు బాధతో మెలితిరిగింది మీనాక్షి.

వైకుంఠం వికటంగా నవ్వాడు. ఆమె మీదికి వాలాడు. ఆమె అరిచింది. నోరు నొక్కేశాడు.

సరిగ్గా అదే సమయానికి తీసివున్న వెనక తలుపుల కుండా ముగ్గురు వ్యక్తులు లోనికి ప్రవేశించారు.

వాళ్ళకి మధ్యగదిలో వున్న వెంకటేశ్వరుడి ఫోటో కనిపించింది.

అందులో ఒకడు అరిచాడు "హిందూ ఫేమ్లీహై! మారో!" అంటూ.

తుళ్ళిపడ్డాడు వైకుంఠం. మీనాక్షిని వదిలేశాడు. మీనాక్షి ఆ క్షణాన్ని సద్వినియోగం చేసుకుంది. వీధివైపు గెంతింది. తలుపు తెరిచింది. కాని అప్పటికే ఆ ముగ్గురు వ్యక్తులు లోని కొచ్చేశారు.

వస్తూనే వైకుంఠాన్ని పొడిచారు. ఆ వెంటనే మీనాక్షి బయటికి పరుగెత్తబోవటం చూసి, ఒక్క ఉదుటున ఆమె మీదికి లంఘించారు.

"లడ్కీ బహుత్ సుందర్ హై, జరాదేఖేంగే!!" అంటూ కోరగా నవ్వాడొకడు.

రాబోయే ప్రమాదాన్నూహించింది మీనాక్షి.

వాళ్ళు ముగ్గురు ఆమె మీదికి వంగారు. అయితే అందులో ఒకడు "మర్గయారేఁ!" అంటూ అరిచాడు.

తక్కిన యిద్దరు తుళ్ళిపడ్డారు. వైకుంఠం పిచ్చెక్కినట్టుగా వాడి పొట్టలో పొడిచేస్తున్నాడు. వాడు నేలమీద పడిపోయాడు. ఆ కత్తి యిందాకా నేలజారిన మీనాక్షివి; ఎప్పుడు లేచాడో, ఎప్పుడు దాన్ని చేజిక్కించుకున్నాడో, మెరుపు దాడిచేశాడు.

ఆ యిద్దరు మీనాక్షిని వదిలి వైకుంఠంమీదికి మహోగ్రంగా ఉరికారు. ఒకేసారి వైకుంఠం శరీరంమీద తూట్లు తూట్లుగా పొడిచేశారు. నేలవాలిపోతో ఒకడ్ని పొట్టలోను, తొడల్లోను పొడిచాడు వైకుంఠం.

ఈ లోపల మీనాక్షి అటు యిటు చూపి వంటగదిలో నించి ఆవకాయి నరుక్కునే మరకత్తి తెచ్చింది. మూడో వాడు ఆమె చర్యను గమనించే లోపల ఆకత్తితో వాడి తల నరికేసింది. అపర కాళిలావున్న ఆమెవంక మూసుకుపోతున్న కళ్ళెత్తి చూశాడు వైకుంఠం.

అప్పటికే దుండగులు ముగ్గురు గిలగిలకొట్టుకుని రక్తం మడుగులోపడి చచ్చారు.

వైకుంఠం మాత్రమే కొనప్రాణంతో మిగిలాడు. మీనాక్షి వంక చేతులెత్తి దండం పెట్టాడు.

"నన్ను క్షమించమ్మా! నీకు ద్రోహం చెయ్యాలనుకున్నందుకు నా జీవితమిలా ముగిసిపోయింది. ఇంకా ఎవరెవరు దుండగులు తిరుగుతున్నారో, వాళ్ళు ఏ క్షణంలోనైనా యింట్లోకి జొరబడొచ్చు.... జా.... గ్ర.... త్త...." అంటూ కళ్ళు మూసేశాడు.

మీనాక్షి ఏదో అనాలనుకుంది. అతను తనపై ద్రోహబుద్ధితోవచ్చినా, తన మానప్రాణాలు రక్షించాడు. తను చావ

బోతూ కూడా మానవత్వంతో తనపట్ల ఉదారంగా ప్రవర్తించాడు భగవాన్, నువ్వు దయామయుడవి!

వెంటనే గదుల తలుపులన్నీ బంధించేసింది. ముందు గదిలోని భీకర దృశ్యాలు చూడలేక వంటగదిలోకి వచ్చేసింది. ఇంత జరిగినా చుట్టుపక్కల వాళ్ళెవరూ బయటకి రాలేదు సరికదా, కిటికీ తలుపులు కూడా తెరవలేదు ప్రాణ భయం ఎంత చెడ్డది!

ఎక్కడో పోలీసు విజిల్సు వినిపించాయి. గస్తీ పోలీసులు! ఒక్క క్షణం - తలుపులు తెరిచి వాళ్ళ సహాయం అర్థించనా అనుకొని, అంతలోనే ఆ ప్రయత్నం విరమించుకుంది.

ఉదయం భాస్కర్రావు వచ్చేవరకు ఆమె అలాగే శవజాగరణ చేసింది. ఇంటిముందు ఆటో ఆగిన శబ్దం విన్నాకనే కిటికీ తలుపులు తెరిచింది.

భాస్కర్రావు ఆటో దిగుతున్నాడు. సుడిగాలిలా బయటికొచ్చి, అతన్ని బల్లిలా కరుచుకుపోయింది మీనాక్షి. □

ఖరీదైన కొయ్యా?

కొయ్య కొనలేకపోతే మాత్రం అట్టాటి మంచాలు, ఇట్టాటి దర్వాజాలా చేయించేది?



చిన్నవాడి మాజిక్

అజీజ్

"ఎస్! పృథ్వీరాజ్ స్పీకింగ్!"

"ట్రంకాల్ ఫ్రం విజయవాడ!" చెప్పింది ఆపరేటర్ అవతలి నించి మాట్లాడండి".

"హలో, పృథ్వీరాజ్ హియర్! ఎవరూ?"

అవతల నవ్వు. "మీ మాజీ నౌఖర్ని! జగదీశ్వర్ని!!

అంతే! రిసీవర్ పట్టుకున్న పృథ్వీరాజ్ చెయ్యి వణికింది కొద్దిగా.

అవతలి వ్యక్తి చెప్పుకుపోతున్నాడు నెమ్మదిగా. "మీరు ఆలోచించుకోడానికి రెండు మూడు రోజులు వ్యవధి ఇస్తూ యిప్పటికి మూడుసార్లు చేశాను ఫోన్. ఇక ఇదే ఆఖరిసారి చెయ్యడం! ఆ తర్వాత మీ యిష్టం! ఏమంటారు?"

పళ్ళు పటపట కొరికాడు పృథ్వీరాజ్ "నీ ఆశకు అంతూ పొంతూ లేకుండా పోతోంది. ఇప్పటికే లెక్కకు మించిన డబ్బు గుంజావ్. ఇక చిల్లికానీ కూడా ఇవ్వదలచుకోలేదు. ఇంతటితో మన మధ్య కనెక్షన్ కట్!"

అవతల నవ్వాడతను. "అదంత సులభంగా కట్ అయ్యే కనెక్షన్ కాదని మర్చిపోతున్నారు మీరు. అనవసరంగా ఆవేశపడిపోతున్నారు. వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. ఎందుకైనా మంచిది. అరేళ్ళ గతంలోకి వెళ్ళి, ఆ నాటి రాత్రిని ఒకసారి జ్ఞాపకం చేసుకోండి.

మీరు చాలా నెమ్మదస్తులనీ, త్వరగా కోపం రాదనీ నాకు తెలుసు. ఎంతో మానసిక ఒత్తిడి కలిగితే తప్ప మీరు ఆవేశపడరని తెలుసు. అలాంటి ఆవేశంలోనే ఆ నాటి రాత్రి మీరు ఇత్తడి పూలసజ్జతో మీ భార్య తల పగలగొట్టి చంపినప్పుడు, సమయానికి నేనే గనక మీకు సహాయపడకుంటే, ఈ నాడు మీ రింతటి ఐశ్వర్యంలో తులతూగుతూ సర్వసుఖా లనుభవించే బదులు, ఏపుగా పెరిగిన గెడ్డంతో జీవితాంతం జైలుకొట్లో కూర్చుని జపం చేసుకుంటూ వుండేవారు.

నేను మీ కష్టార్జితమేమీ యివ్వమనడంలేదు. తేరగా వచ్చిన దాంట్లోంచి ముక్కుబడిగా ఏడాది కింత మొహాన

పడెయ్యమంటున్నాను. అంతే!"

"నేను జైల్లో జపం చేసుకుంటూ కూర్చుంటే, నువ్వు చేతిలో చిప్పా, చంకలో జోలే తగిలించుకుని, భిక్షాందేహీ అంటూ రోడ్లమ్మట అడుక్కుతినేవాడివి. నువ్వేం వుచితంగా ఉపకారం చెయ్యలేదు నాకు. ఆరేళ్ళ నించీ పెద్ద మొత్తంలో ప్రతిఫలం ముట్టజెబుతూనే ఉన్నాను" అన్నాడు పృథ్వీరాజ్ కఠినంగా.

"ఇక ముందు కూడా అలాగే ముట్టజెప్పాలని కోరుకుంటున్నాను. నా మౌనమే మీకు శ్రీరామరక్ష! నేను నోరు విప్పానంటే మీ బ్రతుకు ఎంత దుర్భరంగా మారిపోతుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదనుకుంటాను.

ఆ సందర్భంలో నేను నష్టపోయేదల్లా మీ నించి పుచ్చుతున్న డబ్బునే! మీరు యావదాస్తినీ కోల్పోవడమే గాక శ్రీకృష్ణ జన్మస్థానాన్ని చవిచూడాల్సి వుంటుంది. బహుశా, ఇప్పుడు మీ వయసు అక్కడి యాతనలు భరించే స్థితిలో లేదనుకుంటాను."

"నా భార్య మరణించి ఇన్నేళ్ళయాక, ఇప్పుడు నీ మాట లెవరు నమ్ముతారు? హత్యను కళ్ళారా చూసి కూడా, యింతకాలం నోరు మెదపకుండా ఎందుకున్నావంటే ఏం చెబుతావు? నేరాన్ని కప్పిపుచ్చిన నేరం కింద నీ మీద చర్య తీసుకుంటే, నాతోబాటు నువ్వూ శ్రీకృష్ణ జన్మస్థానాన్ని పావనం చెయ్యవూ?"

"ఔనండోయ్! ఆ సంగతి నే నింత వరకూ ఆలోచించనేలేదు. సర్లెండి. ఆ గొడవలు మనకెందుకు? మరో సులభమైన మార్గం వుండగా! మూడు రోజుల్లోగా నే నడిగిన డబ్బు పంపకపోయారో, మీ భార్య చావుకన్నా భయంకరంగా మిమ్మల్ని చంపేస్తాను జాగ్రత్త!"

"నన్ను చంపాక నువ్వు బ్రతికి బట్ట కట్టగలవుట్రా?"

"నా అంతం చూసి ఆనందించడానికి అప్పుడు మీరీ లోకంలో వుంటేగా? గోతిలో పాతిన మీ శవాన్ని అప్పుడు అసంఖ్యాకమైన కీటకాలు విందారగిస్తుంటాయి."

పృథ్వీరాజ్ వెన్నుముకలో సన్నగా ప్రారంభమైంది వణుకు.

అవతల తన ధోరణిలో చెప్పుకుపోతున్నాడతను "ముష్టి పాతికవేల కోసం అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకునే అవివేకి కాదనుకుంటాను మీరు. ఈ రోజు, జూన్ ఇరవై మూడు. సరిగ్గా ఇరవై ఆరవతేదీ నాడు నాకు డబ్బు అంది తీరాలి.

వందరూపాయల నోట్ల కట్టల్ని రెండు పుస్తకాల నడుమ పెట్టి. పార్సిల్ తయారుజేసి నా పేర, కేరాఫ్ పోస్ట్ మాస్టర్. బ్రాడీపేట. విజయవాడ అనే చిరునామాకు రిజిస్టర్ పోస్ట్ చెయ్యండి."

"ఎంతన్నావ్?"

"పాతిక వేలు!"

"అన్యాయం! ప్రతిసంవత్సరం నువ్వు డబ్బు పెంచుతూ పోతున్నావ్! గత సంవత్సరం ఇరవై వేలు గుంజావ్: అంతకు ముందు...."

"జ్ఞాపకం చెయ్యనవసరం లేదు. నా కంతా గుర్తుంది. ఐతే, ఒక విషయం మర్చిపోతున్నారు మీరు. మన దేశంలో దిన దినానికీ ద్రవ్యోల్బణం ఎలా పెరిగిపోతుందో, ధరలు ఎలా మండిపోతున్నాయో తెలీదా?

ఆరేళ్ళ క్రితం రూపాయికి వచ్చే వస్తువు యిప్పుడు ఐదు రూపాయలయింది. పైసా, రెండు పైసలూ, మూడు పైసల నాణాలు కంటికి కానరాకుండా మాయమయ్యాయి.

ఇప్పుడు ఐదుపైసలకూ అదే గతి పట్టబోతోందిట.

నాకు ఇరవై ఆరవతేదీ నాడు డబ్బుందితీరాలి. మీ మీది గౌరవం కొద్దీ మరో రెండు రోజులు ఓపిగ్గా ఎదురు చూస్తాను. ఆ తరవాత మీకు ఫోన్ చెయ్యను. ఆపై మీ ఇష్టం, ఏమంటారు?"

"ఈ మధ్య పోస్టల్ వారి గారడీల భాగోతాలు తరచూ పత్రికల్లో వస్తున్నాయి. కొంపదీసి, నేను పంపిన పార్సెల్ ఏ ఆర్నెల్లకో నీకు చేరితే?"

"అసంభవం! సార్టింగ్ చేసేటప్పుడు చిన్న చిన్న ఉత్తరాలు ఏ మూలో ఇరుక్కుని సిబ్బంది కంటబడకపోవచ్చు గానీ. పెద్దసైజు రిజిస్టర్ పార్సెళ్ళ విషయంలో అలా జరగడం కల్ల! నేను ఇరవై ఎనిమిదో తేదీ వరకూ ఎదురు చూస్తాను. అంతకి మించి ఇహ నా వల్లకాదు"

"ఐనా, పోస్టల్‌వారి జాప్యాన్ని, గందరగోళాన్ని అంత తేలిగ్గా తోసివెయ్యకూడదు"

"వారి గందరగోళం సంగతేమోగానీ, నాకు మీ మాటల్లోనే ఏదో గందరగోళం కనిపిస్తోంది పార్సెల్ పోస్ట్ చేశాక, దేనికైనా మంచిది. భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉండండి అది సమయానికి గమ్యం చేరాలని. ఎందుకంటే యిది మీ చావు బ్రతుకుల సమస్య మరి!

అన్నట్టు మరో సంగతి చెప్పడం మర్చాను. నా పీడ శాశ్వతంగా విరగడ చేసుకోవాలన్న ఆలోచన తరుచూ మీ బుర్రలో మొలకెత్తుతూ వుండవచ్చు. అందుకని పార్సెల్లో ఏదైనా నాటుబాంబులాంటిది పెట్టిపంపే పొరపాటు మాత్రం చెయ్యకండి.

ఎందుకంటే, అలాంటి ప్రమాదం ఎప్పుడైనా జరగవచ్చనే అనుమానం నాకూ రావడంతో ఓ మెటల్ డిటెక్టర్

కొని పెట్టుకున్నాను. మీ పార్సెల్ విప్పేముందు ఆ డిటెక్టర్‌తో దాన్ని జాగ్రత్తగా పరిశీలించాకే విప్పడం అనవాయితీగా మారింది నాకు."

"సరే. డబ్బు పంపిస్తాను నోరు మూసుకు పడుండు" విసురుగా రిసీవర్ దించి, వాలు కుర్చీలో జారగిలబడి, కళ్ళు మూసుకున్నాడు పృథ్వీరాజ్.

2

ఆరేళ్ళక్రితం ఆ ఇంట్లో అతని స్థితి చాలా దయనీయంగా వుండేది సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి, స్కాలర్‌షిప్‌ల సాయంతో రాత్రింబవళ్లూ శ్రమించి, రసాయన శాస్త్రంలో ఎమ్. ఎస్.సి పట్టం పుచ్చుకుని, స్వంత లాబొరేటరీ వుంటే సైంటిస్టుగా నిరంతర ప్రయోగాలు చేస్తూ, లోకాని కుపకరించే కొంగ్రొత్త విషయాలు కనిపెట్టాలన్న వాంఛను చంపుకుని, జీవన భృతికై ఉద్యోగాణ్వేషణ సాగిస్తున్న తరుణంలో, 'వరుడుకావాలి' అనే పత్రికా ప్రకటన అతన్నాకర్షించింది.

పాతికేళ్ళ ప్రాయంలోనే భర్తను కోల్పోయి, అపార ఆస్తిపాస్తులకు ఏకైక వారసురాలైన ఓ విడో యువతికి బాగా చదువుకుని, ఏ బాదరబందీలూ లేని, ఇల్లరికాని కిష్టపడే అందమైన ముప్పైఏళ్ళ యువకుడు వరుడిగా కావాలని దాని సారాంశం: మొదటి భర్తవల్ల ఆమెకు మూడేళ్ళ కొడుకు కూడా ఉన్నాడట.

తన కలలు ఫలించాలంటే ఆర్థికస్థోమత అత్యవసరం! ఆ ప్రకటన చూడగానే మరేమీ ఆలోచించకుండా వివరాలు తెల్పుతూ ఫోటోలు పంపించాడామెకు కొద్ది రోజుల్లోనే ఫలానా తేదీన వచ్చి కలుసుకోమని ఆహ్వానం అందింది.

వెళ్లాడు. భారతనారి అంటే ఇలా వుండాలని అంత కాలం అతని మదిలోవున్న ఒక వున్నత స్వరూపం ఆమెను చూడగానే పటాపంచలై పోయింది. ఆమె పేరు శ్రీవిద్య! తెల్లగా, అందంగానే వున్నా భారత నారీత్వా నికి భిన్నంగా భుజాల వరకూ కత్తిరించుకున్న బాబ్డ్ హేర్, పెదాలకి లిప్‌స్టిక్, ఆంగ్లంలో అనర్గళాభినివేశం! పూర్తిగా పాశ్చాత్య నాగరికతను పుణికిపుచ్చుకు పెరిగిన యువతి.

తన మనోభీష్టం నెరవేరడం ముఖ్యంగానీ, ఆమె వేష భాషలతో ఏమిటి నిమిత్తం! అని సరిపెట్టుకున్నాడు. అదృష్ట వశాత్తూ అతనూ, అతని వున్నతచదువూ ఆమె నాకర్షించి తన భావిజీవిత భాగస్వామిగా ఎంపిక చేయించాయి.

పెళ్ళయిన కొద్దిరోజుల్లోనే తామిద్దరి స్వభావాలకూ భూమ్యాకాశాల తారతమ్యంవుందని అర్థమైపోయిందతనికి. ఆమె జలజల పారే సెలయేరయితే, అతను అలల కలకలం లేని నిండు సరోవరం!

ప్రారంభంలో ఇంట్లో లాబొరేటరీ ఏర్పాటు చేసుకోడా నికి ప్రోత్సహించినా, ఎల్లవేళలా అతను బైటి ప్రపం చంతో సంపర్కం లేకుండా ప్రయోగాల పరిధికే పరిమితం కావడం ఆమెకు రుచించలేదు.

జీవితాన్ని సాధ్యమైనంత ఆనందంగా, విలాసంగా గడపాలని ఆమె ఉవాచ అయితే, ప్రపంచం ఈనాడు అనుభవించే ఆధునిక సౌకర్యాలన్నీ ముందు మానవ మస్తిష్కంలో జన్మించి, తరవాత వాస్తవ రూపాంతరం చెందినవేననీ, అందుకే, మనిషి తన అమూల్యకాలాన్ని ఎక్కువగా ఆలోచించడానికే కేటాయించాలని అతని థియరీ.

ఆ థియరీ ఆమెకు నచ్చలేదు. అడపా దడపా సూటీ

పోటీ మాటలతో అతన్ని దెప్పడం ప్రారంభించింది. క్రమేణా అతనిపట్ల ఆమె ప్రవర్తన కరకుగా మారసాగింది. అతని అమాయకత్వాన్నీ, మెతకదనాన్నీ ఆసరా చేసుకుని, విచ్చల విడిగా క్లబ్బుల్లో కాలం గడపసాగింది.

ఐనా, అతను ఓర్మితో అన్నీ సహించాడు. అప్పు డప్పుడూ ఆమె క్లబ్బుల్లో తాగి, జంకూ గొంకూ లేకుండా నిషాలో తూలుతూ ఇంటికివచ్చినా చూసీ చూడనట్టు ఊరు కున్నాడు.

తన ప్రయోగాల ఫలితాలను అంతర్జాతీయ పత్రికల్లో ప్రకటిస్తూ పలువురు ప్రముఖ సైంటిస్టుల మన్ననలు పొందసాగాడు. అప్పుడే అతని పేరు కొద్దికొద్దిగా వెలుగు లోకి రాసాగింది.

అటువంటి తరుణంలో ఆరాత్రి, ఊహించని ఆ భయంకరరాత్రి అతనిచేత ఆపని చేయించింది. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో, తన లాబొరేటరీలో కూర్చుని ఆనాటి ప్రయోగ ఫలితాలను రాసుకుంటున్నాడతను.

ఇంట్లో సూదిపడితే వినిపించే నిశ్శబ్దం: నాలుగేళ్ళ ప్రదీప్ పైన పడగ్గదిలో నిద్రపోతున్నాడు. క్లబ్బుకెళ్ళిన శ్రీవిద్య ఇంకా తిరిగిరాలేదు. అంతలో ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ బైట కారువచ్చి ఆగిన శబ్దం వినిపించింది.

వెస్టర్న్ మ్యూజిక్ కూనిరాగం తీస్తూ, భళ్ళున తలుపు తోసి, తప్పటడుగులు వేస్తూ లోనికి వచ్చింది శ్రీవిద్య. లాబొరేటరీలో కూర్చుని రాసుకుంటున్న అతన్ని చూడగానే ఆమె కనుబొమలు కుంచించుకుపోయాయి.

"కూపస్థమండూకంలా ఈ గదిలోనే మీ జుత్తు నెరిసే ట్టుంది. ఛ ఛ: ఇదీ ఒక బ్రతుకేనా? జీవితంలో ఏ ఆర్భా టమూ, అనుభూతీ లేకుండా...."

మంచి మూడ్‌లో ఆర్టికల్‌కు ప్రాణంపోస్తున్న అతని ఆలోచనా సరళి చెదిరిపోయింది. ఐనా, తమాయించుకుని, బలవంతంగా నవ్వి- "సైంటిస్టు జీవితం త్యాగనిరతికి దర్పణం వంటిది విద్యా!

తన మేధస్సునూ, శారీరక శక్తినీ ప్రతిఫలా పేక్షకు అతీతంగా, ప్రయోగాల పరిధికి అంకితం చేసి, భౌతిక సుఖాలను తృణప్రాయంగా త్యజించి, సూక్ష్మాతి సూక్ష్మమైన సృష్టి రహస్యాలను ఛేదిస్తూ, వాటిని మానవ మనుగడకు అనువైన రీతిలో రూపొందిస్తూ, నిరంతరం కొంగ్రొత్త విషయాలను సృష్టించడంలోనే శాస్త్రవేత్త జీవిత కాలం హరించుకుపోతుంది.

అలా నూటికీ, కోటికీ ఒక్కరో, ఇద్దరో తమ జీవితాలను యావత్తూ ప్రయోగాలకై త్యజించడంవల్లే ఈనాడు సకల మానవకోటీ ఇన్ని సౌకర్యాలను అనుభవించ గలుగుతోంది." అన్నాడు సౌమ్యంగా.

"వారి సంగతి సరేగానీ, మిమ్మల్ని మీరు శాస్త్రవేత్తగా ఎప్పటినించి భావిస్తున్నారు!" తన జోకుకు తానే గట్టిగా నవ్వేసింది శ్రీవిద్య.

అంతకీ అతనిలో కోపం జనించలేదు. "నేను కనిపెట్టి, క్రోడీకరిస్తూ రాసిన వ్యాసాలు చదివి, నా ఐడియాలను ప్రపంచ శాస్త్రవేత్తలు కూడా ఆమోదిస్తున్నారు."

"అవి మీ బుర్రలో ఉత్పన్నమైన స్వంత ఐడియా లేనంటే నేనొప్పుకోను."

అప్పుడు ఎర్రబడింది అతని మొహం కోపంతో. కన్న కొడుకును-వాడు నీకు పుట్టలేదంటే ఏ తండ్రైనా భరించ గలడా? నిద్రాహారాలు మాని, రాత్రింబవళ్ళూ కష్టపడిరాసిన నవలను-అది నీ స్వంతంకాదు, ఎవడిదో కాపీ కొట్టింటా

వంటే ఏ రచయితైనా సహించగలడా?

ఐనా, నిగ్రహాన్ని కోల్పోలేదు పృథ్వీరాజ్. "ఆ వ్యాసాలు చదివావా నువ్వు?" అడిగాడు శాంతంగా.

"అలాంటి సోదులు చదువుతూ కూర్చునే ఓపికా, వ్యవధీ నా దగ్గరలేవు!"

"మరి ఏ ఆధారంతో అంటున్నావు అవి నా స్వంత ఐడియాలు కావని?"

"తేరగా వచ్చిన సొమ్ము తింటూ కూర్చునే వ్యక్తికి స్వంత ఐడియాలెలా వస్తాయి?"

అప్పుడు తెగింది అతని ఆగ్రహపు ఆనకట్ట! రిజర్వాయరు నీటిని ఆపి వుంచే ఇనప కవాటాలు ఎత్తగానే, ఎలా పరవళ్ళు తొక్కుతూ నీరు బైటికి దూకుతుందో, అలా మరగసాగింది అతని రక్తం!

కోపిష్టులు ప్రతి చిన్న విషయానికీ కస్సుమంటారు. ఆ వెంటనే తుస్సుమంటారు కూడా! కానీ, శాంత స్వభావులకు చాలా అరుదుగా వస్తుంది కోపం! వచ్చిందంటే ఏదో బీభత్సం జరగందే చల్లారదు. అదే జరిగింది కూడా!

టేబిల్ మీది ఇత్తడి పూలసజ్జ అందుకున్నాడు. "రోజు రోజుకూ నీ నోరు పెట్రేగిపోతోంది. ఈ క్షణంలో దానికి శాశ్వతంగా తాళం పడిపోవాలి" అంటూ ఈడ్చికొట్టాడు ఆమె తలమీద.

అంతే! కణత పట్టుకుని 'కెవ్వు' మంటూ కిందకూలింది శ్రీవిద్య.

కణత పగిలి నేలంతా చిక్కని రక్తం యెగజిమ్మసాగింది. మత్తులో వున్న మనిషికి ఏ చిన్న దెబ్బ తగిలినా ప్రమాదమే! ఆమెకు తగిలింది చిన్నదెబ్బ కాదు. పిడుగుదెబ్బ. అదీ కణతమీద. ఆ క్షణమే పైలోకానికి ప్రయాణం

కట్టిందామె. శాశ్వత ప్రయాణం!

నేలపై చిన్న మడుగులా మారిన రక్తాన్ని చూశాక, అతని ఆవేశం అవిరై ఆ స్థానే వణుకు ప్రారంభమైంది. అదే సమయంలో తలుపువద్ద చప్పుడై తృళ్ళిపడి అటు చూశాడు.

డ్రైవర్ జగదీశ్వర్!

చాలా నిర్లిప్తంగా నిల్చుని నేలమీది శవాన్ని చూస్తు న్నాడు. అంతక్రితం ఆమెను కార్లో క్లబ్బునించి తెచ్చి, అంతవరకూ అవతలే నిల్చుని, లోపల జరుగుతున్న సంభాషణ వింటూ ఆనందిస్తున్నాడు. యజమానురాలు పెట్టిన గావుకేక విని, చప్పున లోనికొచ్చి నిల్చున్నాడు ప్రత్యక్ష సాక్షిలా!

భయంతో పృథ్వీరాజ్ గుండె జలదరించింది. "మైగాడ్! ఎంతపని చేశాను" అంటూ తలపట్టుకుని కూలిపోయాడు కుర్చీలో.

"మీరు ఏమీ చెయ్యలేదు సార్! ఎందుకలా ఆందోళన పడుతున్నారు? పాపం, ఆవిడ నొసట ఇలాంటి చావే రాసి పెట్టి వుంటాడు భగవంతుడు. ఈశ్వరాజ్ఞ లేనిదే చీమైనా చావదంటారుగా! ఆ ఈశ్వరాజ్ఞ మేరకే మీ రామె తల పగలగొట్టారు.

మిగితా విషయాలు నా కొదిలేయండి. మేడమీద ప్రదీప్ బాబు ఒంటరిగా పడుకున్నట్టున్నాడు వెళ్ళండి. వెళ్ళే ముందు ఆ ఇత్తడి పూలసజ్జెమీద మీ వేలిముద్రలు తుడిచేసి యథాస్థానంలో పెట్టేయండి" అన్న జగదీశ్వర్ మాటలు విని, ముందు విర్ఘాంతబోయాడు పృథ్వీరాజ్.

అటువంటి విపత్కరస్థితిలో ఆలాంటి ధైర్యవాక్కులు దిగజారుతున్న గుండెకు కొండంత బలాన్నిస్తాయి. అంత

వరకూ పృథ్వీరాజ్ కళ్ళల్లో కదలాడుతున్న ఉరిత్రాడు ఆ మాటలతో పూలహారంగా కనిపించసాగింది.

జేబురుమాలుతో జాగ్రత్తగా పూలసజ్జమీద తన వేలి ముద్రలు తుడిచేసి, దాన్ని యథాస్థానంలో పెట్టి. మౌనంగా మేడమీదికి నడిచాడు. పడగ్గదిలో చిన్నారి ప్రదీప్ ఈ లోకంతో నిమిత్తం లేనట్టు ఆదమరిచి నిద్రబోతున్నాడు.

కాలుగాలిన పిల్లిలా గదిలో పచార్లు చెయ్యసాగాడు పృథ్వీరాజ్.

పావుగంట తరవాత పైకివచ్చాడు జగదీశ్వర్ "పోలీసులకు ఫోను చేశాను. కాసేపట్లో వచ్చేస్తారు!" అన్న అతని మాటలు విని, పక్కన పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాడు పృథ్వీరాజ్.

"వ్... పోలీసులకు ఫోను చేశావా? ఎందుకు? న్.... నన్ను పట్టివ్వడానికా?"

నవ్వాడు జగదీశ్వర్. "మీరు అనవసరంగా ఖంగారు పడుతున్నారు సార్! నేను వాళ్ళకు యేం చెప్పానో తెలుసా? అరగంట క్రితం యింట్లో ఓ దొంగ ప్రవేశించాడనీ ఆ చప్పుడుకు పైన పడగ్గదిలో నిద్రిస్తున్న అమ్మగారు కిందికి వచ్చి, దొంగను చూసి కేకలు పెట్టబోతే వాడామె కణత పగలగొట్టి పారిపోయాడనీ.

వాడు కిటికిగుండా బైటికిదూకడం అప్పుడే నా కాటేజ్ లోంచి ఇవతలికి వచ్చిన నేను చూశాననీ, వాణ్ణి పట్టుకో డానికి ప్రయత్నించేలోపలే కాంపౌండు గోడదూకి పారిపోయాడనీ చెప్పాను."

"ఆమెకు వినిపించిన చప్పుడు నాకు వినిపించలేదా? ఒకవేళ వినిపించకున్నా ఆమె మేల్కొని ఒంటరిగా కిందికెందుకెళ్ళింది? సహాయంకోసం నన్ను దేనికి లేపలేదని

వాళ్ళడిగితే?"

నవ్వాడు జగదీశ్వర్. "దానికీ పరిష్కారం వుంది సార్! మీకు తలపోటుగా వుంటే నిద్రపట్టడానికి ఓ నిద్ర మాత్ర మింగి పడుకున్నాననీ, మీ ఒంట్లో బాగాలేనందు వల్లే ఆవిడ మిమ్మల్ని లేపలేదనీ, ఆమె గావుకేకలు విన్నాకే మీరు నిద్రలేచి కిందికి వెళ్ళారనీ చెప్పాలి. అంతకి మించి ఇంకేమీ అనకూడదు.

హాలు కిటికీ రెక్కలు తెరిచి వుంచాను. అలమారుల్లోని సామాను కూడా చిందరవందర చేసి వుంచాను. ఈ మధ్య నగరంలో పెచ్చు పెరిగిన దొంగతనాలూ, అక్కడక్కడా యింటివారిపై దొంగలు చేసిన ఘాతుకాలూ మన కథకు మంచి బలాన్నిస్తాయి.

పోలీసుల కేమాత్రం అనుమానం రాదు. మీరు నిశ్చింతగా వుండండి."

"సమయానికి ఆపద్బాంధవుడిలా నన్ను ఆదుకున్నావ్. ఈ సమయంలో నువ్వు లేకుంటే నావల్ల ఏ ఏ పొరపాట్లు జరిగేవో? జన్మ జన్మలకూ తీర్చుకోలేని ఋణం నీది."

జగదీశ్వర్ మొహంలో మళ్ళీ అదే నవ్వు. "పునర్జన్మలవరకూ యెందుకు సార్! ఆ ఋణమేదో ఈ జన్మలోనే తీర్చుకోవచ్చుగా? నా ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చి?"

"పరిస్థితులు చక్కబడనీ. నువ్వు కోరినంత ఇస్తాను. సరేనా?"

"ముందు కిందికి పదండి. పోలీసు లొచ్చేలోగా మనం అమ్మగారి శవం ముందు ఏడుపుగొట్టు మొహాలతో కనిపించాలి" అంటూ కిందికి నడిచాడు జగదీశ్వర్.

వాళ్ళు చెప్పిన కట్టుకథమీద ఏమాత్రం అనుమానం రాలేదు పోలీసులకు. కారణం, అలాంటి సంఘటనలు తరుచూ నగరంలో జరుగుతూనే వుండడంవల్ల! ఆ తర వాత కొద్దిరోజులకే పృథ్వీరాజ్ భార్య ఆస్తికి ఏకచ్ఛత్రాధిపతి అయ్యాడు.

నాలుగేళ్ళ ప్రదీప్‌మీద మొదటినించీ అతనికెలాంటి ద్వేషమూ లేదు. పైగా, ఆ సంఘటనతో వాడిపైన విపరీత మైన జాలి పెరిగింది. అందుకే వాడికే లోటూ రానివ్వ కుండా యెప్పుడూ సంతోషంగా వుంచుతూ కంటికి రెప్పలా పెంచుతున్నాడు.

చేసిన ఉపకారానికి ప్రతిఫలంగా పాతికవేలు పుచ్చుకుని, ఇకతానక్కడుండడం మంచిది కాదని చెప్పి వెళ్ళి పోయాడు జగదీశ్వర్. అంతే! ఆ తరవాత ప్రతిసంవత్సరం క్రమం తప్పకుండా జూన్ మాసంలో ఫలానా ఊరికి డబ్బు పంపమని ఫోన్ చెయ్యడం ప్రారంభించాడు.

ఇలా ఎంతకాలం భరించాలి వాణ్ణి? భయంతో బితుకు బితుకు మంటూ ఎన్నాళ్ళు బ్రతకాలి? డబ్బు పంపేబదులు ఏకంగా వాణ్నే పైలోకానికి పార్సిల్ చేస్తే? అదే ఎలా? కిరాయి హంతకుణ్ణి నియమిస్తే? అమ్మో! తర్వాత వాడూ వీడిలాగే ఏకు మేకై, తనని బ్లాక్‌మెయిల్ చెయ్యడని ఏమిటి గ్యారంటీ?

వాడు చెప్పిన చిరునామాకు డబ్బు పంపి, తనూ ఆ ఊరికెళ్ళి, పోస్టాఫీస్ దగ్గర పొంచివుండి, వాడు రాగానే వెంబడించి. నివాసం కనిపెట్టి షూట్ చేస్తే? మంచి ఆలో చనే! కానీ, ఖర్మగాలి ఎవరి కంటైనాపడి పట్టుబడితే? మొదటికే మోసం రావచ్చు. పార్సిల్లో బాంబుపెట్టి పంపుదా మన్నా వాడు ముందే దాని గురించి హెచ్చరించాడాయె!

వాడి పీడ విరగడ సంగతి తర్వాత ఆలోచించుకోవచ్చు. ముందు ఏడాదిపాటు వాడి నోటికి తాళం వెయ్యడం అత్యవసరం: రేపు బ్యాంకు నించి డబ్బు తెచ్చి పంపితే సరి.

3

"హలో, డాడీ!" అన్న పిలుపుతో ఆలోచనా తరంగాల్లోంచి తేరుకుని, తలుపువైపు చూశాడు పృథ్వీరాజ్.

ప్రదీప్!

కాన్వెంట్ డ్రెస్సులో వీపుకు పుస్తకాల బ్యాగ్ తగిలించుకుని, బూట్సు టకటకలాడిస్తూ, అతన్ని సమీపిస్తున్నాడు. ఇప్పుడు వాడికి పదేళ్ళు. అంతా తల్లి పోలికే! వయసుకు మించిన తెలివితేటలు. ఇప్పుడు ఆరవ తరగతి చదువుతున్నాడు. నిశ్చింతగా పెరగడంవల్ల ప్రతి పరీక్షలోనూ మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు.

సాధారణంగా పిల్లలు ఇళ్ళల్లో చేసి ఆనందించే చిన్న చిన్న మాజిక్‌లూ, గారడీలపట్ల ఆసక్తి ఎక్కువ. ప్రముఖ మెజీషియన్లు రాసిన పుస్తకాలు తెప్పించుకుని, అందులోని చిన్న చిన్న మాజిక్‌లు చేసి, తండ్రిని ఆశ్చర్యపర్చడం వాడికి చాలా యిష్టం!

"రా, ప్రదీప్! ఈ రోజు ఇంత ఆలస్యమయిందేం?" అడిగాడు పృథ్వీ ఆప్యాయంగా వాడి తల నిమురుతూ.

"స్కూలు త్వరగానే వదిలారు డాడీ! ఎందుకో తెలుసా? ఓ మెజీషియన్ వచ్చి, మా కోసం చిన్న ప్రదర్శన ఏర్పాటు చేసాడు స్కూల్లో. అబ్బ! ఎంత బావుందో. కళ్ళకు గంతలు కట్టుకుని, దారం చివర గిరగిర తిరిగే బొమ్మని బాణంతో యెంత కరెక్టుగా కొట్టి పడగొట్టాడో తెలుసా? ఇంకా ఎన్నో మాజిక్‌లు చేసి చూపాడు" అంటూ నిక్కర్ జేబులోంచి ఓ ఐదుపైసల నాణెం, పదిపైసల

నాణెం తీశాడు ప్రదీప్.

వాటిని తండ్రి కందిస్తూ "మీ రెండు చేతులూ వెనక పెట్టుకుని, నాకు కనపించకుండా, ఈ రెంటినీ ఒక్కొక్కటి చొప్పున మీ ఇష్టం వచ్చిన చేతుల్లో పట్టుకుని పిడికిళ్ళు మూసుకోండి, ఏ మాత్రం చూడకుండా ఏ చేతిలో ఏ నాణెం వుందో చిటికెలో చెప్పేస్తాను" అన్నాడు హుంషారుగా.

పృథ్వీరాజ్ కూడా ఆసక్తిగా నాణాలందుకుని, చేతులు వెనక్కి పెట్టుకున్నాడు. తర్వాత ఒక్కో నాణాన్ని ఒక్కో చేతిలో పట్టుకుని, పిడికిళ్ళు మూసుకున్నాడు. "ఊఁ, చెప్పుకో చూద్దాం!"

"కాస్త ఓపిక పట్టండి మరీ! ఆఁ, ఇప్పుడు మీ కుడి చేతిలో వున్న నాణాన్ని నాలుగుతో గుణించండి. ఎడం చేతిలో వున్న నాణాన్ని పదితో గుణించండి. అలా గుణించగా వచ్చిన సంఖ్యల్ని కూడండి."

పృథ్వీరాజ్ మనసులోనే లెక్కలుగట్టి, "ఆఁ కూడాను" అన్నాడు.

"ఎంతొచ్చింది?"

"తొంభై!"

ప్రదీప్ కళ్ళు మోసుకుని. ఏవో మంత్రాలు చదువుతున్నట్టు పెదాలు కదిలించి, కళ్ళు తెరుస్తూ గట్టిగా చిటికె వేసి, "ఆ ఐదుపైసల నాణెం మీ కుడిచేతిలో వుంది. పది పైసల నాణెం ఎడం చేతిలో వుంది" అన్నాడు.

ఆశ్చర్యంతో పృథ్వీరాజ్ కళ్ళు పెద్దవయ్యాయి. "ఎలా కనుక్కున్నావ్?"

"అది నా బిజినెస్ రహస్యం డాడీ! తమ రహస్యాల లెవరైనా చెప్పుకుంటారా? ఐనా, ఇదిచాలా చిన్న గారడీ! కొద్ది రోజుల్లో ఇంతకన్నా ఆశ్చర్యకరమైన మాజిక్ చేసి

చూపుతాను మీకు" అంటూ యింట్లోకి తుర్రుమన్నాడు ప్రదీప్.

4

మర్నాడు పదిన్నరకు బ్యాంకునించి పాతికవేలు డ్రాజేసి, ప్యాకింగ్ పేపర్ కొని, యింటికి వచ్చాడు పృథ్వీరాజ్. ఆ నోట్లను రెండు పాతపుస్తకాల మధ్య పేర్చి వాటిమీద గట్టిగా రిబ్బన్ చుట్టి, ఆ కట్టను పేపర్‌తో జాగ్రత్తగా ప్యాక్‌జేసి, పదిలంగా సీళ్ళువేసి, పెన్‌స్టాండ్‌లోంచి పెన్ అందుకుని, ఆ పార్శిల్‌మీద అడ్రస్ రాస్తూ ఆగిపోయాడు.

పెన్‌లో ఇంక్ అయిపోయింది. టేబిల్ మీద కలయ జూశాడు. ఇంక్ బాటిల్ వుండవలసిన చోట లేదు. అంతలో "డాడీ!" అంటూ లోపలికొచ్చాడు ప్రదీప్.

"అరె, ఈ రోజు స్కూలు కెళ్ళలేదా నువ్వు?"

"స్కూల్లో గేమ్సు నడుస్తున్నాయి డాడీ! నా నోట్సు కొన్ని పెండింగ్‌లో వున్నందువల్ల వెళ్ళలేదు."

"నా టేబిల్ మీద సిరాబుడ్డీగాని తీశావా?"

"ఔను డాడీ! నా పెన్లో సిరా పోసుకుంటోంటె చేతి లోంచి జారి కింద పడిపోయింది. ఇదుగో, ఇప్పుడే కొత్త బాటిల్ కొనుక్కొచ్చాను" అంటూ చేతిలోని సిరాబుడ్డీని తండ్రి కందించాడు ప్రదీప్.

పెన్‌లో సిరా నింపుకుని, పార్సల్ మీద అడ్రస్ రాసి, జనరల్ పోస్టాఫీస్‌లో దాన్ని రిజిస్టర్ పోస్ట్‌జేసి, గుండె మీది గుదిబండ దిగిపోయినట్టు తేలిగ్గా నిట్టూర్పు విడిచాడు పృథ్వీరాజ్. ఇక సంవత్సరంపాటు తను నిశ్చింతగా వుండవచ్చు.

ఆ వ్యవధిలో ఫణిని ఎలాగైనా అంతం చెయ్యడానికి తగిన పథకం ఆలోచించవచ్చు.

5

ఇరవై ఆరవ తేదీ వచ్చింది; వెళ్ళిపోయింది. అలాగే, ఇరవై ఎనిమిదవ తేదీ కూడా వచ్చి, కాలచక్రంలో నలిగి, నిష్క్రమించింది.

ఇరవై తొమ్మిదోతేదీ ఉదయం ప్రదీప్ స్కూలు కెళ్ళాక, లాబొరేటరీ ఆఫీసులో కూర్చుని, రెండు ఉత్తరాలూ, ఓ కంపెనీ పేర క్రాస్డ్ చెక్కూ రాసి, వాటిని కవర్స్‌లో పెట్టి, ఆ అడ్రసులు రాసి, పన్నెండు గంటల ప్రాంతంలో బైటి పనులు చూసుకుని, అలాగే వాటిని పోస్ట్ చెయ్యవచ్చనుకుంటూ కవర్లు పేపర్ వెయిట్ కింద పెట్టాడు పృథ్వీరాజ్.

ఐతే, పన్నెండు గంటల కతను బయటికెళ్దామని తయారౌతుండగా, ఓ స్నేహితుడు చాలా రోజుల తర్వాత వచ్చాడు అతన్ని కలవడానికి. మిత్రులిద్దరూ కబుర్లలోపడి, కాలాన్నే మర్చిపోయారు. మధ్యాహ్నం భోజనానంతరం స్నేహితుడు సెలవు తీసుకుని వెళ్ళాక, కాసేపు కునుకు తీద్దామని మేడిమీదికి నడిచాడు పృథ్వీరాజ్.

ఆ గొడవలోపడి, పోస్టు చెయ్యాలనుకున్న ఉత్తరాల సంగతే పూర్తిగా మర్చిపోయాడతను.

* * *

"నిద్ర వస్తోంది డాడీ; వెళ్ళి పడుకుంటాను. గుడ్ నైట్!" అన్నాడు ప్రదీప్ రాత్రి భోజనానంతరం.

"ఓ.కే. మైడియర్ సన్! విష్ యూ స్వీట్ డ్రీమ్స్! గుడ్‌నైట్. లాబొరేటరీలో కాస్త పనుంది. నే తర్వాత వస్తాను" అన్నాడు పృథ్వీరాజ్.

"అలాగే డాడీ!" అంటూ మేడ మీదికి పరిగెత్తాడు ప్రదీప్.

పనిమనిషి వెళ్ళిపోయాక, తలుపు మూసేసి, లాబొరేట రీలో అడుగు పెట్టాడు పృథ్వీరాజ్.

అప్పుడు పడింది అతని దృష్టి రైటింగ్ టేబిల్ మీదున్న వుత్తరాల మీద. వాటిని పోస్టు చెయ్యాలన్న సంగతే మర్చి పోయాడు తను అనుకుంటూ ఉత్తరాలని పరీక్షగా చూసి, నోరు తెరిచాడు పృథ్వీరాజ్. వాటిమీద అడ్రసులు మాయం!

తన స్వహస్తాలతో చిరునామాలు రాశాదే వుదయం! యెలా మాయం అయాయి? కొంపదీసి వేరే కవర్లు కాదు కదా? అనుకుంటూ వాటిని విప్పి, లోపల ఉత్తరాలు బయ టికి తీసి. నిర్ఘాంతపోయాడు. ఆ కాగితాల మీద తను రాసిం దంతా తుడిచేసినట్టు! తెల్లగా వున్నాయి!

చెక్కు మీది అంకెలూ, అక్షరాలు, సంతకం అన్నీ అదృశ్యం! ఎలా? ఎలా జరిగింది? అప్పుడు జ్ఞాపకం వచ్చిం దతనికి, ప్రదీప్ అన్న మాటలు. 'కొద్ది రోజుల్లో యింతకన్నా ఆశ్చర్యకరమైన మాజిక్ చేసి చూపుతాను మీకు'.

మొన్న తన పెన్నులో ఇంకు అయిపోవడం, బల్లమీద పిరాబుడ్డి కనిపించకపోవడం, ఇంతలో ప్రదీప్ మరో బాటిల్ తెచ్చివ్వడం జ్ఞాపకం వచ్చి జరిగిందేమిటో అర్థ మైందతనికి. నీలిరంగు సిరాలో ఒక రసాయనాన్ని కలిపి, పెన్నులో నింపి, కాగితాలమీద రాస్తే, కొద్ది గంటల్లో రాసినదంతా తుడిచిపెట్టినట్టు అదృశ్యమైపోతుంది.

సడన్‌గా మరో సంగతి జ్ఞాపకం వచ్చి, వులిక్కి పడ్డాడు. ఆ పిరాతోనే తను జగదీశ్వర్‌కు పంపిన పార్సల్‌పై అడ్రసు రాశాడు. కొంపదీసి....ఎంత పని జరిగిపోయింది. ఇప్పుడేం చెయ్యాలి?

ఇరవై ఎనిమిదో తేదీవరకే ఎదురు చూస్తానన్నాడు వాడు. ఈ రోజు ఇరవై తొమ్మిది! ప్యాకింగ్‌మీద అడ్రసే మాయమైనప్పుడు ఎలా ముడుతుంది వాడికి పార్శల్? అదే క్షణంలో ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు విని వులిక్కిపడ్డాడు పృథ్వీరాజ్.

"ఎవరూ? ప్రదీప్?" పిల్చాడు.

6

పది గంటలు కొట్టింది గోడ గడియారం!

ఐనా, ప్రదీప్‌కు నిద్ర రావడంలేదు. గడియారం పెండులంలాగే ఆ పసివాడి గుండె కూడా టకటక కొట్టు కుంటోంది పట్టరాని ఉద్వేగంతో. గదిలోని లైటార్పి' చీకట్లో కిటికీ దగ్గర నిల్చుని, తదేకంగా చూస్తున్నాడు తోటలోకి.

దొంగ చాటుగా ఇళ్ళల్లో జొరబడేవారు, ఇంటి ముందు నించి కాకుండా, పెరటివైపు నించే వస్తారని అతనికి తెలుసు. అతని ఆలోచన నిజమే అయింది. మసక చీకట్లో ఓ ఆకారం పిట్టగోడ ఎక్కి తోటలోకి దూకడం కనిపించ గానే ప్రదీప్ పెదాలపై పండువెన్నెల్లా విచ్చుకుంది నవ్వు.

నెమ్మదిగా నడుస్తూ మేడని సమీపించిందా ఆకారం! గోడకున్న నీటిగొట్టం అందుకుని గబగబ పైకెగబాకింది. కిటికీ దగ్గర్నించి కదలకుండా ఊపిరి బిగబట్టి చూస్తున్నాడు ప్రదీప్. ఆ ఆకారం పక్కనే వున్న తండ్రి పడగ్గది బాల్కనీలోకి దిగగానే తేలిగ్గా నిట్టూర్చాడు.

అతను ఆ యింటి మాజీ నౌకరు జగదీశ్వరేననీ, ఆ దారినే అతను ఇంట్లో ప్రవేశించవచ్చనీ ముందే వూహించి, బాల్కనీ తలుపు తెరిచివుంచాడు తను! దాంతో అతను తండ్రి పడగ్గదిలోకి సులభంగా ప్రవేశించి, అక్కడ ఆయన

లేకపోడంతో కింద లాబొరేటరీలోనే వుంటాడని ఊహించి, సులభంగా అక్కడికి చేరుకుంటాడని అంచనా వేశాడు.

అనుకున్నట్టే అతను పక్కగదిలోంచి నడవాలో కెళ్ళి, నెమ్మదిగా మెట్లు దిగుతున్న చప్పుడు వినిపించింది ప్రదీప్‌కు. రెండు నిమిషాల తర్వాత "ఎవరూ? ప్రదీప్?" అన్న తండ్రి కంఠం విని, ఇంకేమీ ఆలోచించకుండా నెమ్మదిగా తన గది తలుపు తెరిచి, పక్కనున్న తండ్రి పడగ్గదిలోకి దూరాడు ప్రదీప్.

టీపాయ్‌మీద టెలిఫోన్ అందుకుని, గబగబ రింగ్ జేశాడు నెంబర్లు.

"హలో, పోలీస్ స్టేషన్!"

"ఎస్, ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి స్పీకింగ్!"

"మా ఇంట్లో యిప్పుడే ఓ దొంగ దూరాడు సార్! త్వరగా వచ్చి మమ్మల్ని కాపాడండి."

"ఎక్కణ్ణించి మాట్లాడుతున్నారు మేడమ్?"

"నేను మేడంని కాను సార్! పిల్లాణ్ణి...." అంటూ తమ యింటి చిరునామా చెప్పాడు.

"పది నిమిషాల్లో వచ్చేస్తాం! భయపడకండి" అవతల క్లిక్ మంది.

రిసీవర్ దించి, చిన్నగా నవ్వుకున్నాడు ప్రదీప్.

జగదీశ్వర్ తన పని ముగించుకోడానికి పది నిమిషాలు చాలవూ?

7

"నేను ప్రదీప్‌ను కాను. నీ పాలిటి యముణ్ణి!" అంటూ లాబొరేటరీలో అడుగుపెట్టాడు జగదీశ్వర్.

"నువ్వా!? ఎలా వచ్చావ్ లోపలికి? ఇందాక నీ గురించే

ఆలోచిస్తున్నాను."

"ఇప్పుడాలోచించి ఏం లాభం? ఇరవై మూడో తేదీనే ఆలోచించి వుంటే బావుండేది."

"నువ్వు పొరబడుతున్నావ్! ఆ రోజే నీకు డబ్బు పంపే శాను. ఐతే, చిన్న గందరగోళం జరిగిపోయింది...." అంటూ జరిగింది చెప్పాడు పృథ్వీరాజ్.

"అదే నిజమైతే, ఆ పార్శల్ పంపిన రసీదు ఎక్కడ?" అడిగాడు జగదీశ్వర్.

"ఉంది....చూపిస్తాను...." అంటూ బల్ల సొరుగు లాగాడు పృథ్వీరాజ్. మొట్టమొదట అతని దృష్టి సొరుగులో వున్న పిస్తోలు మీద పడింది. అప్పుడు తట్టింది సడన్‌గా ఓ ఆలోచన అతనికి. ఇళ్ళల్లో అక్రమంగా జొరబడి, దౌర్జన్యా నికి పూనుకునేవారిని ఆత్మరక్షణకోసం చంపడం నేరం కాదు! పీడి పీడ విరగడ చేసుకోడానికి ఇంతకి మించిన మంచి సమయం ఇక రాదు.

చటుక్కున పిస్తోలందుకుని, చెయ్యి బైటికి లాగాడు. అంతే! అలాంటిదేదో జరగవచ్చని ముందే ఊహించిన జగ దీశ్వర్ చిఱుతలా లంఘించాడతని మీదికి. మరుక్షణం ఎడం చేత్తో ఆ పిస్తోలునీ, కుడిచేత్తో అతని కుత్తుకనీ పట్టేశాడు. ఇనప చువ్వలాంటి వేళ్ళతో శక్తికొద్దీ కుత్తిక వత్త సాగాడు. ఊపిరాడక తన్నుకోసాగాడు పృథ్వీరాజ్. ఒకటి రెండు....మూడు....అంతే! ఇక తన్నుకునే శక్తి అతనిలో నశించింది. తల వాల్చేశాడు పక్కకి. ఐనా, పళ్ళు బిగబట్టి మరో మూడు నిమిషాలు అలాగే వత్తిపట్టుకున్నాడు జగ దీశ్వర్.

పృథ్వీరాజ్ ప్రాణం పైలోకానికి పార్శలయిందని

పూర్తి నమ్మకం కుదిరాక, గొంతుమీంచి చెయ్యితీసి, పిస్తోలు జేబులో వేసుకుని, వెనుదిరిగాడు. హాలు తలుపు గడియతీసి, బయట అడుగుపెట్టాడు. అంతే!

"రా నాయనా, రా! నీ కోసమే వస్తున్నాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ.

చటుక్కున జేబులోంచి పిస్తోలు తియ్యబోయాడు జగదీశ్వర్. ముగ్గురు కానిస్టేబుళ్ళు మెరుపులా అతన్ని చుట్టేసి పెడరెక్కలు విరిచి, బేడీలు బిగించారు.

అంతలో పైనించి పరిగెత్తు కొచ్చాడు ప్రదీప్. "హమ్మయ్య, పట్టుకున్నారా సార్! కొద్ది రోజుల క్రితం నేను స్కూలుకెళ్తూ మేడమీదున్న డాడీకి టాటా చెబుదామని హాల్లోని ఎక్స్‌టెన్షన్ ఫోన్ ఎత్తాను. అప్పుడు వినిపించింది నాకా సంభాషణ! డాడీని జగదీశ్వర్ అనే వ్యక్తి డబ్బు పంపకుంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. వాడు వీడేనేమో సార్!"

"మీ డాడీ ఎక్కడున్నా రిప్పుడు?"

"హాలు పక్కన లాబొరేటరీలో!"

ఇన్‌స్పెక్టర్ గబగబ లాబొరేటరీలో కెళ్ళి, ఐదు నిమిషాల తర్వాత నిట్టూరుస్తూ ఇవతలి కొచ్చాడు.

"ఏం జరిగింది సార్? డాడీ ఎక్కడ?"

"అయామ్ సారీ! మేము రావడం ఆలస్యమైపోయింది. మీ డాడీ...."

ప్రదీప్ కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. సానుభూతితో అతని భుజంమీద చెయ్యి వేశాడు ఇన్‌స్పెక్టర్.

అవి కన్నీళ్ళుకావనీ, ఆనందబాష్పాలనీ, తల్లి హత్యకు తగిన ప్రతీకారం తీర్చుకున్న ఆనందబాష్పాలనీ పాపం ఆ ఇన్‌స్పెక్టర్‌కేం తెలుసు? □

పి.అరుణ

అడవిదారి

చీకటిని చీల్చుకుంటూ ముందుకు దూసుకువెళుతోంది ఎంబా పిడర్ కారు. గతుకులుగా వున్న రోడ్డుమీద కారు లైట్ల వెలుతురు అటూ ఇటూ కదులుతోంది.

డ్రయివ్ చేస్తున్న శశికాంత్ పక్కనే కూర్చుని

సూటిగా ముందుకు చూస్తోంది ఇంద్రాణి. రోడ్డుపక్కనే వున్న చిన్న చిన్న చెట్లు క్రమంగా వెనక్కి జరిగిపోతున్నాయి.

నిర్మానుష్యంగా వుంది రోడ్డు. ఎక్కడా యెటువంటి అలికిడీ లేదు. రెండు నిమిషాల క్రితమే కారు వూరును దాటి వచ్చేసింది.

మౌనంగా కూర్చున్న భార్యను చూస్తూ "ఏమిటి ఇందూ....సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్?" అన్నాడతను నవ్వి.

ఇంద్రాణి కూడా అదోలా నవ్వి "నా ఆలోచన యింత రాత్రివేళ బయల్దేరిన మన ప్రయాణం గురించే. ఈ టైములో నిర్జనంగా వున్న ఈ రోడ్డుమీద మన మిద్దరం ప్రయాణించటం గురించి ఆలోచిస్తుంటే భయంగా వుంది" అన్నది.

"భయపడకు. నిజానికి రాత్రి పదకొండు గంటల సమయంలో బయల్దేరటం నాకూ ఇష్టంలేదు. కాని ఒక్క రాత్రే నిన్ను విడిచి దూరంగా పడుకోవలసి రావడం ఎంత కష్టమో అర్థమయ్యింది. ఈ రాత్రి కూడా మనిద్దరం దూర దూరంగా పడుకుని నిద్రపోవటాన్ని నేను వూహించుకోలేక పోయాను. అందుకే ఈ ప్రయాణం. ఎంతసేపు? గంట న్నరలో మనిద్దరం మన బెడ్‌రూంలో ఒకరి కౌగిట్లో ఒకరం" అంటూ ఆమె భుజాల మీద చేతులువేసి దగ్గరగా లాక్కున్నాడు.

అతడి స్పర్శకు ఆమె చలించింది. ఇంద్రాణి శరీరం అదోలా ఐపోయింది.

నిజమే. క్రితం రాత్రి తనకీ నరకమే అనిపించింది భర్తను వదిలి దూరంగా మరోచోట పడుకోవటం. త్వరగా

యింటికి వెళితే బావుండుననుకుంది. కాని తన బావ, అక్క వదల్లేదు. చివరకు యెలాగో వాళ్ళను వదుల్చుకుని బయల్దేరారు.

"ఇంత రాత్రివేళ యెందుకు? అంత తొందరేముంది? రేపు వుదయం వెళ్ళొచ్చు కదా" అన్నది వకుళ—రామ రాజు భార్య.

రామరాజు—ఇంద్రాణి మేనత్త కొడుకు.

"ఇప్పు డెంతయ్యింది? పదకొండు గంటలే. ఇంత రాత్రిలో ప్రయాణాలు చెయ్యటం నాకు అలవాటే. రేపు ఉదయం ఓ మనిషిని కలుసుకోవాలి. అందువల్ల ఈ రాత్రికే వెళ్ళిపోతాం. ఆపకండి" అన్నాడు శశికాంత్.

"అర్ధరాత్రిలో ప్రయాణాలు మీకు అలవాటే కావచ్చు. కాని యిప్పుడు మీ పక్కనే మా చెల్లెలు వుంది. అందు వల్లనే యింతగా చెబుతున్నాం" అన్నది వకుళ.

భార్యను పక్కకు పిల్చి "మనమూ వయసులోనే వున్నాం. ఇంత రాత్రయినా యిల్లు చేరాలని వాళ్ళెందుకు ఆరాటపడుతున్నారో ఆ మాత్రం తెలుసుకోవేం?" అన్నాడు రామరాజు భార్యతో.

వకుళ నవ్వి "నిజమే. వీళ్ళకు కొత్తచోటున కలిపి పడుకోటానికి ఇబ్బందిగా వుంది. లేకపోతే మనింట్లో కుదరకనా?" అన్నది.

వాళ్ళ సంభాషణ దాదాపు శశికాంత్‌కీ, ఇంద్రాణికీ విన పడి ఇద్దరూ సిగ్గుపడ్డారు.

"మన బాధను మీ బావ—అక్క గ్రహించారు. అందుకే వదిలిపెట్టారు" అన్నాడు శశికాంత్ సిగరెట్టు వెలిగించుకుంటూ—

"అవును. వాళ్ళు మన గురించి అలా మాట్లాడుకుం

టుంటే నాకు సిగ్గనిపించింది" అన్నది ఇంద్రాణి.

కారు వూరుదాటి చాలాదూరం వచ్చేసింది.

కొంచెం దూరంలో మొదలవబోతున్న అడవి కారు దీపాల వెలుతుర్లో కనబడుతోంది.

ఇంటికి వెళ్ళగానే భార్యతో తను అనుభవించబోయే మధుర క్షణాలను తల్చుకుంటూ డ్రయివ్ చేస్తున్నాడు అతను.

"ఇక్కడ నుండి అడవి మొదలవుతోంది కదూ" అన్నది ఇంద్రాణి.

"అవును. ఎంతో దూరం వుండదు పదిహేను కిలో మీటర్ల వరకు వుంటుంది. ఆ తర్వాత రోడ్డు మామూలు గానే వుంటుంది" చెప్పాడు శశికాంత్ పొగ వదులుతూ.

"ఈ అడవిలో క్రూరమృగాలు వుంటాయి కదూ."

నవ్వేడు అతను.

"అడవిలో క్రూరమృగాలు వుండక ఏముంటాయి డియర్....ఐతే ఈ అడవిలో మరీ అంత క్రూరమృగాలు వుండవు. ఓ మాదిరి క్రూర మృగాలు వుంటాయి" అన్నాడు.

అక్కడనుండి అడవి మొదలయ్యింది. రోడ్డుకు రెండు వైపులా దట్టంగా ఎత్తుగా పెరిగిన చెట్లు వున్నాయి. ఆ చెట్లలోపల చీకటి మరింత చిక్కగా వుంది. చెట్లమధ్యనించి మెలికలు తిరుగుతూ వెళతోంది గతుకుల రోడ్డు.

రామరాజుకు పదిహేను రోజుల క్రితం కొడుకు పుట్టాడు. బాబును చూడటానికి క్రితంరోజు సాయంత్రం శశికాంత్‌తో బయల్దేరింది ఇంద్రాణి.

సిగరెట్టును బయటకు విసిరాడు శశికాంత్.

రోడ్డుమీదకు చూస్తున్న ఇంద్రాణి వులిక్కిపడింది—

ఉన్నట్టుండి చెట్లలోనించి రోడ్డుమీదకు పరిగెత్తుకువచ్చింది ఓ జంతువు కారుకు అడ్డుగా—

భయపడింది ఇంద్రాణి—భర్తకు మరింత దగ్గరగా జరిగింది.

"భయపడకు. అది నక్క...." అన్నాడు శశికాంత్.

క్షణంలో అది చెట్లలోకి వెళ్ళిపోయింది.

"నాకు భయంగా వుంది ఈ ప్రయాణం" అన్నది ఆమె.

"భయమెందుకు? పక్కన నేనున్నాను. జీవితంలో థ్రిల్ అనేది వుండాలి ఇందూ....ఇది నీకో కొత్త అనుభవం. ఈ అడవిని దాటి వెళ్ళేవరకు అనుక్షణం భయంతో నీకు అదో రకం థ్రిల్లింగ్‌గా వుంటుంది. ఈ అనుభవాన్ని నువ్వు చాలారోజులవరకు మరచిపోలేవు....అవునుకదూ? రోడ్డుమీదకే చూస్తూండు....ఈసారి ఏదయినా తోడేలు ఎదురావచ్చు....జూలో జంతువులను చూసి సంతోషపడిన మనం ఇక్కడ చూస్తే భయపడతాం...." అని ఇంకేదో చెబుతున్నాడు శశికాంత్ భార్యతో.

ఉన్నట్టుండి ఎంబాసిడర్ వేగం తగ్గిపోయింది. అతను యాక్సిలేటర్‌ను బలంగా నొక్కాడు. అయినా వేగం పెరగలేదు. మరికొంచెం ముందుకు వెళ్ళి ఆగిపోయింది.

ఆశ్చర్యపోయాడు శశికాంత్.

పెట్రోలు అయిపోయింది.

"ఎందుకు ఆగిపోయింది?" అడిగింది ఆమె.

చెప్పాడతను.

"అదేమిటి! నిన్న బయల్దేరే ముందు మీరు టాంక్ ఫుల్ చేయించారు కదూ?"

"అవును. అదే నాకూ ఆశ్చర్యంగా వుంది. ఇప్పటికి

మనం నలభై కిలోమీటర్లు వచ్చాం. ఇంకో అరవై కిలోమీటర్లు వెళ్ళాలి. అప్పుడే పెట్రోలు అయిపోవటం రియల్లీ వండర్."

"లీకయి కారిపోయిందేమో!"

"కాదు. అలా జరగలేదు. మనం కారును బయటనే వుంచాం.... ....రాత్రి యెవరో పెట్రోలు తీసుకుని వుంటారు."

"ఇప్పుడేమిటి చెయ్యటం?" అడిగింది ఇంద్రాణి భయంగా.

"ఏమీలేదు....మరో వెహికల్ ఏదయినా ఈ రోడ్డున వస్తుందేమో చూడాలి.వస్తే వాళ్ళదగ్గర ఆయిల్ పోయించుకుని వెళ్ళొచ్చు"

"ఇంతవరకు మనకు ఒక్క వెహికల్ కూడా ఎదురు రాలేదు. అసలు రాత్రివేళలో ఈ అడవి రోడ్డున వాహనాలు తిరగవేమో" అన్నదామె.

"ఏమో! నాకూ అలాగే అనిపిస్తోంది. ఇంతవరకు ఒక్క వెహికల్ కూడా మనకు ఎదురవలేదు. కనీసం మన వెనుకనించి కూడా రాలేదు."

ఇద్దరూ కార్లో కూర్చున్నారు.

ఇంద్రాణికి భయంగా వుంది. వకుళ మాటలు వినకుండా ఆ రాత్రిలో బయల్దేరటం పొరపాటే అనిపించింది. తను గట్టిగా వద్దని అన్నట్లయితే తన భర్త బయల్దేరేవాడు కాదేమో! తనకీ యెలాగైనా యిల్లుజేరి భర్త గుండెలమీద వాలిపోవాలనే కోరిక మనసులో బాగా వుండటంతో ఒప్పుకుంది బయల్దేరటానికి.

ఇప్పుడిలా అడవి మధ్యలో కారు ఆగిపోయింది.

2

దగ్గర్నించి కీచురాళ్ళ అరుపులు వినపడుతున్నాయి— భయం కలిగించేలా.

అంతా చీకటి....

హెడ్‌లైట్లను ఆర్పేశాడు శశికాంత్.

బయటినించి డోర్‌పైనించి గాలి లోపలకు వస్తోంది విసురుగా—

"విండో గ్లాసులను పైకెత్తుదాం" అన్నది ఆమె.

"ఎందుకు?"

"ఏవైనా అడవి జంతువులు లోపలకు దూకుతాయేమో!"

"నువ్వు మరీ భయపడుతున్నావ్ ఇందూ... గ్లాసులను క్లోజుచేస్తే లోపలకు గాలిరాదు గాల్లేక మనం చచ్చిపోతాం."

ఇంద్రాణి మాట్లాడలేదు.

రోడ్డు మధ్యగా ఆగివుంది కారు. రెండుపక్కలా వున్న ఎత్తయిన చెట్లు చీకట్లో రాక్షసుల్లా రివ్వున వీస్తున్న గాలికి తలలు వూపుతున్నాయి.

అప్పుడప్పుడు ఆ చెట్ల మధ్యనించి ఏవో జంతువులు పరుగెడుతున్నచప్పుడు వినపడుతోంది యెండుటాకులమీద.

ఇంద్రాణి కళ్ళు భయంతో బెదురుతున్నాయి.

వాచీకేసి చూసుకున్నాడు శశికాంత్. పావుతక్కువ పన్నెండు గంటలు కావస్తోంది.

"ఎంతసేపు ఈ నిరీక్షణ?" అన్నది ఆమె.

"తెలీదు. మన అదృష్టం బావుంటే త్వరగానే ఏదైనా వెహికల్ ఈ రోడ్డున వస్తుంది లేకపోతే తెల్లవారేవరకు మనం ఇక్కడే ఈ కారులోనే గడపక తప్పదు. ఈ రాత్రికి మన బెడ్‌రూం యిదే డియర్" అన్నాడు శశికాంత్

ఆమె భుజాలమీద చేతులు వేసి దగ్గరకు లాక్కుంటూ.

ఆ క్షణాల్లో ఆమె హృదయంనిండా భయం నిండి వుండటంతో భర్త కౌగిలింత ఆమెకు సంతోషాన్ని కలిగించలేదు.

ఎప్పుడు ఇలాంటి అనుభవం ఎదురుకాలేదు.

అందుకే ఇంతగా భయపడటం....

"మన ప్లానంతా చెడిపోయింది" అన్నాడతను భార్య ఆలోచనలను గమనించి—ఆమె తనకు రెస్పాన్స్ ఇవ్వటం లేదని తెలుసుకున్న తర్వాత.

ఇంద్రాణి మాట్లాడలేదు.

ఆమె భయపడుతున్నదని శశికాంత్ కూడా మౌనంగా వుండిపోయాడు. ఆ అడవిలో కారు ఆగిపోవటం అలా జాగరణ చెయ్యవలసి రావటం ఆ యిద్దరికీ చిరాకు కలిగించింది.

కాని చేసేది యేమీలేదు. దగ్గర్లో యేదయినా వూరు వున్నట్లయితే ఆ రాత్రి యెవరింట్లో ఐనా గడిపే అవకాశం వుండేది.

కాని—అది అడవి.

ముందుకీ వెనక్కూ కదలటానికి అవకాశమే లేదు.

ఏదయినా వాహనం వస్తుందేమో అని ఎదురుచూడటం తప్ప చెయ్యగలిగింది ఏమీలేదు. విరహవేదన ఇంత ప్రమాదంలోకి నెడుతుందని శశికాంత్‌కు ఆలోచనే రాలేదు.

ఇంకెప్పుడూ ఇలా రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత కార్లో ప్రయాణం చెయ్యకూడదనుకున్నాడు తను ఒక్కడే పోతే పర్వాలేదు కాని పక్కనే భార్య వుంది.

క్రూరమృగాలే కాదు, క్రూరమృగాల్లాంటి బందిపోటు

దొంగలు కూడా తమ నివాసాలను అడవుల్లోనే ఏర్పరచు కుని రాత్రివేళ బయల్దేరుతూ వుంటారు.

శశికాంత్ ఇలా ఆలోచనల్లో మునిగిపోతున్నప్పుడు "మోటారువాహనాల మోత వినపడుతోంది" అన్నది ఇంద్రాణి అతనితో.

అతను చెవులు రిక్కించి విన్నాడు. అవును. కొంచెం దూరంలో వెనుకవైపునించి ఏదో మోటారు వాహనం వస్తున్న చప్పుడు వినపడుతోంది.

"నిజమే. ఏదో వెహికల్ వస్తోంది" అన్నాడతను.

రెండు నిముషాల్లో ఆ చప్పుడు దగ్గరవుతున్నట్లుగా అనిపించింది.

"బయటకు దిగి నిలబడతాను" అన్నాడు శశికాంత్.

"వద్దు....బయటకు దిగొద్దు....మన కారు రోడ్డుకు మధ్యలో వుంది. కాబట్టి ఏ వాహనమైనా తప్పకుండా ఆగాలి. వాళ్ళు ఆపరనే భయం మనకులేదు. బయట నిల బడితే ఏదయినా జంతువు వస్తే ప్రమాదం" అన్నది.

ఆమె మాటలు అతడికి నిజంగానే తోచాయి.

అందుకే డోర్ కొద్దిగా తెరిచి కూర్చున్నాడు.

కొంచెంసేపట్లో వెనుకనించి దీపాల కాంతి కదులుతూ కారుమీద రోడ్డుపక్కకు పడింది.

ఇంకో నిముషంలో అది ఒక వాహనం కాదని, ఒకటి కంటే యెక్కువ వున్నాయని అనుకున్నాడు అతను.

దీపాల కాంతి—వాహనాల చప్పుడు బాగా దగ్గ రయ్యింది.

అప్పుడన్నాడు శశికాంత్ "వెనుకనించి వస్తున్న వాహ నాలు మోటారుసైకిళ్ళు" అని.

"కారు కాదా?"

"కాదు."

ఇంకో నిముషంలోనే వెనుకనించి రివ్వున మూడు మోటారుసైకిళ్ళు దూసుకువచ్చి ఆగివున్న కారు పక్కగా ఆగిపోయాయి.

వాటిమీద వున్న మనుషులు మొహాలను డోర్‌మీద నించి లోపలకు పెట్టి నవ్వుతూ చూశారు శశికాంత్‌నీ—ఇంద్రాణినీ.

3

వాళ్ళ మొహాలు చూడటంతోనే కెవ్వున అరిచింది ఇంద్రాణి.

భయంకరంగా వున్నారు వాళ్ళు.... వికృతంగా కత్తి గాట్లతో, నల్లని మచ్చలతో నిండివున్నాయి వాళ్ళ మొహాలు. చూడగానే తెలుస్తోంది కొంచెం కూడా మానవత్వంలేని గూండాలని.

క్షణంలో వాళ్ళు వాహనాలమీదనించి దిగి కారు డోర్ తెరిచి శశికాంత్‌నీ. ఇంద్రాణినీ బయటకు లాగారు.

ఇంద్రాణి అరుస్తోంది.

శశికాంత్ వాళ్ళ చర్యకు షాకైపోయాడు. అతను అలాంటి ఆలోచనలోనే లేడు. నిముషంలో ఆ షాకునించి బయటపడి తనని పట్టుకున్న గూండా చేతిని విసిరి కొట్టాడు.

వాడు ఈడ్చి శశికాంత్ మొహంమీద బలంకొద్దీ గుద్దాడు. కెవ్వున అరిచాడు శశికాంత్—కింద పడిపోతూ.

ఇద్దరు గూండాలు ఇంద్రాణి శరీరానికి చుట్టుకున్న చీరను లాగేసే ప్రయత్నంలో వున్నారు.

ఆమె ఏడుస్తోంది. కేకలు పెడుతోంది.

"వదలండి.... రాక్షసులారా. వదలండి" గింజుకుంటోంది.

"ఒరేయ్... మీ అంతు చూస్తాను" పైకి లేస్తూ అరిచాడు శశికాంత్.

అతను లేవకముందే మూడో గూండా శశికాంత్ మొహంమీద బూటుకాలితో మళ్ళీ తన్నాడు.

అరుస్తూ పడిపోయాడు శశికాంత్. అతని పెదవి పగిలి నెత్తురు చిమ్మింది.

తనని పట్టుకున్న యిద్దరు గూండాల చేతులను కొరికి ముందుకు పరుగుతీసింది ఇంద్రాణి.

సగంవరకు ఆమె చీర వూడిపోయింది

చీకట్లో ముందుకు పరుగెడుతోన్నది.

వాళ్ళిద్దరూ క్షణంలో వెంటపడ్డారు. పరుగెడుతున్న ఆమె పాదాలకు చీర అడ్డుపడింది. బోర్లాపడిపోయింది.

కెవ్వున అరిచింది.

ఆమె అరుపు ఆ నిర్జన ప్రదేశంలో ప్రతిధ్వనించింది.

వికృతంగా నవ్వారు వాళ్ళు.

"మమ్మల్ని తప్పించుకుని నువ్వెక్కడికీ వెళ్ళలేవు.... నిన్ను రక్షించటానికి ఈ అడవిలో ఎవ్వరూ రారు. వచ్చినా మమ్మల్ని చూసి పారిపోతారు."

"వద్దు ...వద్దు....నన్నేమీ చెయ్యకండి ...ప్లీజ్ ... వదలండి." రెండుచేతులూ జోడించి వాళ్ళను ప్రాధేయపడుతూ అన్నది ఇంద్రాణి.

వాళ్ళింకా నవ్వుతున్నారు.

కిందపడిన శశికాంత్ లేచే ప్రయత్నంలో వున్నాడు.

సరిగ్గా అప్పుడే వేగంగా దూసుకువచ్చి అక్కడ ఆగిపోయింది పోలీసుజీపు. అందులోనించి ఇన్ స్పెక్టర్, పదిమంది పోలీసులు మెరుపువేగంతో కిందికి దూకారు.

గాల్లో రివాల్వర్ పేల్చాడు ఇన్ స్పెక్టర్ త్యాగరాజు.

ఒక్కసారిగా ముగ్గురు గూండాలు వులిక్కిపడ్డారు— పోలీసులను చూడటంతోనే.

ఇంద్రాణి లేచి విల్చుంది.

శశికాంత్‌ను ఓ కానిస్టేబుల్ లేవదీశాడు.

ముగ్గురు గూండాల చేతులకి పోలీసులు బేడీలు తగిలించారు. ఆ సమయంలో ఎవరో ఫోన్ చేసినట్టుగా పోలీసులు ఎలా వచ్చారో అర్థంకాలేదు.

ఇంద్రాణి— శశికాంత్ గుండెలమీదపడి యేడుస్తోంది.

"ప్లీజ్....ఏడ్వకమ్మా....మీ అక్కయ్య వకుళ ఇన్ఫర్మేషను యివ్వకుండా వున్నట్లయితే మాకేమీ తెలిసేది కాదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ త్యాగరాజు.

ఇంద్రాణి ఆశ్చర్యంగా "మాఅక్క వకుళ మీకు ఈ రాక్షసుల గురించి చెప్పిందా! ఆమెకెలా తెలుసు?" అనడిగింది.

"ఎందుకు తెలీదు? జరిగిందేమిటో మీకు తెలీదుకదా.... మీరు బయల్దేరిన కొంచెంసేపటి తర్వాత మీ బావ రామరాజు ఈ ముగ్గురు గూండాలకు ఫోన్‌చేసి, మీ కారులో పెట్రోలు తీసేసినట్టుగా చెప్పి—కారు దారి మధ్యలో ఆగివుంటుంది, వెళ్ళి ఆమెను రేప్‌చేసి రమ్మని. చెప్పాడుట. ఆ మాటల్ని మీ అక్కయ్య విన్నది. మీ బావ ఎవరితోనో మాట్లాడుతున్నప్పుడు ఆయనకు తెలీకుండా స్టేషనుకు వచ్చి నాతో అంతా చెప్పి, వెంటనే వెళ్ళి మిమ్మల్ని రక్షించమని కోరింది వెంటనే బయల్దేరివచ్చాము" అన్నాడు త్యాగరాజు.

భార్యాభర్త లిద్దరూ విస్తుబోయారు.

శశికాంత్‌కు రామరాజు ఇలా ముగ్గురు గూండాలను తమమీదకు ఎందుకు పంపాడో అర్థంకాలేదు.

"ఇందూ....మీ బావకు మనమీద కోపం ఎందుకు?" అనడిగాడు.

"బావ అంతా మరచిపోయాడనుకొన్నాను. నన్ను బావ పెళ్ళి చేసుకుంటానన్నాడు. అప్పట్లో అతనికి వున్న వ్యస నాలను దృష్టిలో వుంచుకుని మా నాన్న నన్ను బావకిచ్చి చెయ్యటానికి ఒప్పుకోలేదు. తర్వాత బావ ఆ విషయం గురించే పట్టించుకోనట్టుగా వున్నాడు. ఆ నీచుడి గుండెల్లో ఇంత విషం దాగివుందని వూహించలేకపోయాను. అందుకే అక్కయ్యా ఈ రాత్రికి వుండి తెల్లారి వెళ్ళమని అంటున్నా ఆ దుర్మార్గుడు వుండమని అన్లేదు....నన్ను క్షమించండి....నావల్లనే యిదంతా జరిగింది" అన్నది ఇంద్రాణి.

ఇన్‌స్పెక్టర్ అన్నాడు "ఏమైనా మిశ్టర్ శశికాంత్.... రోజులు బాగాలేవు. అర్ధరాత్రివేళ స్త్రీలతో ఇలా ప్రయాణం చెయ్యటం యెంతో ప్రమాదం. సమయానికి మేము వచ్చాం కాబట్టి ప్రమాదం తప్పింది. లేకపోతే మీ యిద్దరి జీవితం ఏమై వుండేది?"

ఊహించటానికే భయమేసింది ఆ భార్యాభర్తలిద్దరికీ. □

రెండవ టికెట్టు.

కె.వి.రమణ



రెండు. ఆ రెంటిదగ్గరా ప్రభావతి జాడలేదు. ప్రయాణీకులు ఒకరొకరే దిగుతూ పెట్టెలు రెండూ దాదాపు ఖాళీ అయ్యాయి.

ఎందుకయినా మంచిదని సెకెండుక్లాసు కంపార్టుమెంటుల వద్ద కూడా వెదికి చూశాడు సురేష్. ప్రభావతి కనపడలేదు.

తను యిలా వెతుకతుండగా పొరపాటున గాని తనో ప్రక్కనుండి వెళ్ళిపోయిందా? అనుమానం వచ్చింది సురేష్కి. ఉహూఁ! అటువంటి అవకాశం ఏదీలేదు! ప్రభావతిలాంటి ఒడ్డూ పొడుగూ వుండి మల్లెపూవులాంటి తెల్లదనంతో మెరిసే వ్యక్తులు చాలా అరుదుగా వుంటారు. అటువంటివాళ్ళు కనుచూపుమేరలో వుండగానే ఎవరి దృష్టినయినా ఆకర్షిస్తారు.

మరి యింతకూ ప్రభావతి ఈ ట్రయినులో వచ్చినట్టా! రానట్టా! జేబులో వున్న టెలిగ్రామ్ మరోసారి తీపి చదివాడు సురేష్. "అమ్మాయిని పూరీ ఎక్స్ప్రెస్‌లో పంపుతున్నాను. స్టేషన్లో రిసీవ్ చేసుకో!" అని రాసారు మామగారు.

నీరసంగా నిట్టూరుస్తూ టెలిగ్రామ్ కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకుంటుంగా జనంలో యేదో అలికిడి విని చుట్టూ పరికించాడు సురేష్.

"ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులో ఎవరో యువతి హత్య చేయబడి వుందట" అనే మాటలు జనంలో నుండి వినపడగా గుండెలు అరచేతిలో పెట్టుకొని పరుగు తీశాడు సురేష్.

కంపార్టుమెంటులో మూగివున్న జనాన్ని ఒత్తిగిస్తూ

ముందుకుపోయి కేబిన్‌లోకి తొంగిచూసిన సురేష్ పిచ్చి వాడిలా "ప్రభా!" అంటూ అరుస్తూ ఆ స్త్రీ శవంమీద పడ్డాడు.

2

క్రిందవున్న రెండు బెర్తులకూ మధ్య నేలపై వెల్లకిలా పడుంది ప్రభావతి శరీరం. నుదురుమీద బలంగా తగిలిన గాయం మూలంగా తల పగిలి ప్రాణం పోయిందని గ్రహించాడు ఇన్‌స్పెక్టర్ షరీఫ్.

ఏదో ఒక బలమయిన ఇనపరాడ్ వంటి దానితో కొట్టి వుండొచ్చు. తల చుట్టూ చిన్న మడుగులా గడ్డకట్టి వుంది రక్తం.

చిన్న సూట్‌కేసూ, హేండ్‌బేగూ తప్ప వేరే సామాన్లేవీ లేవు. పెట్టెలో అయిదారు ఖరీదయిన చీరలూ, బ్లవుజులూ వున్నాయి. సూట్‌కేస్ అడుగున సుమారు వెయ్యి రూపాయల కేష్ వుంది.

హేండ్‌బేగ్‌లో వందరూపాయలకు లోపుగా కొన్ని నోట్లూ చిల్లరా వుంది. రెండు ఫస్టుక్లాస్ టిక్కెట్లున్నాయి. ఒక టిక్కెట్టు వాల్తేరు వరకూ వుంది రెండోది మాత్రం రాజమండ్రివరకే వుంది నొసలు చిట్లించాడు షరీఫ్!

ప్రభావతి భర్త సురేష్ చెబుతున్నదానినిబట్టి అతని మామగారు అంటే ప్రభావతి తండ్రిగారు ప్రభావతి ఒక్కతే బయలుదేరినట్టు టెలిగ్రామ్ యిచ్చారు.

మరి ఈ మెవద్ద నున్న రెండవ టిక్కెట్టు యెవరిది? ఆ వ్యక్తి ఆడా మగా? ఈ హత్యకు ఆ రెండో వ్యక్తికి ఎంత వరకూ సంబంధం వుంది? లేక ఆ రెండోమనిషి రాజమండ్రిలో దిగిపోయాక ఈ హత్య జరిగిందా? ఆ వ్యక్తి రాజమండ్రిలో దిగిపోతే మరి టిక్కెట్టు హతురాలి వద్ద

ఎందుకు వుండిపోయినట్టు?

హతురాలి శరీరం మీద అక్కడక్కడా కొన్ని గాట్లు కనిపిస్తున్నాయి. అవి పంటితోనూ గోళ్ళతోనూ అయిన చిన్న చిన్న గాయాలు।

అంటే। హతురాలిమీద ఏదన్నా అత్యాచారం జరిగిందా?

సూట్ కేస్‌లోనూ హేండ్ బేగులోనూ వున్న డబ్బు అలాగే వుంది. ఒంటిమీద వున్న నగలు కూడా ఏవీ పోలేదని తెలుస్తోంది।

ఈ కారణంగా హంతకులు డబ్బుకోసం కక్కుర్తి పడలేదన్న మాటే।

హతురాలు ప్రభావతి చాలా అందమైన మనిషని చూస్తేనే తెలుస్తోంది. ఈ కారణంగా ఎవరయినా ఆమె మీద అత్యాచారం జరిపి ఆనక ఆమెను హత్యచేసి వుండొచ్చా?

ఇదీ అంత నమ్మశక్యంగా లేదు. అత్యాచారం జరిపి ఆనక తమ దారిన తాము పోతారు తప్ప హత్య దేనికి చేస్తారు.

అదీగాక ఒంటిమీద అక్కడక్కడా వున్న కొద్దిపాటి గాట్లు తప్ప మానభంగం వంటి అత్యాచారం జరిగిన దాఖలాలేం లేవు.

ఏది ఏమయినా ఆ విషయం పోస్టుమార్టంలో తేలిపోతుంది. శవాన్ని పోస్టుమార్టంకు పంపే ఏర్పాట్లును చూడవలసిందిగా హెడ్ ఐరావతాన్ని ఆజ్ఞాపించాడు షరీఫ్.

3

పోస్టుమార్టం రిపోర్టులో ప్రభావతిని మానభంగంచేసే ప్రయత్నమేదో జరిగి వుండవచ్చు తప్ప అలాంటిదేమీ

లేదని తేలింది. హత్య రాత్రి ఒంటి గంటా రెండు గంటల మధ్య జరిగిందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు డాక్టరు.

షరీఫ్ ఆలోచనలో పడ్డాడు. హత్య జరిగిన సమయాన్ని బట్టి ట్రయిను రాజమండ్రి పరిసరాలలో వుంటుంది. మరి అది రాజమండ్రి చేరకముందే జరిగిందో తరవాత జరిగిందో స్పష్టం కావడంలేదు.

హతురాలిని మానభంగం చేసే విఫలయత్నం జరిగిందంటే కారణం యేమిటి? ఆ సమయానికి ఎవరయినా అడ్డు తగిలారా? మరేదయినా కారణంమీద అది విఫలమయిందా? అయితే ఏమిటది?

ఆలోచనలు కట్టిపెట్టి ఐరావతం వెంటరాగా సురేష్ కుమార్ యింటికి బయలుదేరాడు షరీఫ్. ఆసరికి ప్రభావతి శవానికి అంత్యక్రియలు జరిపి కుటుంబమంతా విచారసాగరంలో మునిగివున్నారు.

సురేష్‌కుమార్ ముందు హాలులో యిద్దరు వ్యక్తులతో మాట్లాడుతూ కనిపించాడు. వారిద్దరిలోనూ ఒక వ్యక్తి ముసలివాడు కాగా రెండో మనిషి బాగా కుర్రాడు.

పెద్ద వ్యక్తికి దాదాపు ఏభై అయిదేళ్ళ వయసుంటుంది. తెల్లనిపంచె లాల్చీ ధరించాడు. బాగా డబ్బున్నవాడికి మల్లే నిండుగా కనిపిస్తున్నాడు. అతని మొహంలో విచారం స్పష్టంగా గోచరిస్తోంది.

కుర్రాడికి మహావుంటే ఇరవైమూడేళ్ళ వయసు వుండొచ్చు. సన్నగా ఎర్రగా వున్నాడు. ఎర్ర గళ్ళ ఫుల్ హేండ్స్ షర్టు తెల్లని గొట్టాంపేంటూ ధరించాడు.

సురేష్‌కుమార్ పెద్దాయన్ని షరీఫ్‌కి పరిచయం చేస్తూ "ఈయన మా మావగారు. విజయవాడలో వ్యాపారం చేస్తున్నారు. పేరు సుబ్బరామయ్య" అన్నాడు.

సుబ్బరామయ్య షరీఫ్‌కి నమస్కారం చేయగా ప్రతి నమస్కారం చేస్తూ "ఈ వయసులో మీ కిది చాలా బాధా కరమయిన సంఘటన" అన్నాడు సానుభూతిగా.

సుబ్బరామయ్య వణికే స్వరంతో "ఏంచేస్తాం బాబూ! అంతా విధిలిఖితం. అమ్మాయితో నేనూ బయల్దేర వలసిందే. అర్జంటు పనొకటి అప్పటికప్పుడు వచ్చిపడితే ఆఖరుకు స్టేషనుకూడా తోడు వెళ్లే అవకాశంలేక ఇదిగో ఈ కుర్రాణ్ణి అమ్మాయి వెంట పంపాను" అన్నాడు గళ్ళషర్టు కుర్రాణ్ణి చూపుతూ.

షరీఫ్ తలూపుతూ ఆ యువకుడికేసి తిరిగి "నీ పేరే మిటి?" అని ప్రశ్నించాడు.

"కామేశం సార్!" వినయంగా జవాబిచ్చాడు ఆ యువ కుడు.

"సుబ్బరామయ్యగారికి ఏమవుతావ్?"

"ఏమీ కానండి. వారింట్లో పనిచేస్తున్నాను!"

"అలాగా! ఏంపని చేస్తుంటావ్? ఎన్నాళ్ళుగా చేస్తు న్నావ్?"

"ఒక పనంటూ లేదండి. అన్నిరకాల పనులూను. పోస్టులో ఉత్తరాలు వేయడం మొదలుకొని బేంకులో డబ్బు వేయడం డ్రా చేయడం, అయ్యగారివెంట వుంటూ వారికి కావలసినవన్నీ అమర్చుతుండడం. అంతా నేనే" సగర్వంగా చెప్పాడు కామేశం.

సుబ్బరామయ్య వెంటనే కల్పించుకుంటూ "ఇన్ స్పెక్టర్‌గారూ! కామేశం నాకు నీడలాంటివాడండి" అన్నాడు.

షరీఫ్ చిరునవ్వు నవ్వుతూ "కామేశం! మీ అమ్మాయి గారి ట్రయిను టిక్కెట్టు నువ్వు కొన్నావా లేక తనే

కొనుక్కున్నారా?" అడిగాడు.

"నే కొనలేదు సార్! స్టేషన్లోకి వెళుతూనే అమ్మాయిగారు నా చేతికి డబ్బులిస్తూ, ట్రయినులో తినేందుకేదైనా తెచ్చి పెట్టమన్నారు. నేను కేంటీనుకు వెళ్ళి తిరిగొచ్చేసరికి తను టికెట్ తీసుకొని సిద్ధంగా వున్నారు" అన్నాడు కామేశం.

షరీఫ్ తల వూపుతూ ఓ క్షణం కామేశాన్ని కన్నార్పకుండా చూసి "కామేశం! నువ్వు వేసుకున్న ఫుల్‌హేండ్స్ గళ్ళషర్టు చాలా బాగుందోయ్! ఇది కుట్టించి ఎన్నాళ్ళయిందేమిటి?" అన్నాడు నవ్వుతూ.

"మూడేళ్ళయిందండి" షర్టుకేసి సగర్వంగా చూసుకుంటూ చెప్పాడు కామేశం.

"ఆఁ అలా చెప్పు. అయినా బాగుందిలే యిప్పుడే కొన్న షర్టులా. రంగు ఏ మాత్రం తగ్గలా. షర్టంతా ఏదో కొంత వన్నె తగ్గినా సగం చేతులు మాత్రం మరీ కొత్తగా వున్నాయ్" అంటూ ఏదో అనుమానం తగిలినట్టుగా "ఔనూ! కామేశం నువ్వు నీ ఫుల్‌హేండ్సును ఎప్పుడూ సగం మడిచి వుంచుతావ్ కదూ" ప్రశ్నించాడు షరీఫ్.

కామేశం అదోలా మొహంపెడుతూ ఔనన్నట్టుగా తలూపాడు.

షరీఫ్ నవ్వుతూ "మరిప్పుడేం చేతులు పూర్తిగా విప్పి బటన్స్ కూడా పెట్టేశావ్" అన్నాడు.

కామేశం "అది .... మరేం .... వూరికేనండి...." అంటూ తడబడుతుండగా షరీఫ్ ఐరావతంకేసి చూశాడు. కామేశం గిజగిజ లాడుతున్నా విడువకుండా ఐరావతం బలవంతంగా హేండ్‌కఫ్స్ విప్పి పైకెత్తాడు.

కామేశం రెండు చేతులకూ అక్కడక్కడా తెల్లని

ప్లాస్టర్స్ అంటించి వున్నాయి.

"ఏమిటవి?" గద్దించాడు షరీఫ్.

కామేశం "అది.... అదేమో...." అంటూ నత్తుకొడు తుండగా "చెప్పవే!" అంటూ అతడి మెడమీద గుద్దాడు ఐరావతం.

ముందుకు తూలి బోర్లా పడ్డాడు కామేశం. మెడ విరిగి నేలమీద పడ్డట్టయి చేతులెత్తేశాడు నిజం చెబుతానంటూ.

4

కామేశం బయటికి కనిపించేంతటి అర్భకుడూ అమాయకుడేం కాదు. కామేశం సుబ్బరామయ్య వద్ద పనికి చేరే టప్పటికి ప్రభావతి కింకా పెళ్ళికాలేదు.

ప్రభావతిని చూస్తున్నప్పుడల్లా కామేశానికి ఏదోలా వుండేది. అయితే యింతలోనే ఆమెకు పెళ్ళయి భర్తతో విశాఖపట్నం వెళ్ళిపోయింది. కామేశం ఆమెను గూర్చి మనసులో పెంచుకున్న వూహలు అలాగే వుండిపోయాయి. ప్రభావతి మాత్రం అప్పుడప్పుడూ విజయవాడ వచ్చి పోతూనే వున్నది. అయితే ప్రతిసారీ ఆమె వెంట ఎవరో ఒకరు వుండేవారు.

ఈసారి మాత్రం వైజాగు వెళుతున్న ప్రభావతి వెంట యెవరూ లేరు ట్రయినుకు ఆమెను చేర్చే బాధ్యత కూడా కామేశానికే అప్పగించబడింది. కామేశం అప్పటికప్పుడు ఆలోచించి ప్రభావతి వెంట ప్రయాణమయ్యే పధకం వేశాడు.

స్టేషనుకు వెళ్ళే మార్గంలో దేనికో కలత చెందుతున్న వాడికిమల్లే ప్రభావతి ముందు నటించి ఆమె దృష్టిని ఆకర్షించగలిగాడు.

"ఏం కామేశం అలా వున్నావు" అని అడిగింది ప్రభావతి.

ప్రభావతి అడిగిందే తడవుగా కామేశం కళ్ళ నీళ్ళు రాలుస్తూ, రాజమండ్రిలో వున్న తన తల్లి చావు బ్రతుకుల మధ్య వుందని, కడసారిగా ఆమెను చూసే అవకాశం తనకు లేకుండా పోయిందనీ, అద్భుతంగా వర్ణించి చెప్పాడు.

ప్రభావతి "ఈ మాత్రందానికి బాధపడడం దేనికి?" అంటూ తనతో రాజమండ్రి వరకూ వచ్చి తల్లిని చూపి వెళ్ళమని, కామేశానిక్కూడా తనతో బాటే టికెట్ తీసింది రాజమండ్రి వరకూ.

ప్రభావతితో కలపి ప్రయాణం చేస్తున్నాడు. అన్నీ అనుకూలమవుతున్నట్టుగా ఆ కేబిన్‌లో వున్నదీ వారిద్దరే ధైర్యంచేస్తే ఇన్నాళ్ళ తన కోరిక నెరవేరుతుంది.

ట్రయిను చకచక లాడుతూ సాగిపోతోంది. ప్రభావతి తనకు తోడుగా కామేశం వున్నాడనే ధీమాతో నిశ్చింతగా నిద్రపోతోంది.

ఒక్కసారిగా ఏదో బరువు మీద పడ్డట్టయి వులిక్కిపడుతూ లేవబోయింది ప్రభావతి. కానీ సాధ్యపడలేదు వెంటనే. కామేశం పూర్తిగా ఆమెను ఆక్రమించి వెర్రి ఆవేశంతో దొరికిన ప్రతిచోటా ముద్దులతో నింపేస్తున్నాడు.

పెనుగులాడింది ప్రభావతి. నిజానికి ఆమె కామేశం కన్నా బలవంతురాలు. అయినా వూహించని ఈ పరిణామం ఆమెను దిగ్భ్రమలో ముంచడంవల్ల కొద్దిసేపు తడబడిందామె.

ఆనక తేరుకుంటూ కామేశం చేతుల్ని తన గోళ్ళతో రక్కింది. కామేశం బాధతో తన పట్టును కొంత సడలించగా ఆ వూపున అతణ్ని వెనక్కి నెట్టింది. కామేశం కిందపడిపోగా చెంగున లేచి వెర్రికోపంతో అతని చెంపలు రెండూ అదేపనిగా వాయించేసింది. కళ్ళు బైర్లు కమ్మాయి కామేశానికి.

దెబ్బతో కామేశం మత్తు వదలిపోగా ఒకచోట కూలబడిపోయాడు. ప్రభావతి కామేశాన్ని తిడుతూ ఈ విషయం తన తండ్రికి తెలియజేసి అంతుచూస్తా నన్నది

ఆ మాటకు కామేశానికి ముచ్చెమటలు పోశాయి.

ఆ క్షణంలో ప్రభావతిని అంతం చేయడమే క్షేమదాయకమనిపించిందతడికి. తాను ఈమెతో ప్రయాణం చేసిన సంగతి యెవరికీ తెలియదు. మార్గమధ్యంలో ఏదో జరిగి ఎవరో హత్యచేశారనుకుంటారు తప్ప నేరం తనమీదకు రాదు.

ఇలా కామేశం ఆలోచిస్తుండగా అతడి ఆలోచనలకు వూపిరిపోస్తూ కిందపడివున్న కిటికీ వూచ కనపడింది.

వెంటనే దానితో ప్రభావతి తలమీద శక్తికొద్దీ బాదాడు కామేశం అంతే! ప్రభావతి కిక్కురుమనకుండా కిందపడింది.

కిటికీ వూచను నడుస్తున్న రైల్లోనుండి బయటకు విసరి రైలు ఏదో స్టేషన్లో ఆగిన వెంటనే దిగిపోయాడు కామేశం. ఆ తొందరలో అతడు తన కోసమని ప్రభావతి కొన్న టిక్కెట్టు ఆమెవద్దనే వుండిపోయిందనే విషయం మరచిపోయాడు.

అదే ఇప్పుడతన్ని పట్టిచ్చింది. □

తారాపథం

—చంద్రశేఖర ఆజాద్

సుబ్బులు నీళ్ళు పడుతూ రాత్రి చూసొచ్చిన సినిమాలో హీరో ఎలాగెంతాడో హీరోయిన్ ఎన్ని చీరలు కట్టిందో చెబుతూంది. వరసగా బిందెలున్నాయి పైపునుండి నీళ్ళు ప్రశాంతంగానూ, మెల్లగానూ వస్తున్నాయి.

అక్కడున్నవారంతా సుబ్బులు మాటల్ని ఆసక్తితో

వింటున్నారు. ఇంకా వారిలో ఎవరూ ఆ సినిమా చూడ లేదు.

సుబ్బులకి పదారేళ్ళ వయసుంది. పిటపిటలాడే వళ్ళుంది. సుబ్బులు షేప్ జాకెట్లు వేసి, పమిట నడుం చుట్టూ బిగించి పని చేస్తుంటే ఆడవాళ్లే నోరు తెరిచి చూస్తుంటారు. తాను చూసే సినిమాల్లో ఏ క్రొత్త ఫ్యాషన్ కనపడ్డా వెంటనే అనుకరిస్తుంది.

"ఇదిగో సుబ్బులూ 'అనుబంధం' సినిమాలో నాగేశ్వ్రరావు వున్నాడు. మన రామా థియేటర్లోకి వస్తుంది. మనం వెళ్దాంలే" అంది జానకమ్మ.

జానకమ్మ ఆ ఇంట్లోనే అద్దెకుంటోంది. మొత్తం ఆ యింటిలో అయిదు వాటా లున్నాయి. వాటిలో అయిదు సంసారాలుంటున్నాయి. సుబ్బులు ముగ్గురికి పనిచేస్తుంది. జానకమ్మగారి భర్త ఏదో ఆఫీస్‌లో గుమస్తా. ఆమెకు సినిమాల గురించి అంతగా తెలియదు. ఇంట్రెస్టు కూడా లేదు.

"అనుబంధంలో నాగేశ్వరావున్నాడా?" అంది సుబ్బులు ఆశ్చర్యంగా.

"అవును. రాత్రి నేను వాల్‌పోస్టర్ చూశాను" అంది జానకమ్మ.

"ఆయన నాగేశ్వ్రరావయి వుండడు లెండి."

"లేదు. నాగేశ్వ్రరావే."

"అయితే నమ్మాలి. జానకమ్మగారికి తెలిసిన హీరో నాగేశ్వ్రరావే" అంది సుబ్బులు.

అప్పటికిగాని తనను ఆటపట్టిస్తుందని అర్థంకాలేదు జానకమ్మకు.

"అవునులే తల్లీ. నీలాగా నేను సినిమాలు చూడను

కదా. నాకు తెలిసింది ఆయనొక్కడే. నీళ్ళు నిండాయి. బిందె పక్కన పెట్టు" అంది జానకమ్మ.

"కోప్పడకండి జానకమ్మగారూ. నాగేశ్వర్రావు పాతబడిపోయేడు. ఇప్పుడయితే రజనీకాంతూ, కమలా హాసన్ ఇంకా క్రొత్తవాళ్ళొచ్చారు."

"ఏమో. ఎవరొస్తే ఏంలే" అంది బిందె తీసుకొని లోనికెళ్తూ.

"జానకీ....ఇలా రా" అంటూ పిల్చాడు ఆమె భర్త.

"ఏమిటండీ?" అంటూ వెళ్ళింది.

"ఆఖరుకు పనిమనుషులు కూడా నీమీద జోకు లేస్తున్నారు."

"అసలు మిమ్మల్నెవడు వినమన్నాడు. ఇప్పుడు నాకు కమలాహాసన్ తెలియకపోతే వచ్చే నష్టం ఏవిట్ట" అంది సాగదీస్తూ.

"కమలాహాసన్ కాదే. కమల్ హాసన్."

"ఏదో హాసన్ లే. నాకు పనుంది. అవతల నీళ్ళు ఆగిపోతే కాళ్ళు కడుక్కోటానికి కూడా వుండవు" అంటూ వెళ్ళిపోయింది.

చిన్నగా నవ్వుకున్నాడాయన.

2

"సుబ్బులేమిటే. ఆ పేరు ఛండాలంగా వుంది. ముందా పేరు మార్చేయ్" అంటాడు జానీ.

"ఏం పేరు పెట్టుకోమంటావు" అంటుంది సుబ్బులు.

"సుభద్ర అని పెట్టుకో. మనం మద్రాసు వెళ్ళాక 'జయస్మిత' అని పెట్టుకొందాం" అంటాడు జానీ.

జానీకు సైకిల్ షాపుంది. అతనికి సుబ్బులుతో పరి

చయం మొదలయి అరునెలలు కావస్తుంది. ఈ ఆరు నెల ల్లోనూ ఇద్దరూ కలపి పది సినిమాలకు పైగా చూశారు. అందులో తెలుగూ, హిందీలే కాక ఇంగ్లీషు సినిమాలు కూడా వున్నాయి.

జానీ సుబ్బులకు అప్పుడప్పుడు లంగాలూ, ఓణీలు కొనిపెడతాడు. పౌడర్‌డబ్బా, గోళ్ళకు రంగు కూడా కొని చ్చాడు. సిన్మాకు వెళ్ళేటప్పుడు తల్లోకి మల్లెపూలు కొని. థియేటర్లో సినిమా చూస్తూ మల్లెల వాసన పీల్చుకొంటుండే వాడు.

జానీయే సిన్మాల్లో హీరో. హీరోయిన్లందరి గురించి చెప్పేవాడు.

“సుభద్రా నీ మొఖంలో కళుందే. నీ కర్మకాలి యిలా అంట్లు తోముతున్నావుగానీ సిన్మాల్లోకి వెళితే నీకు రాజ యోగం పడుతుంది” అంటుండేవాడు.

“ఊరుకో మావో నన్నెవడు తీసుకుంటాడు” అనేది లోలోన గర్వంగా ఫీలవుతూ.

“ఓసి పిచ్చి మొకవా. ఆ హీరోయిన్లు మేకప్ తీస్తే ఎలా వుంటారనుకొన్నావు. మనం చూడలేం. పిల్కా స్మిత యేం చేసేదనుకున్నావు. ఇవ్వాళ మరి ఆమె జాతకం చూడు. డ్యాన్స్ చేయాలంటే ఇరవై వేలు. అదీ క్యూలో నిలబడాలి. నీక్కూడా అలాంటి జాతకం వుందే” అంటుండే వాడు.

అద్దంలో తన మొఖం చూసుకొన్నప్పుడు అది నిజమే ననిపించేది. సుబ్బులు తాను చాలా తెలివిగల దాన్నను కొనేది. జానీతో ఎన్ని సినిమాలకు వెళ్ళినా, ఎలా తిరిగినా హద్దు మీరలేదు. ఆవిడ చూసిన సినిమాల్లో అలా మోస పోయిన కొందర్ని చూడగానే ఆ విషంలో జాగ్రత్తపడింది.

జానీ కూడా సుబ్బుల్ని బలవంతం చేసేవాడు కాదు.

సుబ్బులమ్మ అక్కడా ఇక్కడా పనిచేసి మొత్తంమీద ఓ వెయ్యి రూపాయలు దాచిపెట్టగలిగింది. సుబ్బులమ్మ అంటే సుబ్బులు తల్లి. తను పనిచేసేవారందరికీ సుబ్బులు పెళ్ళి గురించి చెప్పివుంచింది. వారంతా సుబ్బులు పెళ్ళికి తలో చెయ్యి వెయ్యగలరనే ఆమె భావిస్తోంది. చాలా కాలంగా తమ యిళ్ళలో పని చేస్తుంది కాబట్టి ఎంతో కొంత ఇవ్వాలనే వారికుంది.

"ముందు దానికో మంచి మొగుడ్ని చూడు. తలో చేయి వేద్దాం" అంటుండేవాళ్ళు.

సుబ్బులు తల్లి కూడా 'మంచి మొగుడు' కోసమే ఎదురుచూస్తోంది. సుబ్బులు నాన్నలాగా తాగి తందానాలాడే వాడు రాకూడదని ఆమె సంకల్పం.

తన పిల్ల కంటికి నదురుగా వుండాలని వాళ్ళు వీళ్ళు యిచ్చే పాత బట్టల్తోపాటు మొగుడికి కనపడకుండా డబ్బులు దాచి బట్టలు కొంటుండేది. సుబ్బులు కూడా తను పనిచేసే చోట వచ్చే డబ్బుల్తో బట్టలు కొనేది.

జానీ మాటలు వింటున్నకొద్దీ మద్రాసుమీదకు ఆలోచనలు పరిగెడుతున్నాయి. తను చక్కగా మాట్లాడుతుంది. జానీ చెప్పినట్లు ఓ వేళ మాట్లాడటం చేతగాకపోయినా యెవరితోనో చెప్పిస్తారట. అసలు డ్యాన్సులు చేస్తే మాటల్తో పనిలేదట.

తను పనిచేసే రెడ్డిగారింట్లో వస్తువులు చూస్తుంటే మతిపోయేది. తాను చూసే సినిమాల్లో అంతగా లేకపోయినా బాగానే వుంటాయి. ఆ యింట్లోవారంతా సినిమా వారి గురించి ఆరాధనాపూర్వకంగా చెప్పుకొంటుంటే విని ఆనందించేది. తానుకూడా యిలానే పెద్ద తారనైతే తన

గురించి కూడా ఇలానే చెప్పుకుంటారు కదా అనిపించింది.

ఆమెకు తెలిసి క్రొత్త క్రొత్త తారలు వెంట వెంటనే పైకి రావటం గమనించింది. జానీ తననుండి యెలాంటి కోర్కెలు కోరకపోవటం ఆమెకు సంతోషం కలిగించింది. అతనికి మొత్తం మద్రాసంతా తెలుసు కాబట్టి, ఇంకా కొందరు నిర్మాతలు తెలుసంటున్నాడు కాబట్టి అదృష్టాన్ని పరీక్షించుకుందాం అని నిర్ణయాని కొచ్చింది.

3

గందరగోళంగా పెద్దగా ఏడుస్తూ సుబ్బులు తల్లి చెబుతుంటే జానకమ్మ బయటకొచ్చి విషయం కనుక్కొంది. నిన్న సాయంకాలం నుండి సుబ్బులు కనపడటంలేదట. సుబ్బులు కనపడకపోవటం అటుంచితే 'దాని పెళ్ళికోసం దాచిన వెయ్యి రూపాయలూ' కనపడటంలేదట.

"వోరి దేవుడో.... బాబో...." అని గుండెలు బాదుకుంటుంటే ఆడవాళ్ళంతా ఓదార్చారు.

నీళ్ళు పట్టుకొని లోనికి వెళ్ళిన జానకమ్మ తన భర్తకు ఈ విషయం చెప్పింది.

"కమలాహాసన్‌తో నటించాలని మద్రాసు చెక్కేసిందేమో!"

"మీవన్నీ వేళాకోళాలు."

"లేకపోతే ఎవర్నయినా ప్రేమించిందేమో."

"ఏమో బాబు. దానికి తెలియందేముంది! అదెంతకైనా తెగిస్తుంది" అంది జానకమ్మ.

సుబ్బులు తండ్రి మాత్రం పెళ్ళాన్ని బాదేశాడు. నాకు తాగటానికి డబ్బు యివ్వకుండా దాచావ్. ఇప్పుడేమయింది అంటూ కోప్పడ్డాడు. వాడికి కూతురు పోయిందనే కంటే డబ్బులు పోయాయనే కడుపుమంటగా వుంది.

ఆ సమయంలో మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో కాలు పెట్టారు సుబ్బులూ, జానీ. ఆటోలో ఇద్దరూ కూర్చున్నాక ఓ పెద్ద హోటల్లో టిఫిన్ పెట్టించాడు జానీ. తిరిగి ఆటోలో కూర్చున్నాక పిటీ అంతా త్రిప్పి అన్నీ వివరించాడు.

ఓ లాడ్జింగ్‌లో గది తీసుకొని ఇద్దరూ భార్యాభర్తలుగా రాయించాడు. సుబ్బుల్ని అక్కడ వుంచి ప్రొడ్యూసర్ గారితో మాట్లాడి రావాలన్జెప్పి బయటకు వెళ్ళిపోయాడు. నాలుగు గంటల తర్వాత ఓ మనిషితో వచ్చాడు. అతను సుబ్బుల్ని చూశాడు. అతని కళ్ళు మెరిశాయి.

"అమ్మగార్కి కూడా సూయించుదాం" అన్నాడు.

"అలాగే" అన్నాడు జానీ.

ముగ్గురూ కలిసి టాక్సీలో బయలుదేరారు. ఓ పెద్ద భవనం ముందు ఆగింది. నడుస్తుంటే సుబ్బులికి 'జయ స్మిత' నైపోయా ననిపించింది. ఆ భవనంలోకి వెళ్ళాక మెత్తటి సోఫాలమీద కూర్చోబెట్టి అతను పైకి వెళ్ళి పోయాడు. ఆ భవనం చూస్తుంటే సుబ్బులకి స్వర్గంలో వున్నట్లనిపించింది.

కొంచెం సేపయ్యాక మెట్లమీది నుండి దిగి వచ్చిందో ఆడమనిషి. ఆమెను చూస్తుంటే అచ్చంగా సినిమాలో చూసినట్లే వుంది. ఎవరబ్బా అంటూ ఆలోచించింది. ఆమె వచ్చి సోఫాలో కూర్చుంది.

"నమస్తే మేడం" అన్నాడు జానీ.

"ఈ అమ్మాయేనా?"

"అవునమ్మా"

"నించో అమ్మాయి" అందామె.

సుబ్బులు నిలబడింది. వచ్చే ముందు జానీ కొనిపెట్టిన చీరలో అద్భుతంగా వుంది. ఆమె కళ్ళు సంతృప్తిగా

చూశాయి.

"సరే రేపు మాట్లాడుతాను" అంది లోనికి వెళ్తూ.

జానీ నమస్కారం పెట్టి బయిటకొచ్చాడు.

"మన పంట పండింది" సుబ్బుల్ని కుదుపుతూ అన్నాడు.

సంతోషాన్ని అదిమి పెట్టుకొంటూ "ఎవరామె" అంది.

"ఎవరా భలేదానివే. ఆమె నిర్మాత కమల్‌హాసన్‌తో సినిమా తియ్యబోతూంది."

"నిజంగానా"

"నిజంగానా అంటావు. అందులో నువ్వు కూడా వుంటున్నావు."

"నేనా" అంది సుబ్బులు.

"అవును హీరోయిన్ జయలత నీకు ముందు చిన్న పాత్ర ఇస్తానంది" అన్నాడు జానీ.

ఇద్దరూ తిరిగి లాడ్జింగ్ చేరుకున్నారు. సుబ్బులుకి సంతోషంతో పూర్తిగా భోజనం కూడా చేయ బుద్ధికాలేదు.

"ఆమె నేదో సినిమాలో చూసినట్లు గుర్తు" అంది సుబ్బులు.

"నిజమే. ఇదివరకు కొన్ని సినిమాల్లో చేసింది. ఇప్పుడు నటించటంలేే సినిమాలే తీస్తోంది."

"ఇంత తొందరగా పని అవుతుందంటే నాకు నమ్మకం కలగటం లేదు" అంది సుబ్బులు.

"లక్. రేపు ఈ సినిమా విడుదలైతే నన్నుకూడా మరిచిపోతావేమో" అన్నాడు జానీ

"జానీ" అంటూ పెదవుల మూసింది సుబ్బులు సినిమా స్టైయిల్లో. "నేనంత స్వార్థపరురాల్ని కాదు. నాకో ఆధారం

కల్పించిన నిన్నెలా మరువగలను."

"సుభద్రా" అన్నాడు మత్తుగా జానీ.

"జానీ" అంటూ కౌగిట్లో వ్రాలిపోయింది.

జానీ ఆనందంగా లైటు ఆర్పేశాడు.

4

ఉదయం లేవగానే, స్నానంచేసి తిరిగి బయలుదేరారు.

"ఈసారి స్టూడియోకి తీసుకెళ్ళాడు. అక్కడికి రాత్రి వచ్చిన 'నిర్మాత' వచ్చింది. ఆ భవనంలో మరికొందరు యువతులున్నారు. వారంతా మంచి బట్టల్లో ఆకర్షణీయంగా వున్నారు.

"ఇక్కడ నీకు నటన నేర్పిస్తారు" అన్నాడు జానీ.

సుబ్బుల్ని చూపించి ఆమె సైగచేసింది. కొంద రాడ వాళ్ళు వచ్చి లోనికి తీసుకెళ్ళారు. ఆమె జీవితంలో ఊహించని అపురూప అనుభవం అది. బ్యూటీ పార్లర్ లాంటి ఓ గదిలోకి తీసుకువెళ్ళి గంట తర్వాత బయటకు పంపారు. అప్సరసలా నడుచుకుంటూ బయిటకొచ్చింది సుబ్బులు. అక్కడ జానీ లేడు.

ఆమె సుబ్బులు వంక తృప్తిగానూ, గర్వంగానూ చూపింది.

"ఇలా రా" అంది.

బిడియంగా వెళ్ళింది

"కూర్చో"

కూర్చొంది.

"జానీ" అంది మెల్లగా.

"బయటకెళ్ళాడు. వస్తాడులే" అందామె. జానీ వచ్చే లోపు ఖరీదయిన భోజనం పెట్టారు. సాయంకాలం

ఎప్పుడో వచ్చాడు. వచ్చీ రావడంతోనే ఆమె గదిలోనికి వెళ్ళాడు.

"ఏం జానీ నువ్వు మరీ డల్‌గా వుంటున్నావు నీనుండి ఆఫర్ వచ్చి ఎనిమిది నెలలవుతుంది."

"ఏం చెయ్యమంటారు. చాలా కష్టంగా వుంది. ఆరు నెలల నుండి ఎంతో కష్టపడితేగాని ఇదికూడా సాధ్యం కాలేదు."

"మొత్తానికి నీ సెలక్షన్ అద్భుతం."

"ఓ మాటమ్మా. దాన్ని ఎలా అయినా ఓ సిన్మాలో వుండేట్లు చూడగూడదా."

"అది డేంజర్. అయినా ఆలోచిస్తాను."

"మీ ఇష్టం"

"ఎప్పుడు వెళుతున్నావు"

"రేపు ఉదయం"

"మళ్ళా ఎప్పుడు"

"ఎప్పుడో వస్తాను. ఈ జనానికి సినిమాపిచ్చి వున్నంత కాలం మన వ్యాపారానికి ఢోకా వుండదు."

నవ్విందామె.

"ఈసారి నా కష్టాన్ని మీరు గుర్తించాలి" అన్నాడు జానీ.

"తప్పకుండా" అందామె.

జానీ సంతోషంగా బయటికొచ్చాడు. సుబ్బుల్ని కలిశాడు.

"ఇంకో వారంలో షూటింగ్ మొదలుపెడతారట" అన్నాడు రాగానే. సుబ్బుల్ని చూస్తుంటే జానీకి ఆశ్చర్యంగా వుంది. అంత అందంగా వుందామె.

"మరి నేను వెళతాను" అన్నాడు జానీ.

"ఎక్కడికి" కంగారుగా అంది సుబ్బులు.

"మన లాడ్జింగ్‌కి"

"నేనూ"

"నువ్విక్కడ నేర్చుకోవాలి"

"నువ్వా ఇక్కడే వుండు"

"నేనుండకూడదు. నువ్వంటే సినిమా ఏక్టరువి. రేపు వుదయం వస్తాగా" అన్నాడు జానీ.

"తొందరగా రా. మర్చిపోయాను. డబ్బులు సూట్‌కేసులోనే వుంచాను."

"సర్లే రేపు తెస్తా" అంటూ బలంగా ముద్దు పెట్టుకొని "వస్తా" అన్నాడు.

సుబ్బులు సిగ్గుగా తలూపింది.

5

జానీ ఆ తర్వాత కనపడడం మానేశాడు. వారంరోజుల తర్వాత సుబ్బులకి అసలు విషయం తెలిసింది. ఆమె నిర్మాత కాదు. నటికూడా కాదు. ఓ ప్రముఖ తార అక్క.

ఆ తారాపథంలో వుండి సంపాదించినప్పుడు బాగా ఖర్చుపెట్టడం అలవాటు చేసుకున్నారు. ఇంతలో ఆ తార పెళ్ళి చేసుకొని వారినుండి విడిపోయింది. అప్పుడే ఏర్పడ్డాయి ఇబ్బందులన్నీ. రకరకాల వైభవాలకు అలవాటు పడిన వారికి ఏం చేయాలో అర్థం కాలేదు. వెంటనే ఆమె ఈ వ్యాపారంలోనికి దిగింది. ముఖ్య నగరాల్లో ఆమెకు ఏజెంట్లున్నారు.

సినిమా వ్యామోహం వున్నవారిని మాయ మాటల్తో తీసుకొచ్చి ఇక్కడ అమ్మేస్తారు ఈ కన్నెపిల్లల్ని నూతన తారలుగా ప్రొడ్యూసర్ల దగ్గరకు, విటుల దగ్గరకు పంపిస్తూ ఆమె ఖరీదయిన జీవితాన్ని నెట్టుకొస్తూంది.

సుబ్బులు ఈ విషయం తెలిపి ఏడ్చింది. పెడబొబ్బలు పెట్టింది. అప్పుడు ఆమె చెప్పిన మాటలు ఎప్పుడూ చెవుల్లో గింగురు మంటుండేవి.

"ఓసి పిచ్చిదానా ఏం చూసుకొని నిన్ను సినిమాల్లో తీసుకుంటారే. నీలాంటి అందగత్తెలు ఈ ప్రపంచంలో లేరా? అసలు ఈ రంగంలో చెడిపోనిదెవరే. చెడిపోతేనే అవకాశాలొస్తాయి. అంతేగాని. దయతలచి యెవడూ అవ కాశా లివ్వడు. నీకెందుకు. నువ్వు సుఖంగా బ్రతికే ఏర్పాట్లు చేస్తాను. జానీ యెవరనుకున్నావు. వాడు నిన్ను నాకు అమ్మేశాడు. నీమీద చాలా పెట్టుబడి పెట్టాను. అదన్నా రావాలి కదా. ఇప్పుడయినా నీకేమయింది. నీ దగ్గర కొచ్చేవాళ్ళంతా నిన్ను సినిమాతార వనుకుంటారు. నువ్వు నాతో సహకరిస్తే, ఏ నిర్మాతతో నయినా చెప్పి సినిమా ఛాన్స్‌కూడా ఇప్పిస్తా."

సుబ్బులు క్రమంగా లొంగిపోయింది. జానీ తన గొంతు యెంత మెత్తగా కోశాడో తలుచుకుంటే ఆమెకు అంతులేని బాధ.... ద్వేషం....అంతకంటే దుర్మార్గుడు తన తల్లి కష్టపడి తన పెళ్ళికోసం దాచిన వెయ్యి రూపాయలు సైతం తీసుకుపోవడమే ఆమెను మరింత కసికి గురి చేసింది.

సంవత్సరం గడిచింది.

సుబ్బుల్లో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడామె తమిళంలో మాట్లాడగలదు. ఆధునిక ప్రపంచాన్ని, వివిధ రకాల వ్యక్తుల మనస్తత్వాల్ని ఆమె ఆకళింపు చేసుకొంది. రంగుల ప్రపంచంలోని హిపోక్రసిని ఆమె గుర్తించింది. ఆమె ఊహించినట్లుగానే మరో అమ్మాయితో జానీ వచ్చాడు.

అతన్ని చూడగానే ఏమాత్రం ఉద్రేకపడకుండా ప్రేమ గానే మాట్లాడింది. అతను ఆదమరిచి వున్నప్పుడు చాలా కాలంగా దాచుకుంటున్న కత్తితో పొడిచేసింది. ఒక్కసారి కాదు. నాలుగుసార్లు. కెవ్వున అరుస్తూ కూలిపోయాడు.

సుబ్బులు వెంటనే ఫోన్ దగ్గరకు వెళ్ళి హత్యగురించి పోలీసులను చెప్పేసింది. అలాగే ఆ భవనంలో జరుగు తున్న వ్యభిచారం గురించి కూడా చెప్పింది.

క్షణాల్లో ఆ భవనం మీదకు పోలీసులు రెయిడ్ చేశారు. సుబ్బుల్ని అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు. ఆమెతోపాటు సినీ తార అక్కను కూడా అరెస్ట్ చేశారు.

సుబ్బులు తన స్టేట్‌మెంట్‌లో తార సోదరి జీవితాన్ని బహిర్గతం చేసింది. జానీలాంటివారు తనలాంటి వారినెలా మోసం చేస్తున్నారో వివరిస్తూ అమాయక యువతులు మోసపోకూడదంటూ హెచ్చరించింది.

పత్రికల్లో సుబ్బులు ప్రకటన ప్రముఖంగా వచ్చింది. మొత్తంమీద సుబ్బులు కోరిక తీరింది. సుబ్బులు గురించి దేశమంతా చర్చించింది.

బెయిల్‌మీద బయట కొచ్చింది తార సోదరి. ఈ కేసు టేకప్ చేసిన యస్.ఐ. ఈ కేసు విషయంలో స్ట్రిక్టుగా ఉన్నాడు.

కటకటాల వెనక కూర్చొని వుంది సుబ్బులు.

జానకమ్మ గుర్తొచ్చింది.

"జానకమ్మగారూ .... మీ కా నాగేశ్వర్రావే తెలుసు. అందుకే మీరు చక్కగా సంసారం చేసుకొంటున్నారు. నాకు కమలహాసన్, రజినీకాంత్ తెలుసు. అందుకే నా జీవితం ఇలా అయింది" అనుకొంది. □

రక్తం

స్వరూప్

గాలిని చీల్చుకుంటూ దూసుకుపోతోంది రైలు—

కంపార్ట్‌మెంట్లో లైట్లు మంద్రంగా వెల్గుతున్నాయి.

రెండున్నర సంవత్సరాల తర్వాత శ్రీహరిని చూడ బోతున్నానన్న సంతోషంతో ఓ పట్టాన నిద్రపట్టడంలేదు నాకు.

జేబులో నుండి లెటరు తీశాను. అది శ్రీహరి వ్రాసింది మూడు నెలల క్రిందట. అదే వాడి నుండి వచ్చిన ఆఖరి ఉత్తరం. పెధవ! వాడి పెళ్ళికి వెళ్ళలేదన్న కోపంతో లెటర్లు వ్రాయడం మానేశాడు.

నా బిజినెస్ హడావుడితో కనీసం కట్టుకున్నదానితో రెండు గంటలు ఆనందంగా గడపటానిక్కి కూడా వీలు పడటం లేదన్న విషయం వాడికేం తెలుసు?....యెందుకో వాడు వ్రాసిన ప్రతి లెటరూ కొన్నివందలసార్లు చదవా లన్పిస్తుంది లెటరు విప్పాను.

"ఒరేయ్ వాజమ్మా!

నీవు నిజంగా బిజినెస్ మాగ్నెట్‌వో. బద్దకం మనిషివో తల బద్దలు కొట్టుకున్నా అర్థం కావడంలేదురా! నీ బద్ధకానికి 'బిజీ' అనే అందమైన పేరు తగిలించా వనుకుంటున్నాను. నీలాంటి వాడు స్నేహితుడు కావటం నా ఖర్మ.

నీ పెళ్ళికి మూడ్రోజులు ముందొచ్చి ఎంత హడావుడి చేశానూ....ఎంత తతంగం జరిపించాను. మర్చిపోయా వట్రా ఫూల్?....కనీసం సూత్రధారణ సమయంలోనైనా కన్పిస్తావనీ, చిరునవ్వుతో దీవిస్తావని ఎంతగా యెదురు చూశానో తెలుసా?....నీవు లేవన్న లోటుతో నేను పెళ్ళి కూడా ఆనందంగా చేసుకోలేకపోయాన్రా! తర్వాత 'సారీ' చెబుతూ లెటరు వ్రాయగానే సంబరం కాదురా!....

నేను గట్టి నిర్ణయంతో ఈ లెటరు వ్రాస్తున్నాను. 'ఆపదలోనూ, ఆనందంలోనూ పాలుపంచుకునేవాడే ప్రాణ స్నేహితుడన్నావు' ఓసారి. గుర్తుందా? .. నీవే నా ప్రాణ మిత్రుడవైతే వారం రోజులు మా దగ్గర వుండేలా మీ దంపతు లిద్దరూ కలసి రండి. మరలా నా నుండి లెటరు వచ్చేది మీరు నన్ను కలసివెళ్ళిన తర్వాతనే. పెద్దమ్మ

గారికి, పెదనాన్నగారికి నా నమస్కారములు అందజేయి. వుంటాను మరి.

నీకేమీ కాని

నీ మిత్రుడు—శ్రీహరి."

వెధవ! నీ కేమీ కాని నీ మిత్రుడట. ఆ ఉత్తరం చదువుతున్నంతసేపూ వాడి కోపాన్ని తల్చుకుని నవ్వుకున్నాను. ప్రాణమిత్రుడి పెళ్ళికి వెళ్ళాల్సిన సమయంలో బిజినెస్ పనిమీద తప్పనిసరి ఢిల్లీ వెళ్ళాల్సినందుకు ఇప్పటికీ బాధపడుతూ వుంటాను.

వాడు నిర్ణయం తీసుకున్నాడంటే దానికి తిరుగుండదు. అసలు విషయం వివరిస్తూ అర్థం చేసుకోమని ఎన్ని లెటర్లు వ్రాసినా రిప్లయి యివ్వలేదు.

ఉత్తరం మడిచి జేబులో పెట్టాను.

తెల్లవారితే హైద్రాబాద్‌లో వుంటాను. హఠాత్తుగా వూడిపడిన నన్నుచూసి ఆనందంతో కౌగిలించుకుని అన్నీ మరచిపోతాడు.

ప్రయాణీకులు నిద్రమత్తుతో జోగుతున్నారు. నిద్రపోదామని కళ్ళు మూశాను.

"టప్...." మన్న చప్పుడు. 'కెవ్వు'మన్న కేకతో కంపార్ట్‌మెంటంతా మేల్కొంది.

ఏం జరిగిందోనని కళ్ళు తెరచి క్రింద బెర్త్‌వైపు చూశాను. ఆ కుర్రాడికి పది సంవత్సరాలుంటాయి. బహుశా కిటికీకి ఆనుకుని పడుకునుండుంటాడు. విండో గ్లాస్ పడి చేతివ్రేలు నలిగి 'రక్తం' కారుతుండటంతో ఏడ్వటం ప్రారంభించాడు.

ఆ 'రక్తం' చూడగానే .... పదేళ్ళ శ్రీహరిగాడు. అప్పర్ ప్రైమరీ స్కూల్ రోజులు కళ్ళముందు కన్పించసాగాయి. ఆ రోజు—

తెలుగు మాష్టారు నోట్సు చెబుతున్నాడు. ఆయన నోట్సు చెప్పే స్పీడు, తమిళనాడ్ ఎక్స్‌ప్రెస్ స్పీడ్ ఒకటే నన్న మాట.

రాస్తున్న శ్రీహరిగాడి పెన్సిల్లో యింకు అయిపోయింది. గబగబా బాక్సు నుండి పెన్సిలు తీయబోయి అది జారి క్రింద పడటంతో ములుకు కాస్తా విరిగిపోయింది. అంతకన్నా ఆదుర్దాగా బ్లేడు వెతికి తీసి, పెన్సిలు చెక్కే హడావుడిలో పడ్డాడు.

ఉన్నట్లుండి వాడు ఒక్కసారిగా క్రింద పడిపోయి కళ్లు తేలేసి చూడసాగాడు. పిల్లలంతా కంగారుగా అరిచారు. ఆ క్షణంలో వాడ్ని చూసి చాలా భయపడ్డాను. వాడికేమైందో నని.

తెలుగు మాష్టారు నీళ్ళు ముఖం మీద చల్లి ....వాడ్ని పైకెత్తి టేబుల్ మీద పడుకోబెట్టారు. అప్పుడు కన్పించింది వాడి వ్రేలునుండి కారుతున్న 'రక్తం'. అంటే పెన్సిలు చెక్కే హడావుడిలో వ్రేలు తెగిందన్న మాట. నేను వెళ్ళి 'టించర్' తెచ్చి అంటించాను. రెండు నిమిషాల అనంతరం వాడు కళ్ళు తెరచి మెల్లగా పైకి లేచాడు.

"పిరికి వెధవ! ....ఆ మాత్రం రక్తానికే కళ్ళు తిరిగితే ఎలారా?"—అంటూ తెలుగు మాష్టారు నవ్వుతూ తిట్టిన తిట్లు నే నప్పుడప్పుడూ తిట్టి ఏడ్పిస్తుంటాను....

క్రింద బెర్తులో పిల్లాడు ఏడుపు ఆపి, తల్లి వడిలో తల పెట్టుకు నిద్రపోతున్నాడు. నేనూ తిరిగి పడుకుంటూ వాచీ వైపు చూశాను. ఒంటిగంట. నిద్రాదేవిని ప్రార్థిస్తూ కళ్ళు మూశాను.

—ఉన్నట్లుండి ఎందుకో మెలకువ వచ్చింది. కళ్ళు నులుముకుని లేచి కూర్చున్నాను. ట్రైను ఆగిపోయింది.

ఎవరి నోటివెంట విన్నా—"ఏక్సిడెంట్" అనే మాటే. నా నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది.

అప్పటికే ఒకరిద్దరు వెళ్ళి ట్రైన్ క్రింద పడిన వ్యక్తిని చూచి వచ్చి, మిగిలినవాళ్ళకు వివరిస్తున్నారు. "అబ్బా! చూడలేకపోయామండి బాబూ! ఎలా పడ్డాడోగానీ, రెండు కాళ్ళూ తెగిపోయాయి" ఆ 'రక్తం' చూస్తుంటే కళ్ళు తిరిగాయంటే నమ్మండి. గుండెల మీద చేయి వేసుకుని భయాన్ని కళ్ళద్వారా చూపిస్తూ చెపుతోన్న ఆ వ్యక్తిని చూస్తుంటే... శ్రీహరిగాడే నా మస్తిష్కంలో కదలాడుతున్నాడు.

అప్రయత్నంగా ఓ పాత సంఘటన నా మనసు తెర మీద ప్రొజెక్ట్ అయింది.

వాడూ, నేను కాలేజీల్లో చదువుకునే రోజులు. ఓరోజు ఇద్దరం కలిపి వెళుతుంటే రోడ్డుమీద జనం గుమికూడి వుండటం— "లారీ తలమీంచి పోయిందండి. పాపం చచ్చిపోయాడు" అని చెప్పుకోవటం చూశాం.

"ఏక్సిడెంట్ ఎలా జరిగిందో చూసి వస్తాను. నువ్విక్కడే వుండరా!" అంటూ బయల్దేరాను.

"ఒరేయ్! ఆగరా! నేనూ వస్తాను" అంటూ వెంట పడ్డాడు శ్రీహరి.

"ఆ రక్తం చూశావంటే కళ్ళు తిరిగి పడతావు వద్దులే బాబూ.... పదపోదాం" అంటూ నేను కూడా ఆగిపోయాను.

అప్పుడేదో చిన్నతనం. ఇప్పుడు పెద్దవాడ్ని కాలేదట్రా? అసలా ఏక్సిడెంట్ యెలా జరిగిందో, ఆ చనిపోయినవాడు ఎలా వున్నాడో చూడాలని కుతూహలంగా వుందిరా" అంటూ నే నెంత చెబుతున్నా వినకుండా నా చేయి పట్టుకు

బయల్దేరదీశాడు గుంపును చీల్చుకుంటూ ముందుకెళ్ళి చూశాం—

అక్కడి దృశ్యం చూడగానే కడుపులో త్రిప్పినట్లయింది. శ్రీహరిగాడు చూస్తే పడిపోవటం ఖాయమేనన్న ఊహ రాగానే....వాడ్నక్కడ్నుండి వెంటనే బయటకు తీసుకువెళ్ళాలని వెనక్కి తిరిగాను. అప్పటికే ఆ దారుణ దృశ్యం చూశాడు కాబోలు....కళ్ళు తేలవేస్తూ నిలద్రొక్కుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

అంతే—వెంటనే వాడ్నింకో మనిషి సాయంతో పాన్ షాప్ ప్రక్కన కూర్చోబెట్టి సోడా ఒకటి కొట్టించి, కొంచెం నీళ్ళు వాడి ముఖంమీద చల్లి... మిగిలిన సోడా పట్టించాను.

మరో అయిదు నిమిషాలగ్గానీ వాడు కోలుకోలేదు. తర్వాత తెగతిట్టాను.

"ఒరేయ్! విజయ్! రక్తం చూస్తే కళ్ళు తిరిగిపడే బలహీనత నాలో యెలా చోటుచేసుకుందో తెలియడం లేదురా!" వాడు విచారంగా నావైపు చూస్తూ అన్న మాటలు నాకు యిప్పటికీ గుర్తే.

ఆ తర్వాత కొద్దిరోజులకే నాన్నగారు బిజినెస్ మకాం వైజాగ్ మార్చుకున్నారు. వైజాగ్ వచ్చి కొద్ది నెలలకే బిజినెస్ బాగా అభివృద్ధి కావటం, నాన్నగారు ఒక్కరే చూసుకోలేక సతమతమౌతుంటే కాలేజీకి మంగళంపాడి, నేను కూడా నాన్నగారి పనుల్లో సాయం చేయటం మొదలు పెట్టాను. హైద్రాబాద్ వదలివచ్చి ఏడేళ్ళప్పటికి. వాడే అప్పుడప్పుడొచ్చి సరదాగా నాల్గురోజులుండి పోతుండేవాడు. వాడ్ని ఆఖరుసారి చూసింది నా పెళ్ళప్పుడు. మరలా ఇంత కాలానికి వాడ్ని చూడబోతున్నాను.

ట్రైను కదిలింది. ఆలోచనల్నుండి బయటపడి వాచీ వైపు చూశాను. అయిదూముప్పై. ఇంకో మూడు గంటల్లో వాడ్ని చూస్తానన్న మాట.

2

బ్రీఫ్‌కేస్‌తో గేటు త్రోసుకుని లోపలకు నడిచాను. శ్రీహరి యింట్లోకి అడుగుపెడుతూనే గోడకున్న ఫోటో, వేసిన దండ.... చూడగానే పాతాళంలోకి కృంగిపోతున్నట్లు ఫీలయ్యాను. బ్రీఫ్‌కేస్ జారి క్రిందపడింది.

"సృ....జ....న...." బాధగా మూల్గింది నా మనసు.

"ఒరేయ్! ఈ ఫోటోలో అమ్మాయినేరా నే పెళ్ళాడ బోయేది! పేరు సృజన. ఎలా వుంది?...." పెళ్ళికి ముందు వాడు ఫోటో పంపుతూ వ్రాసిన లెటరు నా మన సులో లీలగా మెదిలింది.

పట్టుమని పెళ్ళి జరిగి మూడ్నెల్లు అయిందో లేదో.... యిదెలా సంభవం?....ఆలోచనల్తో నా తల పగలకముందే శ్రీహరి తల్లి శాంతమ్మగారు ఆ గదిలోకి వచ్చి నన్ను చూశారు.

"నాయనా విజయ్! వచ్చావా బాబూ!" అంటూ పైట కొంగు నోట్లో కుక్కుకొని పెద్దగా రోదించసాగారామె.

"పిన్నీ! ఏం జరిగిందసలు?....సృజన....సృజన ఎలా పోయింది శ్రీహరి ఈ విషయం నాకెందుకు తెలపలేదు?" దుఃఖాన్ని ఆపుకోలేక ఏడుస్తూనే అడిగాను.

"ఏం చెప్పమంటావు బాబూ! మహాలక్ష్మి మా ఇంట పాదం పెట్టిందని మురిసిపోయాం. మృత్యువుకు దగ్గరపడి మా గడప చేరిందని అనుకోలేదు బాబూ! పదిరోజుల క్రిందట స్టవ్వుకు చీరంటుకుని...." ఆ తర్వాత మాట్లాడ లేక పెద్దగా రోదిస్తూండిపోయారు శాంతమ్మగారు.

"శాంతా! ఊరుకోవే మరలా ఫిట్స్ వస్తాయి. పోయిన వాళ్ళగురించి గుండె పగిలేలా ఏడుస్తే వాళ్ళు తిరిగొస్తారుటే?...." కన్నీళ్ళు కార్చుతూ భార్యను అనునయించ సాగారు అప్పుడే అక్కడకొచ్చిన శ్రీహరి తండ్రి గోపాలరావుగారు.

నా దొక్కటే ఆలోచన—ఈ షాక్‌ని శ్రీహరిగాడెలా తట్టుకోగలిగాడు.... వెంటనే వాడ్ని చూడాలి. నా గుండెల కానుచ్చుకుని, నా మాటలతో ఊరడించి.... వాడి బాధను కొంచమైనా ఉపశమింపజేయాలి.

"శ్రీహరి ఎక్కడున్నాడు బాబాయ్!" కన్నీళ్ళు తుడుచుకుంటూ అడిగాను.

"జైల్లో."

"బా.... బా .... య్...." నమ్మలేనట్టరిచాను.

"అవును బాబూ! ఇంటి ఇలవేల్పు పోయిందన్న బాధలో మేముంటే.... వాడెవడ్నో దారుణంగా చంపి జైలుకెళ్ళాడు."

గోపాలరావుగారి మాటలతో నాకు మరీ పిచ్చెక్కినట్లయింది.

"బాబాయ్.... బాబాయ్.... ఏమిటిదసలు?.... వాడు హత్య చేయటమేమిటి? నా కంతా అయోమయంగా వుంది" పిచ్చిగా అరిచాను.

"విధి మాపై పగబట్టిన వైనం తల్చుకుంటే మాకూ అయోమయంగానే వుంది బాబూ! ఏం జేస్తాం. చావలేక, బ్రతకలేక బ్రతుకుతున్నాం" మరలా ఆయనకేం జ్ఞాపకం వచ్చిందో ఏడుస్తూ వేరే గదిలోకి వెళ్ళిపోయారు.

శ్రీహరిని ఏ జైల్లో వుంచిందీ తెలుసుకుని బయల్దేరాను.

3

జైలర్ పర్మిషన్ తీసుకుని, సెంట్రీ వెనుక శ్రీహరి సెల్‌వైపు నడిచాను.

తల క్రింద చేతులు పెట్టుకుని నిరాశగా శూన్యంలోకి చూస్తున్నాడు వాడు. పెరిగిన గడ్డం, పీక్కుపోయిన ముఖంతో. చిక్కిపోయిన్నట్లున్న వాడ్ని చూడగానే....నా మనసెవరో పట్టి పిండినట్లయింది.

"హరీ!" మెల్లగా పిలిచాను.

తల మాత్రం ప్రక్కకు త్రిప్పి చూశాడు. ఒక్క క్షణం.... ఒకే.... ఒక్క క్షణం.... అంతే-మెరుపులో ఒక్క ఉదుటున లేచి "విజయ్!" అంటూ పరుగెత్తుకొచ్చి కటకటాల మధ్యనుండి చేతులు పోనిచ్చి కౌగిలించుకున్నాడు. మా ఇద్దరి కౌగిలి మధ్యా కటకటాలు నలుగుతున్నాయి.

"నిన్నిలా చూస్తానని నేనెప్పుడూ అనుకోలేదురా హరీ! ఏం జరిగిందసలు? నీకెందుకురా ఈ శిక్ష?...." కౌగిలి సడలించి వాడి భుజంమీద చేయివేసి నిమురుతూ అడిగాను.

"నేనో వ్యక్తిని అతిదారుణంగా చంపాన్రా! అందుకు?"

"నో(.... నేన్నమ్మను. రక్తం చూస్తేనే కళ్ళు తిరిగి పడే పిరికి వెధవ్వి....ఓ మనిషిని హత్య చేశావంటే వచ్చినా నమ్మను. నిజం చెప్పు. నీ కేం భయంలేదు. నిన్నెవరైనా ఈ కేసులో యిరికిస్తే... నిన్ను విడిపించే ఏర్పాట్లు చేస్తాను. నువ్వు నిజంగా హత్య చేశావంటే మాత్రం నమ్మనుగాక నమ్మను. నిజం చెప్పు." ఉద్రేకంతో వాడ్ని ఊపేస్తూ అడిగాను.

"నీవు నమ్మినా నమ్మకున్నా నేను చెప్పింది పచ్చినిజం. నాలో రేగిన కోపం, కసి, ప్రతీకారం ముందు నా బలహీన

తను సంయితం మర్చిపోయా న్నా ఆ క్షణంలో వాడ్ని ఖండ ఖండాలుగా తెగనరకాలన్న కసి ....అంతే—"

"ప్రతీకారమేమిట్రా?....అసలు నువ్వు హత్య చేయ వలసిన ఆగత్యమేమొచ్చింది? ప్లీజ్! వివరంగా చెప్పరా!"

"వద్దురా! ఆ దారుణగాథ గుర్తు వస్తుంటే నా రక్తం వుడికిపోతుంది."

"నీ నుండి నిజం తెలుసుకోనిదే నే నూరుకోను."

"తెలుసుకుని ఏం చేస్తావురా?"

"నిన్ను రక్షించుకుంటాను."

"ఉరిశిక్ష పడకుండానా?"

"ఏ శిక్షా పడకుండా."

"నీవే నా ప్రాణమిత్రుడివైతే ఆపని చేయనని మాటివ్వు" చేయి చాపుతూ అన్నాడు.

"హరీ!" బాధగా చూశాను.

"అవున్రా! నాకు జరిగిన అన్యాయానికి ఏ ప్రభుత్వం న్యాయం చేకూర్చదు. అందుకే నాకు చేతనైన న్యాయం నేను చేశాను. సృజన ఆత్మకు శాంతి చేకూర్చాను."

"అంటే...." నాలో ఎన్నెన్నో ప్రశ్నలు.

"అన్నీ వివరంగా చెపుతాను. ముందు నాకు 'ప్రోమిస్' చేయి."

వాడి చేతిలో చేయివేసి "సరే చెప్పు" అన్నాను.

ఓసారి గాఢంగా నిట్టూర్చి చెప్పటం ప్రారంభించాడు—

4

ఆ రోజు శుక్రవారం—

అమ్మా, నాన్న చుట్టాల పెళ్ళికి ఉదయాన్నే విజయ వాడ వెళ్ళారు. మరుసటిరోజుగ్గానీ తిరిగిరారు. ఇంట్లో సృజన, నేను. ఆ రోజంతా సృజనతో ఆనందంగా గడపా

లని ఆఫీసుకు శెలవు పెడదామని వెళ్ళాను. కానీ—వీలు పడలేదు. పై పెచ్చు అర్జంటు పనివుండి అది పూర్తిచేసి ఇంటి కొచ్చేసరికి ఏడు దాటింది.

సృజన వద్దని చెపుతున్నా వినకుండా సెకండ్‌షో సిని మాకు వెళదామని బలవంతంగా బయల్దేరదీశాను. 'అన్న పూర్ణ'లో భోజనాలు ముగించి "ది డీప్" సినిమాకు వెళ్ళాము.

అది సిటీకి దూరంగావున్న హాలైనా ఆ సినిమా చాలా మంది బావుందని చెప్పటంతో, ఎడ్వెంచరింగ్ మూవీలంటే సృజన యెక్కువ యిష్టపడుతుందని తెలిసి ఆ సినిమాకు తీసుకువెళ్ళాను.

సినిమా పూర్తయ్యేసరికి పన్నెండు దాటింది.

బయటికొచ్చి మోటార్‌బైక్ స్టార్ట్ చేస్తున్నాను. ఎంత ట్రైచేసినా అది స్టార్టు కావడంలేదు. టైము గడిచిపోతుంటే చిరాకెత్తుతోంది. మరో పది నిముషాలు ప్రయత్నించినా అది స్టార్టు కాకపోవడంతో, హాల్ మేనేజర్‌తో చెప్పి, ఓ ప్రక్కన పెట్టి, లాక్‌చేసి....సృజనతో కలిసి బయల్దే రాను.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. ఒక్క ఆటో కూడా రావడంలేదు?

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, జోక్స్ వేసుకుంటూ నడుస్తున్నాము.

కొంతదూరం నడిచేసరికి రోడ్డు ప్రక్కన రెండు టాక్సీలు, రోడ్డుకు అడ్డంగా ఓ నల్గురు వ్యక్తులు కర్కశ మైన చూపులు, కండలు తిరిగిన శరీరాలతో నిలుచుని కన్పించారు.

వాళ్ళనలా చూడగానే నాకే తెలియని పిరికితనం నన్నావహించసాగింది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. వాళ్లు ఏం చేస్తారో తెలియదు. వాళ్ళను యెదిరించి వెళ్ళడం యెలాగో తెలియదు. నా చేతుల్లో వున్న సృజన చేయి భయంతో వణుకుతోంది.

లేని ధైర్యం తెచ్చుకుంటూ అడిగాను.

"ఎవరు మీరు?....ఎందుకు మాకిలా అడ్డు నిలబడ్డారు?"

"ఆ విషయం నేను చెబుతాను మిష్టర్!" టాక్సీ డోర్ తెరుచుకు దిగాడో వ్యక్తి.

అతన్ని చూస్తూనే సృజన 'కెవ్వున' అరచి నన్ను గట్టిగా చుట్టుకుపోతూ అంది

"అతనేనండి....అతనే....భూషణం ..."

ఆ పేరు వింటూనే ప్రక్కన బాంబు ప్రేలినట్లు అదిరిపడ్డాను.

భూషణం ఎం.పి. రాజశేఖరం కొడుకు. ఓసారి సృజన ఆఫీసునుండి వస్తుంటే కావాలనే 'డేష్' యిచ్చి పిచ్చి పిచ్చిగా వాగుతూ చేయి పట్టుకున్నందుకు చాచి చెంప పగల కొట్టిందట. "ఎప్పటికైనా నిన్ను అనుభవించకపోతే నా పేరు భూషణం కాదు" అని శపథం చేసి వెళ్ళిపోయాడట. ఆ తర్వాత రెండ్నెల్లకే సృజనతో నా పెళ్ళి కావటం, ఓ రోజు మాటల సందర్భంలో సృజన ఈ విషయం నాతో చెప్పడం జరిగింది.

కానీ—భూషణం యిలా యెదురుపడతాడని నేనెప్పుడూ ఊహించలేదు.

భయంతో నన్ను మరింత గట్టిగా చుట్టుకుపోతూ ఏడుస్తోంది సృజన. ఈ పరిస్థితి యెలా యెదుర్కోవాలో అర్థం కావడంలేదు నాకు.

రెండడుగులు ముందుకొచ్చాడు భూషణం.

"చూడు మిష్టర్! మా వాళ్ళు నీకు సత్కార కార్యక్రమములు మొదలుపెట్టకముందే మర్యాదగా సృజనను నా దగ్గరకు పంపు. ఈ ఒక్క రాత్రికే" నవ్వుతూ మరింత ముందుకొచ్చాడు.

"ఎందుకు?" తీక్షణంగా చూస్తూ అడిగాను. అప్పుడే నాలోని మగాడి తాలుకు పౌరుషకణాలకు మెల్ల మెల్లగా చైతన్యం వస్తోంది.

"పిచ్చి పశ్న. ఓ మగాడు ఆడదాన్ని ఏం చేస్తాడో.... అది చేయటాన్కి" వెకిలిగా నవ్వాడు.

"నా ప్రాణం వుండగా సృజనను నీ దగ్గరకు పంపను" వస్తున్న కోపాన్ని అణచుకుంటూ అన్నాను.

"ఆ ప్రాణం ఉండగానే తీసుకెళతాను చూడు" ఊహించని విధంగా సృజన చేయి పట్టుకుని బలంగా లాగాడు భూషణం.

కోపాన్ని కంట్రోల్ చేసుకోలేక, చాచిపెట్టి వాడి చెంప మీద కొట్టాను.

అంతే—మూడ్నిమిషాలపాటు ఏం జరిగిందో తెలియ లేదు నాకు. తెలిసేసరికి .... భూషణం అనుచరులు కొట్టిన దెబ్బలకు నీరసంగా నేలవాలిపోయి వున్న నన్ను నిలబెట్టి చేతులు వెనక్కి విరిచి పట్టుకున్నారు వాళ్ళు.

నా ముక్కునుండి పెదాలమీదకు కారుతోంది రక్తం. ఆవేశంతో రొప్పుతూ భూషణం వైపు చూశాను.

సృజన చేయి పట్టుకుని బలవంతంగా తనవైపు త్రిప్పుకుంటున్నాడు.

"ప్లీజ్! భూషణం నన్నేం చేయకు. ఆ రోజు నిన్ను కొట్టినందుకు నన్ను క్షమించు. దయచేసి మమ్మల్ని వదిలి

పెట్టు. నీకు దండం పెడతాను" భూషణం చేతినుంచి బయట పడటాన్కి ప్రయత్నిస్తూ ప్రాధేయపడుతోంది సృజన.

"చూడు మిష్టర్! అనవసరంగా ఆవేశపడి, మా వాళ్ళకు పని కల్పించావ్! ఇక ఆవేశం మాని.... శుభ్రంగా ఇంటికి వెళ్ళి పడుకో. తెల్లారేసరికి నీ భార్యామణిని నీ యింట్లో భద్రంగా వదిలే బాధ్యత నాది. ఈ రాత్రికి నేను చెప్పినట్లల్లా నడుచుకోమని నువ్వు కూడా ఓ సారి చెబితే బావుంటుందను కుంటున్నాను. లేకపోతే—ఈ మల్లె మొగ్గని....ఊహూం.... మల్లెపువ్వుని రేకులు త్రెగగొట్టి అయినా పరిమళాలు ఆస్వాదిస్తాను. తెల్లారేలోపున యెలాంటి పిచ్చివేషాలు వేసినా.... నీ భార్య ప్రాణాలు నా చేతిలో వున్నాయన్న విషయం గుర్తుంచుకో. నేను సృజనను నీకు చేర్చేంతవరతూ నా మనుషులు నీకు కాపలాగా వుంటారు. సృజన గురించి బెంగ పెట్టుకోకు. తెల్లారేసరికి క్షేమంగా చేర్చుతాను. రంగా! కారు బంగ్లావైపు పోనియ్" అన్జెప్పి....సృజనను బలవంతంగా ఈడ్చుకుంటూ టాక్సీలో పడేసి, నోరు నొక్కి పట్టుకున్నాడు భూషణం.

నన్ను పట్టుకున్న నలుగురిలో ఒకడు వెళ్ళి భూషణం కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

నా నుండి దూరమైపోతున్న సృజనను చూస్తుంటే.... నా నిస్సహాయస్థితిని తల్చుకుని కుమిలిపోతూ ఏడ్చాను.

ఏడుస్తోన్న నన్ను బలవంతంగా టాక్సీలో యెక్కించి, నా యింటివైపు పోనిచ్చారు.

ఇంట్లోకి రాగానే తలుపులు మూసి కాపలాగా నిల బడ్డారు.

తప్పించుకుందామని ప్రయత్నించినా వీలువడదు. వీలు

పడినా ఏం చేస్తాను.

"సృజనా!....సృజనా!...." బాధగా మూల్గుతోంది నా మనసు. నా ఆవేదనా, బాధ కన్నీళ్ళ ద్వారా బయటకు తన్ను కొస్తోంది ఇదంతా ఓ భయంకరమైన పీడకలైతే యెంత బావుండ్ను. తట్టుకోలేని మనస్సంఘర్షణ నాలో—

బీడీలు వెలిగించి అగ్గిపెట్టె నా టేబిల్ ముందు పడేశారు వాళ్ళు.

"ఒరేయ్! బాబుగారు ఇప్పుడేం చేస్తూ వుండి వుంటార్రా?" నవ్వుతూ అడిగాడు వాళ్ళలో ఒకడు.

"చెయ్యి వేస్తేనే కస్సు మంటోంది కదరా ఈ కేసు. వద్దు....వద్దని చిందులేస్తుంటే బాబుగారు మీదపడి చీర లాగేసి, జాకెట్ చింపేసి...."

"వాళ్ళ సంభాషణ వినలేక చెవులు గట్టిగా మూసు కున్నాను. భగవాన్! ఏ మగాడికీ యిలాంటి పరిస్థితి ఎదురు పడనీయకు. ఈ బాధ అనుభవించేకన్నా ప్రాణాలు తీసేయ్" మనసులోనే మూగగా వేడుకున్నాను.

నేననుభవిస్తోన్న మానసికక్షోభ చూసి వాళ్ళు నవ్వుతూ మరింత పచ్చిగా చెప్పుకోసాగారు.

ఎంత వినకూడదనుకున్నా ఆ సంభాషణ చెవిలోకి దూసుకువస్తూనే వుంది.

అప్రయత్నంగా నా కళ్ళు టేబిల్‌మీదున్న అగ్గిపెట్టెపై నిలిచాయి. గభాలున అందుకుని పుల్లతీసి వెలిగించాను. వెలుగుతోన్న పుల్లపై నున్న నా ఎడంచేయి కాలుతోం దిపుడు.

కాలుతోన్న చర్మం....మంట....మంట....అయినా ఆగ లేదు. పుల్ల తర్వాత పుల్ల వెలిగిస్తూనే వున్నాను. చేయి కాలి చర్మం వూడిపోతోంది. పళ్ళ బిగువున బాధ భరి

స్తున్నాను.

వాళ్ళేమనుకున్నారో మరి—నా చేతిలో అగ్గిపెట్టె లాక్కొని మాట్లాడకుండా నిలబడ్డారు.

అప్పటికే నా వళ్ళంతా చెమటతో తడిసిపోయింది. కాలిన చేతినుండి వస్తోన్న బాధకన్నా, సృజన కోసం నా మనస్సు పడుతోన్న ఆవేదనే భరించలేకపోతున్నాను.

"నన్ను క్షమించు సృజనా!....నిన్ను రక్షించుకోలేని ఈ దౌర్భాగ్యుణ్ణి క్షమించు" పిచ్చిగా జుత్తు పీక్కున్నాను.

* * *

తెల్లవారబోతోంది—

బయట టాక్సీ ఆగిన చప్పుడు. నడచి వస్తోన్న మెత్తని పాదాల ధ్వని.

ఆ ధ్వని నాకు పరిచితమే. కానీ—ఆ ధ్వనిలో కొంచెం మార్పు. వేగంలేదు.

రెండుసార్లు కారు హారన్ మ్రోగింది. అది సంకేతంలా నాకు కాపలావున్న వాళ్ళు ఆనందంగా లేచి తలుపు తీసుకు వెళ్ళిపోయారు.

గబగబా గుమ్మంవైపు నడిచాను. ఎదురుగా సృజన—

భూషణం అన్నట్లు రేకులు తెగిన మల్లెపువ్వులాగే వచ్చింది సృజన.

ఒక్కసారి సృజనను నా కౌగిట్లో తీసుకుని అంతా మర్చిపొమ్మని చెప్పాలని వుంది. "నా జీవితం నాశనమైపోయింది. ఇక భార్యగా మీకు తగనండి!" అని అనకముందే—"నీ జీవితం పాడుకావటానికి భర్తగా భార్యను రక్షించుకోలేని అసమర్థుణ్ని కావడం నా తప్పు సృజనా! నా తప్పుకు నిన్ను శిక్ష అనుభవించనీయను" అని చెప్పాలని వుంది.

"సృజనా! అంటూ దగ్గరకు వెళ్ళబోయాను.

"ప్లీజ్!... కొంచెం తప్పుకోండి స్నానం చేసి వస్తాను" ఆ పలికిన తీరులో ఎటువంటి భావముందో అర్థం కాలేదు నాకు నా ఊహలన్నీ తారుమారయే సరికి ఆశ్చర్యపోతూ అడ్డు తప్పుకున్నాను.

లోపలకు వెళ్ళిపోయింది సృజన.

తిరిగి నాలో ఆలోచన్లు. సృజన ఈ షాక్ నుండి ఎప్పటికి కోలుకుంటుంది? ... ఇకముందు నాపై తన ప్రవర్తన యెలా వుంటుంది? అలా ఆలోచిస్తూ ఎంతకాలమున్నానో గానీ ..లోపల్నుండి అదో రకమైన వాసన వస్తోంటే గబగబా వెళ్ళాను.

వంటగది నుండి సన్నటి పొగలు బయటకు వస్తున్నాయి?

నా గుండె ఆగినంత పనైంది. "సృజనా! తలుపు తీయ్!" అరిచాను.

అటునుండి సమాధానంలేదు. బాధతో వస్తోన్న ఆక్రందనలు అణచుకోవటానికి ప్రయత్నిస్తోన్న మూలుగు మాత్రం విన్పిస్తోంది.

ఇక ఆగదల్చుకోలేదు. తలుపులు పగలగొట్టసాగాను. పది నిముషాలగ్గానీ అవి ఊడిపడలేదు. అప్పటికే ఆలస్యమైపోయింది. సృజన నాకందని సుదీర తీరాలకు పారిపోయింది.

"ఎంత పని చేశావు సృజనా! నన్నొదిలి ఎలా వెళ్ళిపోయావు?" కాలిపోయిన సృజన శరీరాన్ని కావలించుకుని గుండె పగిలేలా ఏడ్చాను.

అప్పుడే ఊర్నుండి అమ్మా, నాన్న వచ్చారు.

సృజన శవాన్ని చూడగానే....అమ్మ 'ఫిట్స్' వచ్చి

పడిపోయింది. అంత పెద్దవయస్సున్న నాన్నగారు చిన్న పిల్లాడిలా నన్ను పట్టుకుని విలపిస్తూ "ఎలా జరిగిందిరా బాబూ!" అని అడుగుతుంటే—ఓ క్షణం ఏం చెప్పాలో తెలియలేదు నాకు.

జరిగింది చెపితే....సృజనకి 'చెడిపోయిన ఆడదిగా' ఈ సమాజంలో ముద్ర పడుతుంది. అందుకే అబద్ధం చెప్పాను. స్టవ్వుకు చీరంటుకుందని.

సృజనను మట్టిచేస్తూ ప్రతిజ్ఞ చేశాను. "నీ చావుకు కారణమైన ఆ భూషణాన్ని చంపి నీ ఆత్మకు శాంతి చేకూర్చుతాను సృజనా!" అంటూ.

* * *

రాత్రి పదకొండు దాటుతోంది—

అమావాస్య కాబోలు చీకటి చిక్కగా వుంది. ప్రతీకార జ్వాలలతో అడుగు లేస్తున్నాను. మామిడి తోటల మధ్యలో వుంది ఆ భూషణం బంగళా. లోపల లయిటు వెలుగుతోంది.

గూర్ఖా బీడీ కాల్చుతూ లైటు వెలుగుతోన్న గదివైపు చూస్తున్నాడు.

ప్రక్కన అలికిడి అయేసరికి గభాలున తల త్రిప్పాడు. ఎదురుగా నన్ను చూడగానే చేతిలోని లాఠీ పైకెత్తాడు. అంతకన్నా వేగంగా నా పిడికిలి వాడి ముఖంమీద పడింది. ఒకే ఒక్క దెబ్బ....నేల వాలిపోయాడు. ముందుకు అడుగు వేశాను, ఇంకా భూషణం అనుచరులు లోపల ఎంతమంది ఎదురవుతారో ననుకుంటూ నడిచాను. భూషణం దురదృష్టమో....నా అదృష్టమో ఎవరూ లేరు.

మెల్లగా మెట్లెక్కి పైకి నడిచాను.

ఓ గదిలో నుండి స్త్రీ పెనుగులాడుతోన్న శబ్దాలు.

మధ్య మధ్య క్రింద పడుతోన్న సామాన్ల చప్పుడూ విన పడుతోంది. అంటే—మరో స్త్రీ వాడి కామ దాహానికి బలి కాబోతుందన్న మాట. భూషణం అనుచరులు బహుశా ఆ స్త్రీ తాలూకు భర్తకు కాపలా కాయటాన్కి, అతని ముందే భార్యని రేప్ చేస్తోన్న భావన కల్గించటాన్కి వెళ్ళి వుంటారు.

పరుగెత్తుతూ లైటు వెలుగుతోన్న గదివయిపు వెళ్లాను.

శీలం రక్షించుకునే ప్రయత్నంలో కాబోలు తలుపు వయిపు పరుగెత్తుకొస్తోన్న కాలి అందెల సవ్వడి తలుపు గడియ తీసినట్లు చప్పుడయింది. మళ్ళీ అంతలోనే అక్కడ్నుండి బలంగా ఎవరో లాక్కువెళుతున్నట్లు "వదులు—నన్నొదులు" అనే మాటలతో ఆ అందెల సవ్వడి దూరం కాసాగింది.

మరలా తలుపు గడియ పడక ముందే బలంగా కాలితో తన్నాను. ఆ విసురుకు తలుపు తెరుచుకుని అటూ ఇటూ కొట్టుకున్నాయి. ఎదురుగా నా కన్పించిన దృశ్యంతో నాలో రక్తం పొంగులుదీస్తూ ప్రవహించింది.

"భూ—ష....ణం...." నా గొంతు నాకే కర్కశంగా వినిపించింది.

ఆమెను ఆక్రమించుకోబోతున్న భూషణం వులిక్కిపడి ఆమె మీద నుండి లేచాడు. నగ్నంగా వున్న ఆమె గభాలున లేచి వంటికి చీర చుట్టుకుని బయటకు పరుగు తీసింది.

"నువ్వా! ఎందుకొచ్చా విక్కడికి?" నగ్నంగా నిలబడి వున్న భూషణం భయంతో ఒక్కొక్క అడుగే వెనక్కి వేస్తున్నాడు.

"ఎందుకా! ఒక మగాడు ఆడదాన్ని ఏం చేస్తాడో తెలియజెప్పావు కదరా! ఆ ఆడదాని మొగుడేం చేస్తాడో

నీకు చెప్పదామని వచ్చాను" భద్రంగా దాచుకున్న ఎనిమిది అంగుళాల కత్తి బయటకు తీశాను. లైటు కాంతిలో తళ తళా మెరుస్తోంది.

నా చేతిలో కత్తి చూస్తూనే హిస్టీరియా వచ్చినవాడిలా వణికిపోతూ వేడుకున్నాడు "ప్లీజ్! నీకు దండం పెడ తాను నన్ను చంపకు. వదిలేయ్!"

ప్రళయకాల రుద్రుడిలా ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ అన్నాను "ఆ రోజు సృజన కూడా ఇలాగే అడి గింది కదూ! నువ్వొదిలి పెట్టావా? నిన్ను మామూలుగా చంపను. చిత్రహింసలు పెట్టి మరీ చంపుతాను. ఏం జూసు కుని ఆడవాళ్ళ మానాల్ని కొల్లగొడుతూ మురిసిపోతు న్నావో....ముందు అందుకు పనికిరానివాడిగా చేస్తాను" గాలిని చీల్చుకుంటూ విసురుగా వెళ్ళింది కత్తి.

అంతే—గిల గిలా తన్నుకుంటూ అరుస్తున్నాడు భూషణం.

"ఇప్పుడు కూడా ఓ మగాడు ఆడదాన్ని ఏం చేస్తాడో అది చేయగలవట్రా బ్రాడ్షర్?...." కసిగా అడిగాను.

నా ప్రశ్నకు సమాధానం చెప్పే స్థితిలోలేదు భూషణం. కారుతోన్న రక్తాన్ని చూసుకుంటూ బాధతో అరుస్తు న్నాడు.

అయినా నాకేమీ జాలి అన్పించలేదు. "నిన్నిలా వదిలి పెట్టినా నీకీ శిక్ష చాలదు. నీలాంటి చీడపురుగుల్ని బ్రతక నీయటం కూడా మహా పాపం—ఆఖరుసారి నీ ఇష్ట దైవాన్ని ప్రార్థించుకో. ఈ రోజుతో నీ ఛాప్టర్ క్లోజ్" అంటూనే మరో పోటు పొడిచాను. రక్తం ఫౌంటెన్‌లా ముఖం మీదకు చిమ్మింది.

వాడిన మల్లెలా తిరిగొచ్చిన సృజన....కాలిపోయి

భయంకరంగా తయారయిన సృజన ...సృజన అలా కావ టాన్కి కారకుడు ఈ కిరాతకుడన్న విషయం నా మన సులో రొద పెడుతుంటే పొడిచి....పొడిచి చంపాను వాడ్ని. బీభత్సంగా, భయంకరంగా .. రక్తంతో తడిసి పోయిన భూషణం శరీరం మీద నుండి నడుచుకుంటూ పోలీస్‌స్టేషన్ కొచ్చి సరెండరై పోయాను. అదిరా నా కధ. ఇప్పటికయినా నేను హత్య చేశానంటే నమ్ముతావా!"

ఓ నిముషం వరకూ శ్రీహరి కధ విన్న షాక్ నుండి కోలుకోలేకపోయాను. మగాడిగా పుట్టిన ఏ వ్యక్తికీ అంతటి మానసిక క్షోభ ఎదురుకాకూడ దనిపించింది.

"జడ్జిమేంట్ ఎప్పుడు?" మెల్లగా అడిగాను.

"రేపే."

"నీకేం భయం లేదురా హరీ! మంచి లాయర్‌ను చూసి నిన్ను ..." వాడికి ధైర్యం చెప్పాలనుకుంటున్న నా మాటలను మధ్యలోనే అడ్డుకుంటూ అన్నాడు—

"నాకు ప్రోమిస్ చేసిన విషయం మర్చిపోయావట్రా! నా ప్రాణం పోతుందని నాకేం భయం లేదురా! నేనూ అందుకోసమే చూస్తున్నాను. రేపు కోర్టులో వాదోప వాదాలు జరిగితే సృజన విషయం బయట కొస్తుంది. పతితగా, చెడిన ఆడదిగా ఈ సంఘానికి తెలియజేసి సృజన పేరు పాడుచేయలేనురా, ఈ రహస్యగాధ మని ద్దరి మధ్య సమాధి కావాలి. అంతే—నన్ను రక్షించాలని ప్రయత్నిస్తే ప్రాణాలతో కనపడను గుర్తుంచుకో."

ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా వాడి వయిపే చూస్తూండిపోయాను.

వాడు నా చేతులు ముద్దు పెట్టుకుంటూ అన్నాడు—

"విజయ్! వచ్చే జన్మంటూ వుంటే మరలా నీ స్నేహం కోసం. సృజన కోసమే పుడతానురా!"

"హరీ!" అంటూ వాడి నోరు మూశాను.

"నా దొక్కటే బాధరా! వృద్ధాప్యంలో తల్లి దండ్రులకు తోడుగా నిలవాల్సిన నేను చీకటితో చెలిమి చేస్తాననుకోలేదు. నా తర్వాత నువ్వే వాళ్ళకు కొడుకు లేని లోటు తీర్చాలిరా!"

"హరీ.... హరీ!.... ఎందుకురా అలా పిచ్చిగా మాట్లాడుతావు. నీవు మరలా ఈ చీకటి నుండి బయట పడి వెలుగు చూస్తావన్న నమ్మకం నాకుందిరా?"

"నేను చంపింది ఎం. పి. రాజశేఖరంగారి కొడుకునిరా! తన కొడుకు ఎంత మంది కన్నె జీవితాలను నాశనం చేస్తున్నా పట్టించుకోని ఆయన తన కొడుక్కి ఘోర అన్యాయం జరిగిందని గగ్గోలు పెడుతున్నాడు. తన హోదా, పలుకుబడి వుపయోగించి అయినా నాకు ఉరిశిక్ష పడేట్లు చేయించొచ్చు. మరలా నీతో మాట్లాడే అవకాశం వుంటుందో లేదోనని చెపుతున్నాను. నే నడిగిన ఈ కోరిక తీర్చుతానని చెప్పరా!" నా చేతులు నలిపేస్తూ, కన్నీళ్ళతో దీనంగా వేడుకుంటోన్న వాడ్ని చూస్తుంటే నా కళ్ళ నిండా నీరు నిండుకుంది.

"అలాగేరా" అన్నాను జీరపోయిన గొంతుకతో.

ఇందాక నన్నొదిలి వెళ్ళిన సెంట్రీ వచ్చాడు "సార్! టైమయిపోయింది ఇక వచ్చేయాలి."

"వస్తానురా హరీ!" వాడ్ని ఓసారి తనివితీరా చూసుకుని గబ గబా బయటికొచ్చేశాను, నా దుఃఖం వాడి ముందు కట్టలు త్రెంచుకోవటం ఇష్టం లేక. □



"మీకు యింకా ఆఫీస్ టైం కాలేదా?" అడిగింది కమలిని.

రాజశేఖరం సూటు సర్దుకున్నాడు. కమలిని అతడి మెడలో టై సర్ది అతడి ప్రక్క నిలబడింది.

రాజశేఖరం తయారయి అరగంట దాటుతోంది. రోజూ తొమ్మిదిన్నర అయితే బయల్దేరి వెళ్ళిపోయేవాడు యీ రోజు యింకా తయారు కాలేదు.

రాజశేఖరం వాచీ చూసుకున్నాడు. పదీ అయిదయింది. టెలిఫోన్ యీపాటికి మ్రోగవలసిందే! టేబుల్ మీద ఎర్రటి నెత్తుటి ముద్దలాగా కనిపిస్తోంది పెట్టె.

రాజశేఖరం సోఫాలో కూర్చున్నాడు. మెత్తటి సోఫా ముళ్ళ పాన్పులాగా అనిపిస్తోంది.

కమలిని అతడి మెడ చుట్టూ చేతులు వేసి "వుండిపోండి" అంది.

రాజశేఖరం కింది పెదిమ కొరుక్కున్నాడు. వంచకి!

ట్రింగ్! ట్రింగ్....ట్రింగ్...

హేండిల్ మీది నుండి లేచింది కమలిని. టెలిఫోన్ పెట్టె వయిపు కదలాలని చూచింది. రాజశేఖరం ఆమె చెయ్యి పట్టుకుని వారించాడు. ఒక్క వురుకులో ఆవేశంగా పెట్టెను సమీపించాడు.

కమలిని నిట్టూర్చి సోఫాలో కూలబడింది.

రాజశేఖరం రిసీవరెత్తాడు.

"హలో...." రిసీవర్‌లోంచి వినిపించింది.

"హలో...."

"...................."

అవతల "క్లిక్"మంది. రాజశేఖరం రిసీవర్‌లోకి ఆశ్చర్యంగా చూశాడు.

"ఎవరండి ఫోన్ చేసింది?" అడిగింది కమలిని.

"ఏమో....అవతల ఫోన్ పెట్టేశారు."

"ఫోన్ పెట్టేశారా? రాంగ్ నంబరేమో!"

"రాంగ్ నంబర్ కాదు. మొన్న ఉదయం నీవు బాత్

రూంలో వున్నావు. ఫోన్ మోగింది. అందుకున్నాను. 'హలో....హలో' అని రెండుసార్లు విడివిడిగా అని ఫోన్ పెట్టేశారు."

"అప్పుడప్పుడూ యిలాగే రాంగ్ నంబర్ డయల్ అవుతోంది."

"కమలినీ! రాంగ్‌నంబర్ కాదంటున్నాను కదా! ఎవరో కావాలని ఫోన్ చేస్తున్నారు. తనకు కావలసినగొంతు వినిపించకపోతే రిసీవర్ పెట్టేస్తున్నారు."

"ఎవరో కావాలనా? విచిత్రం!"

"కాకపోతే ఏమిటిది" అవతలకు డయల్ టోన్ వెళుతోంది. లైన్ స్పష్టంగా వుంది. పోయిన వారం యిలా విన్నాను. రాంగ్ నంబరనుకున్నాను. మొన్న ఉదయం మరల అదే గొంతు! ఈ రోజు...."

"ఎక్స్ఛేంజ్‌కి ఫోన్ చేయండి. ఎవరో తెలుస్తుంది కదా!"

"తెలియదు కమలినీ! అవతలివాళ్ళు అంత తెలివి తక్కువవాళ్ళు కాదు. పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుండి చేస్తారు."

"ఎవరయి వుంటారు? మీ వుద్దేశ్యం ఏమిటి?"

"కమలినీ! నేను చేతల మనిషిని. మాటల మనిషిని కాదు. అతడిని పట్టుకుంటాను, ఏ రకంగా ఎవరికి బుద్ధి చెప్పాలో నాకు తెలుసు. ఈ రోజు యిలా కాచుకూర్చున్నది నిర్ధారణ చేసుకోవడానికే."

"ఏమిటండీ మీరనేది?"

"తర్వాత చెబుతాను. ఇప్పుడేమీ అడగక!" రాజశేఖరం విసురుగా రిసీవర్‌ని క్రెడిల్ చేశాడు. పెద్ద పెద్ద అంగ లేసుకుంటూ గదిదాటి మెట్లుదిగాడు. పోర్టికోలో డ్రయివర్

మెట్లమీద కూర్చున్నాడు. పనిపిల్లతో పరాచికాలాడు తున్నాడు.

అయ్యగారిని చూడగానే చటుక్కున లేచి నిలబడ్డాడు. పనిపిల్ల తోటలోకి పారిపోయింది. డ్రయివర్ తలుపు తెరచి పట్టుకున్నాడు.

రాజశేఖరం త్వరగా సీటులో కూలబడి, "పోనియ్" అన్నాడు.

అంబాసిడర్ క్షణంలో గేటు దాటింది.

"రౌండ్ పార్కు దగ్గర నీలం రంగు డాబా. బాబ్జీ యింటికి పోనియ్" అన్నాడు రాజశేఖరం.

డాబాగార్డెన్స్ మీద నుండి అంబాసిడర్ రౌండ్‌పార్క్ చేరింది. రాజశేఖరం కారు దిగి బాబ్జీ యింట్లోకి వెళ్ళాడు. ఇరవయి నిమిషాల తర్వాత తిరిగి వచ్చి కారులో కూర్చు న్నాడు. కారు తిరిగి బయలుదేరింది.

కమలినీ ఎంటర్ ప్రయిజెస్ ముందాగింది. రాజశేఖరం ఆఫీసులో ప్రవేశించాడు. ఉద్యోగులు బాతాఖానీ ఆపి పనిలో పడ్డారు. గాజు అద్దాల గదిలో ప్రవేశించాడు. ఫ్యాన్ లోపలికి వచ్చి ఎయిర్ కండీషనర్ ఆన్ చేశాడు.

వాతావరణం చల్లబడుతోంది. రాజశేఖరం కుర్చీలో వెనక్కి వాలాడు. టై వదులు చేసుకున్నాడు. స్టెనోని పిలిచాడు. డిక్టేషన్ యిచ్చాడు. మేనేజర్‌ని పిలిచాడు. సూచన లిచ్చాడు. ఎవరెవరినో పిలిచి ఏవేవో ఆదేశా లిచ్చాడు.

ఈ పనులన్నీ చేస్తూనే వున్నాడు కాని అతడి చూపు టెలిఫోన్ మీదనే లగ్నమై వుంది. బాబ్జీ యింట్లోంచి బయలుదేరి గంట అయి వుంటుంది. తన అనుమానం నిజం అయితే యీపాటికి ఫోన్ రావాలి.

రాజశేఖరం అసహనంగా కదిలాడు. స్టెనోను మరల పిలిచాడు.

స్టెనో నవ్వుతూ వచ్చి కూర్చుంది.

"మిస్ లిల్లీ! మీతో రెండు మాటలు మాట్లాడాలి!"

లిల్లీ ప్రసన్నంగా చూచింది. "మాట్లాడండి బాస్!" అంది.

"ఆఫీసు వ్యవహారం కాదు. ఇంటి వ్యవహారం. పూర్తిగా నా వ్యక్తిగతం!"

లిల్లీ తలూపింది.

"మన యింటికి టెలిఫోన్ కాల్ వస్తుంది. లైన్ స్పష్టంగా వుంది. అవతలివాళ్ళు హలో అంటారు. మనం పలికాం. అవతల ఫోన్ పెట్టేశారు. దాని అర్థం ఏమిటి?"

లిల్లీ చాలా తక్కువ క్షణాల్లో ఆలోచించి, "అవతలి వాళ్ళకు మనం ఫోన్ అందుకోవడం యిష్టం లేకపోవచ్చు బాస్!" అంది.

"గుడ్. అవతల మాట్లాడేది మగ. యివతల మాట్లాడ బోయిన వారు కూడా మగ! అవతలి మగ ఫోన్ పెట్టేశా రంటే...."

"ఇవతలి మగవాడి తాలూకా ఆడదానికి ఫోన్ వుద్దేశించి వుండాలి బాస్!"

"మిస్ లిల్లీ! చాలా బాగా చెప్పావు. నీకు పార్టీ యిస్తాను?"

"థాంక్యూ బాస్?"

"నీకు అభ్యంతరం లేకపోతే సిద్ధంగా వుండు. సాయంత్రం డిన్నర్ చేసి పిక్చర్‌కి వెళ్దాం."

"ఎప్పుడూ కాదు బాస్! థాంక్యూ సర్!"

రాజశేఖరం పెదిమలు వొణికాయి. లిల్లీ తనతో అంత సులువుగా రావడానికి ఒప్పుకుంటుందనుకోలేదు.

టెలిఫోన్ గణ గణ లాడింది. రాజశేఖరం చురుకుగా అందుకున్నాడు

"రాజ్ .. స్పీకింగ్....అన్నాడు.

"రాజూ! నేను బాబ్జీని."

"బాబ్జీ చెప్పు...." అని లిల్లీ వయిపు చూచి, రిసీవర్ చేతితో మూసి, "వెళ్ళిరా" అన్నాడు.

లిల్లీ ఒయ్యారం వొంపుతూ వెళ్ళి తలుపు మూసింది.

"నీ అనుమానమే నిజమయింది. ఆమె బయట ఎవ రినో కలియడానికి వెళ్ళింది. మొదట ఫోన్ చేసింది. తరు వాత బయలుదేరింది. ఆమెను వెంబడిస్తున్నాను. తరువాత మరల ఫోన్ చేస్తాను."

"ఆమె చక్కగా ముస్తాబయింది కదూ!" రాజశేఖరం పళ్ళు పట పట లాడించాడు.

"అహాఁ; సినీతార లాగా!"

"జాగ్రత్త! అనుమానం రాకుండా వెంబడించు."

"నాకు తెలయదా రాజూ! డబ్బు సాయంకాలానికి సర్దు బాటు చెయ్యి. నా వ్యాపారంలో అరువుబేరం వుండదు."

"అలాగే. అరువుబేరం నాకూ నచ్చదు. సాయంకాలం విక్టరీ థియేటర్ వద్ద వుండు ఆరు గంటలకు వస్తాను."

"రైట్; ఆమె హోటల్‌లోకి వెళుతూంది. వెంబడిస్తు న్నాను" అవతల క్లిక్ మంది.

రాజశేఖరం రిసీవర్ పెట్టేసి కుర్చీలో వెనక్కివాలాడు. అతడికి మనసు దహించుకుపోతోంది. కమలిని ఎంత నాటక మాడుతోంది. తమ పెళ్ళయి నాలుగేళ్ళయింది. తనది ఆలస్య వివాహం. వర్తకంలో పడి ఆస్తులను సంరక్షించు

కోపడంలో పడి వివాహాన్ని నిర్లక్ష్యం చేశాడదు తను.

కమలిని తనకు ఈడూ జోడూ అనుకున్నాడు. ప్రేమ్ క్రియేషన్స్ యింజనీర్ల వద్ద ప్రైవేటుగా పని చేస్తూ తన కంట పడింది. తాను యింతకాలంగా నిరీక్షించింది ఆమె కోసమే ననిపించింది. బ్రహ్మచర్యానికి స్వస్తి చెప్పి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. కమలిని మనస్సులో ఎవరో ప్రవేశించారు. అసలా వూహే దుర్భరంగా వుంది. అందుకే యిప్పుడు రాజశేఖరం యాక్షన్‌లో దిగాడు.

మధ్యాహ్నం రెండు గంటలకు బొబ్జీ మరల ఫోన్ చేశాడు.

"ఏమిటి విశేషం? ఆమె ఎవరిని కలుసుకుంది?" అడిగాడు రాజశేఖరం.

"కమలిని చాలసేపు వెయిట్ చేసింది. కౌంటర్‌కి ఎదురుగా కూర్చుంది. సవేరా హోటల్ యజమాని స్వయంగా దగ్గరుండి ఆమెకు కావలసినవి సర్వ్ చేయించాడు."

"ఎవరు? నాగేశ్వర్రావేనా?"

"అవును. అతడే రాజూ! రెండు మూడు కుశల ప్రశ్నలు వేసి కౌంటర్‌లో కూర్చున్నాడు"

"నాగేశ్వర్రావు మనకు మంచి స్నేహితుడు. మేమిద్దరమూ ఎప్పుడు సవేరాకు వెళ్ళినా అతడే స్వయంగా మమ్మల్ని రిసీవ్ చేసుకుంటాడు తరువాత...."

"జగన్ తెలుసు కదా! ఇంజనీర్?"

"తెలుసు. ప్రేమ్ క్రియేషన్స్ యింజనీర్లలో ఒకడు. రెండోవాడు ప్రేమ్"

"కమలిని యింతకు ముందు అక్కడే కదా ప్రైవేటుగా పని చేసింది?"

"అవును. పెళ్ళి కాకముందు."

"జగన్‌కి తన ప్రక్క కుర్చీ చూపించింది. ఇద్దరూ కబుర్లలో పడ్డారు. రెండు బల్లలకు అవతల పేపర్ అడ్డం పెట్టుకు కూర్చున్నాను. నాకు వాళ్ళ సంభాషణ వినిపించ లేదు."

"గుస గుసలాడుకున్నారా?"

"అవును రాజూ!"

"తరువాత?"

జగన్ ముందు వెళ్ళిపోయాడు. కమలిని వెనుక తలుపు వయివు వెళ్ళింది. నాగేశ్వరరావు ఆమెను వెంబడించి టాక్సీ ఎక్కించి తిరిగి కౌంటర్‌లో కూర్చున్నాడు.

"పాపం, నాగేశ్వరరావుకు యీ వంచకి సంగతి తెలియదు. అందుకే యింకా అంత గౌరవం చూపిస్తున్నాడు."

"నాకూ అలాగే అనిపించింది. కమలిని యింటికి బయలుదేరింది."

"గుడ్. నువ్వు సాయంకాలం థియేటర్ దగ్గర వుండు. చెక్ తీసుకు వస్తాను."

"రేపూ వెంబడించాలా?"

"ఆ సంగతి రేపు చెబుతాను."

"త్వరగా చెప్పకపోతే రేపు మరో పార్టీకి బుక్ అయి పోతాను."

"నీకు డబ్బు ముఖ్యం. అందరికంటె ఎక్కువ చెల్లిస్తాను" టెలిఫోన్ బటన్ నొక్కాడు రాజశేఖరం. లైన్ తెగిపోయింది.

రాజశేఖరం డయల్ చేయసాగాడు.

2

"జగన్‌ని మాట్లాడుతున్నాను. ప్రేమ్ క్రియేషన్స్ నుండి."

"హలో జగన్‌గారూ! నేను రాజశేఖరాన్ని మాట్లాడుతున్నాను."

"రాజశేఖరమా! యెవరు? కమలినీ ఎంటర్‌ప్రైజెస్ కాదుకదా?"

"గుడ్....మీ జ్ఞాపకశక్తి గొప్పది జగన్‌గారూ!"

"థాంక్స్! పనిమీద పిలిచారా?"

"అవును. నాకు చంద్రగిరి గుట్టకింద పాతిక ఎకరాల స్థలం వుంది. గెస్ట్‌హౌస్ కట్టించాలని వుంది. ఆ విషయంలో మీ సలహా సహకారాలు కావాలి."

"థాంక్యూ, చంద్రగిరి గుట్టవద్దనా? అదంతా రాతి ప్రదేశం నిర్మాణం ఖర్చు ఎక్కువవుతుందనుకుంటాను."

"అంచెలంచెలుగా కట్టించాలి. రాయి వస్తుంది కదా! అది గోడలకు పనికి వస్తుంది."

"అవును. పెద్దపెద్ద బండరాళ్ళున్నాయి. నాలుగేళ్ళ క్రితం అదే స్థలం మీకంటె ముందు మాకు బేరానికి వచ్చింది. తీసుకోవడానికి ప్రేమ్ ఒప్పుకోలేదు."

"అలాగా! మీరు యెప్పుడు వస్తారు? స్థలం చూడవచ్చు."

"నాకు తెలియని స్థలం కాదుకదా! ఈ రోజు నాకు చాల బిజీగా వుంది."

రాజశేఖరం పళ్ళు పటపటలాడించాడు. బిజీగావున్న జగన్ ఇప్పుడే ప్రియురాలిని కలిపి వచ్చాడు.

"రేపు ఉదయం."

"ఎస్. తొమ్మిది గంటలకు మీరు మా ఆఫీసుకురండి."

"జీపులో వస్తాను. స్థలం చూశాక మిమ్మల్ని తిరిగి ఆఫీసులో వదులుతాను. సరేనా!"

"సరే!"

"థాంక్యూ!" రాజశేఖరం రిసీవర్ పెట్టేశాడు.

సాయంకాలం లిల్లీతో కలసి అంబాసిడర్‌లో బయల్దే రాడు. డ్రయివర్ విక్టరీ థియేటర్ ముందు కారాపాడు. బాబ్జీ అప్పటికే కాచుకున్నాడు. అతడికి చెక్కు వున్న కవర్ అందించాడు రాజశేఖరం. బాబ్జీ వెళ్ళిపోయాడు.

డ్రయివర్‌ను పంపేసి లిల్లీతో కలసి సినిమాకు వెళ్ళాడు రాజశేఖరం. ఆ రాత్రి కమలినితో ఎలా ప్రవర్తించాలో రిహార్సల్ వేసుకోసాగాడు.

లిల్లీ అతడి చెయ్యి నొక్కింది.

"రాత్రికి మా యింట్లో డిన్నర్!" అంది లిల్లీ.

3

"రాత్రంతా మీకోసం ఎదురుచూస్తూనే వున్నాను" అంది కమలిని.

రాజశేఖరం ఉదయాన్నే అంబాసిడర్‌లో యింటికి వచ్చాడు. లిల్లీ అతడిని ఉదయం వరకూ వదలలేదు. రాత్రంతా యిద్దరూ చాలారకాల బాసలు చేసుకున్నారు.

రాజశేఖరం ఆమెకో కొత్త వరంలాగా, ఆమె అతగాడికో శృంగార శిల్పంలాగా ఒకరికొకరు పరిణామం చెందారు.

అందుకే సొంత యింటికి రావడం ఒక ముళ్ళకంచెను దాటినట్టు అనిపిస్తోంది రాజశేఖరానికి. ప్రపంచంలో వున్న వంచన అంతా కమలిని ఆకారం ధరించినట్టు అతడికి వెగటు కలుగుతోంది.

మెట్లమీదే ఎదురయింది కమిలిని.

ఆమెకేదో సమాధానం చెప్పి లోపలకు నడిచాడు రాజశేఖరం. కమలిని అతడిని వెంబడించింది.

"రాత్రంతా మీకు నిద్రలేనట్టుంది. టిఫిన్ తిని త్వరగా

నిద్రపొండి" అంది.

"నీకు నామీద ఎంత ప్రేమ?" కసిగా అన్నాడు రాజశేఖరం.

కమలిని నిర్ఘాంతపోయింది.

"నీ నటన ఆపు. నీ సంగతి నాకు తెలిసింది" అరిచాడు రాజశేఖరం.

ఆమె చప్పున గది తలుపు మూసింది. "ఏమండీ? పనివాళ్ళు వింటారు. నెమ్మదిగా మాట్లాడండి!" అంది.

"ఏం మాట్లాడమంటావు? జగన్ గురించా?"

"జగన్? జగన్ ఏమిటి?"

"నీ వేషం నాకు తెలియదనుకొనక!" చకచక సూటు విప్పి మరో సూటు తొడిగాడు రాజశేఖరం.

"మీరు తొందరపడుతున్నారు. ఒక్క వారం రోజు లాగండి నా నిర్ణయం నేను చెబుతాను"

"ఏడిచావ్! నీ నిర్ణయం చెప్పేవరకూ ఆగడానికి నేను గాజులు తొడుక్కున్నాననుకున్నావా? చేతలలో ఏం చెయ్యాలో నాకు బాగా తెలుసు."

"నా మనసు అర్థం చేసుకోండి. ప్లీజ్....నా మనసు మారుతోంది. అది చెప్పడానికే ఒక వారం గడువు యివ్వండి!"

మనసు మారుతోందా? ఎందుకు? పూర్వపు జీవితంలో జగన్ అంతగా నీ జీవితంలో పెనవేసుకుపోయాడా?"

"వూరుకోండి! జగన్‌కీ నాకూ ఏమిటి సంబంధం?"

"సవేరా హోటల్‌లో జగన్‌తో నిన్న మధ్యాహ్నం నువు మాట్లాడావా?"

"మాట్లాడాను."

"దట్సాల్. నాకు ఫోన్ చేసి అంతలోనే ఫోన్ పెట్టేసిన

వ్యక్తి ఎవరో తెలుసుకున్నాను.”

“ఎవరు?” ఆమె ముఖం పాలిపోయింది.

“మరో గంటలో అతడితో మాట్లాడబోతున్నాను.”

“ఆ! సవేరా హోటల్‌కి వెళ్ళబోతున్నారా?”

“ఎందుకు? అతడినే నావద్దకు రప్పించుకుంటాను.”

“ఏమండీ! ప్లీజ్....ఒక్కవారం ఆగండి! శాంతి యుతంగా మనం సమస్యను పరిష్కరించుకోవచ్చును.”

“ఏమిటా పరిష్కారం?”

“విడాకులు!” తలదించుకుంది కమలిని.

“విడాకులా? నీకెంత ధైర్యం?”

“ప్లీజ్....కారణం తర్వాత చెబుతాను.”

రాజశేఖరం విసురుగా తలుపువద్దకు నడిచాడు. తలుపు తెరవబోయాడు.

“ప్లీజ్....సవేరాకు వెళ్ళకండి!”

“అలాగేలే!” రాజశేఖరం తలుపుతెరచి మెట్లు దిగి వెళ్ళిపోయాడు. డ్రయివర్ ఎదురు వచ్చాడు. సైగచేసి గారేజిలోంచి జీపు తీశాడు.

డ్రయివర్ అతడి సైగ ప్రకారం కారు తుడవడం ప్రారంభించాడు. రాజశేఖరం జీపు డ్రయివ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు ప్రేమ్ క్రియేషన్స్ వద్ద జగన్ అతడికోసం కాచుకున్నాడు.

“నమస్తే!” అన్నాడు జగన్.

రాజశేఖరం ప్రతి నమస్కారం చేశాడు.

“రండి. స్థలం చూచి వద్దాం” అన్నాడు రాజశేఖరం.

“ప్రేమ్‌ని కూడా తీసుకువెళ్దాం ”

“అక్కర్లేదు. ముందు మనం యిద్దరమూ చూశాక, ఆయన సహకారం కూడా కావాలి!”

"జగన్ తలూపి జీపులో కూర్చున్నాడు. జీపు కదిలింది. దూరంగా చంద్రగిరి గుట్ట కనిపిస్తోంది. గుట్ట రాను రాను దగ్గరవుతోంది. రోడ్డు దిగింది జీపు. గుట్టమీదికి పరుగెత్తుతోంది. ఏటవాలుగా ఎక్కుతోంది జీపు.

గాలి రంయిన వీస్తోంది జీపు రాళ్ళను ఎక్కుతోంది. మాటి మాటికీ కుదుపులిస్తోంది. ఆకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

"గుట్టమీదకు ఎందుకు?" అడిగాడు జగన్

"పైనుండి ఒకసారి చూచి...." దూరంగా రైఫిలు మ్రోగింది. రాజశేఖరం వులిక్కిపడ్డాడు. రైఫిలు ఎక్కడ మ్రోగింది? ఈ సమీపంలో ఎవరయినా వున్నారా? తన పథకం అమలు జరగదా?

జగన్ యింతకంటె సులువుగా దొరకడు.

సమతల ప్రదేశం వచ్చింది. కిందవున్న చెట్లు గుట్టమీద నుండి చూస్తే ఆకుపచ్చటి జుత్తు విరగబోసుకున్న కుక్కగొడుగుల్లాగా వున్నాయి. ఎర్రటి పీఠభూమీ, బండరాళ్ళూ అక్కడక్కడ మొలిచిన చీపురు పుళ్ళూ, బ్రహ్మజెముడు డొంకలూ అన్నీ కలిసిపోయి.... కళ్ళు తిరుగుతున్నాయి.

జీపు యింకో యాభై అడుగులు ముందుకు వెళ్తే అగాధం! అక్కడనుండి పడితే ప్రాణి అయినా, వస్తువు అయినా ఆనవాలు దొరకడం అసంభవం.

ఆమాటే అన్నాడు జగన్.

రాజశేఖరం నవ్వి మరో ముప్ఫయి అడుగులు తీసుకువెళ్ళి జీపు ఆపాడు.

"భయంకరంగా వుంది. ఎప్పుడూ యిలా రాలేదు!" అన్నాడు జగన్.

రాజశేఖరం పెదిమలు వంకర తిరిగాయి. "కరెక్ట్....

నేనుగూడా రావాలనుకోలేదు. అన్నట్టు జగన్‌గారూ! కమలినితో కూడా కలపి యిటు రాలేదా మీరు?"

"క....మ....లి ...ని....ఆమెతో యెందుకు రావడం.. అదే కలసి ....రావడం?"

"మీరు తడబడుతున్నారు."

"అవును. మీరు నేనూహించని ప్రస్తావన తెచ్చారు."

"మీరు వూహించుకోగలననచ్చు, ఈపాటికి!"

"ఏమిటి మీరనేది?"

"కమలినితో మీ వ్యవహారం యెంతవరకూ ఫలిస్తోందో తెలుసుకోవాలని!"

"నాన్సెన్స్....కమలిని లాంటి మంచి గృహిణితో నాకు వ్యవహారం ఏమిటి?"

"మంచి గృహిణి అని పైవాడు అనుకోడం కాదు. కట్టుకున్న మొగుడు అనుకోవాలి?"

"అంటే?"

"ఆమె నాకు విడాకు లివ్వబోతోంది."

"అబ్సర్డ్....నమ్మలేను."

"ఏం? మీరు విడాకులు అక్కర్లేదన్నారా?"

"నేను వద్దనడం ఏమిటి? మధ్యలో నేనెవడిని?"

"మీరు ఆమెను సవేరా హోటల్‌లో నిన్న కలుసుకున్నారు కదా!"

"అవును. ఆమె హోటల్‌లో కూర్చుంది. మా దగ్గర ఆమె యిదివరకు ఉద్యోగిని. అది మీకూ తెలుసు. ఆమెతో మాట్లాడటం తప్పా?"

"ఏం మాట్లాడారు?"

"ఆమె యెవరికోసమో యెదురు చూస్తోంది. నాకు గూడా ఒకరిని అక్కడ కలుసుకోవలసి వుంది. ఇద్దరమూ

కబుర్లలో పడ్డాం."

"కబుర్లా? గుసగుసలా?"

"హోటల్లో మాట్లాడుకుంటున్నాం కదా! బిగ్గరగా మాట్లాడతామా? సభ్యతగా వుంటుందా?"

"పరాయివాడి పెళ్ళాంతో కులకాలని చూస్తున్నావు. నువు సభ్యతగురించి మాట్లాడుతున్నావు." రాజశేఖరం విసురుగా అతడి కాలర్ పట్టుకున్నాడు. జగన్ విడిపించుకో బోయే లోపుగా మొహంమిద గుద్దాడు.

జగన్ గిర్రున తిరిగి వెనక్కి పడ్డాడు. నేల గరుకుగా వుంది. బండరాళ్ళు నరికి పోగులు పెట్టినట్టుగా వుంది చంద్రగిరి గుట్ట. జగన్ చేతులమీదుగా లేవబోయాడు.

"ఎన్నిసార్లు కలిశావురా?" రాజశేఖరం విసురుగా అత డిని డొక్కలో తన్నాడు. జగన్ ఉండలు చుట్టుకు పోయాడు.

రాజశేఖరం మరల కాలెత్తాడు. జగన్ అతడి కాలు పట్టుకుని మెలిక తిప్పాడు. రాజశేఖరం వెల్లకితల పడ్డాడు. జగన్ బాధగా మూలుగుతూనే లేచి నిలబడ్డాడు. రాజ శేఖరం మీదపడి అందిన చోటనల్లా కొట్టసాగాడు.

రాజశేఖర పెదిమ చిట్లింది. నోటికి వుప్పగా తగిలింది. గుండెలమీదా, మొహంమీదా పిడిగుద్దులు పడుతున్నాయి.

రైఫిలు ప్రేలింది. చంద్రగిరి గుట్టకు తగిలింది. తూటా వెనక్కి వెళ్ళినట్టు చప్పుడయింది. రాజశేఖరం కాళ్ళు పైకెత్తి అతడిని మెడ వెనుకనుండి లంకె వేశాడు. వెనక్కి విరిచాడు. జగన్ వెల్లికితలా పడ్డాడు.

రాజశేఖరం ముడిచిపెట్టి కాళ్ళు విసిరాడు. ఆ దెబ్బకు జగన్ బంతిలాగా తుళ్ళాడు. సమతలం అంచు అతడు పడిన చోటికి మూడడుగులలో వుంది.

రాజశేఖరం హుషారుగా లేచాడు. కాళ్ళూ చేతులూ చెక్కుకుపోయాయి. తల బొప్పికట్టింది. అయినా చివరి సారిగా శక్తిని కూడగట్టుతున్నాడు. జగన్‌ని బలంగా తన్నాడు. జగన్ దొర్లి అంచులో పడ్డాడు. ప్రమాదాన్ని గుర్తించాడు.

జగన్ మొహంలోకి ప్రేతకళ వచ్చేసింది. చేతులు జోడించి నమస్కారం పెట్టాడు.

"రాజశేఖరం! నన్ను క్షమించు. నాకే పాపమూ తెలియదు, కమలిని అమాయకురాలు!" అన్నాడు జగన్.

"అమాయకురాలయితే విడాకుల ప్రసక్తి యెందుకు తెస్తుంది?" రాజశేఖరం మరల తన్నాడు.

జగన్ జారి గుట్టమీద నుండి పడబోయాడు. గుట్ట అంచు యెగుడుదిగుడుగా వుండి పట్టు దొరికింది. జగన్ అతి కష్టంమీద గాలిలో వ్రేలాడుతున్నాడు. చెక్కినట్టున్న రాళ్ళు అతడి చేతులను కోస్తున్నాయి. రాళ్ళ అంచులు నెత్తురు పులుముకుంటున్నాయి.

రాజశేఖరం కసిగా చూశాడు.

ఎక్కడినుండో రైఫిలు మరల మ్రోగింది. ఈసారి తూటా అతడి తలమీదనుండి దూసుకుపోయింది.

జగన్ చావుకేకలు పెడుతున్నాడు. మృత్యువు అతడి కళ్ళముందు వికటాట్టహాసం చేస్తోంది.

రాజశేఖరం దూరంగా చూశాడు. గుట్టకు రెండో భాగం పల్లంగా వుంది. అటునుండి వచ్చింది రైఫిలు ప్రేల్చిన తూటా. అటుప్రక్క యెవరున్నారు? రైఫిలు యిటువైపు యెందుకు ప్రేల్చారు?

రాజశేఖరం ఆలోచనలు కట్టిపెట్టాడు. త్వరగా జీపులో కూర్చున్నాడు. స్టార్ట్ చేశాడు. ముందుకు నడిపాడు.

దానికి తిన్నగానే జగన్ అంచుకు వ్రేలాడుతున్నాడు. అతడి బరువుకు అరచేతులు చాలవరకు తెగిపోయాయి.

రాజశేఖరం నడుస్తోన్న జీపులోంచి దూకేశాడు. రాళ్ళ మీదకు దూకేశాడు. జీపు విశ్వాసపాత్రమైన కుక్కలాగా ముందుకు నడుస్తోంది. జగన్‌మీదుగా అగాధంలోకి వొంగింది.

మరుక్షణంలో జగన్, జీపూ గాలిలో నిరాధారంగా ప్రయాణిస్తున్నారు.

4

కార్లూ, జీపులూ చంద్రగిరి గుట్టను చుట్టి వచ్చి ఆగాయి.

క్రిందనుండి సిమెంట్ చేసినట్టు రాతికట్టు పలకలు గుట్ట చుట్టూ తాపడమై వున్నాయి. కొండ నల్లగా నునుపుగా దోరగా కాల్చిన మేక శిరస్సులాగా వుంది.

క్రయిమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టరూ, అతడి సిబ్బందీ, రాజశేఖరం ఇతర ప్రముఖులూ వాహనాల్లోంచి బయటపడ్డారు.

రాతికట్టు పలకమీద అతడు బోర్లగిల పడివున్నాడు. శరీరం మొత్తగా విరగ్గొట్టి మరల యథావిధిగా పరచినట్టుగా వుంది. తల భాగం పగిలివుంది. నెత్తురూ మెదడూ కలిసి వింత రంగులో మడుగు కడుతోంది.

రాతికట్టు పలకకు దూరంగా విసిరివేసినట్టుగా జీపు వుంది. జీపు యింజన్‌లోంచి పొగలు వస్తున్నాయి. ముందు భాగం పూర్తిగా సొట్టపడిపోయి వుంది. టాప్ మొత్తం విరిగిపోయి చక్రాలపెట్టు దానిమీద ఆని వుంది.

"రాజశేఖరంగారూ! ఏం జరిగిందో చెప్పండి!" అన్నాడు క్రయిమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్.

రాజశేఖరం మెల్లగా గొంతు సవరించుకున్నాడు. "ఈ

క్రింది స్థలం నాదే ఇన్‌స్పెక్టర్‌గారూ! గెస్టుహవుస్ కట్టిద్దామని జగన్‌ని తీసుకువచ్చాను.

"పై నుండి ఈ స్థల మొకసారి చూడాలి?" అన్నాడు జగన్.

జీపులో యిద్దరమూ పైకి వెళ్ళాం. జీపు అతడు నడిపాడు. పైన చదునుగా వున్న ప్రాంతంతో జీపు ఆపాడు. ఇద్దరమూ అక్కడి నుండి యీ స్థలం చూశాం. గెస్టుహౌస్ ఎక్కడ కట్టాలో సూచించాడు జగన్. నాకూ అతడి సూచన నచ్చింది.

నేను స్టీరింగ్ పట్టుకోబోయాను. జగన్ తనే నడుపుతానని పట్టుపట్టాడు. నేను ప్రక్కన కూర్చున్నాను. జీపు రివర్స్ చేయడానికి కొంత అంచుకు వలయం తిప్పాలి. లేదా వెనక్కి నడిపి మెల్లిగా రివర్స్ చేయాలి. జగన్ ముందుకే నడిపాడు.

నేలంతా పగలగొట్టి పెట్టినట్టు రాళ్ళముక్కలు. జీపు చక్రాలు వాటిమధ్య పడి రివర్స్ చేయడం కష్టంగా వుంది. జగన్ తొందరపడ్డాడు. ఏం చేశాడో తెలియదు కాని జీపు తాగినవాడిలాగా గతుకుల రాళ్ళమీద దొర్లుతోంది. అగాధం వైపు పరుగెత్తుతోంది.

జగన్ తొందరపడిపోయాడు.

"దూకెయ్!" అని అరిచి అతడు అటు దూకబోయాడు. నేను అప్పటికే దూకేశాను. నేను దూకిన వైపుగా జీపు ఒరిగి ముందుకు దూసుకుపోయింది ..." రాజశేఖరం గొంతు పూడుకుపోయింది.

"జగన్ దూకేశాడనే అనుకున్నాను. అతడు డ్రయివింగ్ సీటులో యిరుక్కుపోయాడనుకోలేదు. నేను కళ్ళు తెరచి చూచేటప్పటికి జీపు పూర్తిగా గాలిలో వుంది. జగన్

కొండ అంచులో క్షణంపాటు కనిపించి మాయమయాడు.... పా....పా....త్మ....డిని....అతడిని పంపేసి నేను మిగిలి పోయాను...." అరచేతులలో మొహం కప్పుకున్నాడు రాజశేఖరం.

ఇన్‌స్పెక్టర్ తలూపి తన సిబ్బందికి సైగచేశాడు. సిబ్బంది శవం మీదా జీపు మీదా తాము నిర్వర్తించవలసిన విధి నిర్వహణలో పడ్డారు.

"పూర్తి వివరాలతో స్టేట్‌మెంట్ రాసియివ్వండి. నిపుణులచేత ఈ ప్రమాదం మీద నివేదిక యివ్వమని కోరతాం. మీరు నిర్దోషి అని తేలే రకూ నగరం విడిచి వెళ్ళగూడదు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

రాజశేఖరం విచారంగా తలూపాడు.

5

టెలిఫోన్ గణగణలాడింది. కమలిని రిసీవరందుకుంది. చటుక్కున ఆమె చేతిలోంచి రిసీవర్ యెవరో గుంజినట్ట యింది. కమలిని వులిక్కిపడింది. తలతిప్పి చూచింది.

రాజశేఖరం చిరిగిన దుస్తులతో, చెదరిన జుత్తుతో, అక్కడక్కడా రక్తం మరకలతో భయంకరంగా వున్నాడు.

"హలో...." అటునుండి వినిపిస్తోంది.

రాజశేఖరం రిసీవర్‌లోకి కోపంగా చూశాడు.

"హలో...."

"........"

అవతల 'క్లిక్' మంది.

"రాజశేఖరం కోపంతో పిచ్చెత్తిపోయాడు.

"జగన్‌గాడిని చంపేశాను. ఎలా ఫోన్‌చేశాడు?" అరిచా డతడు.

కమలిని భయంతో కొయ్యబారిపోయింది. ఒళ్ళంతా

చెమటలు క్రమ్మాయి. తలలోంచి చెమటలు పట్టాయి.

"జగన్‌ని చంపేశారా?"

"సీతో సవేరాలో మంతనాలాడిన పాపానికి!"

"ఆఁ!"

"అవును. చంద్రగిరి గుట్టమీద తుక్కు-తుక్కుగా తన్ని అగాధంలోకి తోసేశాను."

"ఆఁ! ఎంత పనిచేశావ్ దుర్మార్గుడా?"

"దుర్మార్గమా? నా పెళ్ళాంతో వాడికి గుసగుసలేమిటి?"

"జగన్ ఏ పాపమూ యెరుగడు. అన్యాయంగా అతడిని పొట్టన పెట్టుకున్నారు."

"పాపం! వాడికి ఏ పాపమూ తెలియదు. అమాయకుడు! వాడు కూడా అలాగే మొత్తుకున్నాడు."

"అతడన్నది నిజం!"

"ఏమిటి నిజం! నువ్వూ, జగన్ రహస్యంగా రోజూ సమావేశం కావడం నిజంకాదా? జగన్‌గాడితో కొత్త సంసారం పెట్టాలని నువు పథకం వేయడం నిజంకాదా? వాడిని నమ్ముకుని నాకు విడాకులు యివ్వడానికిగూడా సిద్ధ పడటం నిజంకాదా?"

"జగన్‌తోనా? మీకు యెవరుచెప్పారు? బాబ్జీయేనా?"

"........"

"బాబ్జీయే అయివుంటాడు. అతడే నిన్న నన్ను సవేరా వరకూ వెంటాడాడు. చివరకు మొహానికి పేపర్ అడ్డం పెట్టుకుని మూల బల్లవద్ద చేరాడు."

"........"

"వారంరోజులుగా నాగేశ్వరరావు నాకు ఫోన్ చేస్తున్నాడు."

"నాగే....శ్వ....ర....రావా?" గుటకవేశాడు రాజ

శేఖరం.

"అవును. నాగేశ్వరరావుతో యికమీదట నా జీవితం పంచుకోవాలనుకున్నాను."

"వాడితోనా? హోటల్ నడుపుకొంటున్నవాడితోనా?"

"ఏం, తప్పా? నీ దగ్గర స్టెనోగా పనిచేస్తోన్న లిల్లీని గురించి నువు నెల రోజులుగా కలవరిస్తున్నావు. నేను అప్పుడే చేదయిపోయానా? నా బతుకు నేను బతుకుతున్న దాన్ని తీసుకువచ్చి పెళ్ళి చేసుకున్నావు నీకంటె ముందు నాగేశ్వరరావును ప్రేమించాను. కాని నీతో నా జీవితం ముడిపడిపోయింది. నా ప్రేమ నీవైపు త్రిప్పుకున్నాను. నువు లిల్లీవైపు పరుగులు తీస్తున్నావు.

నేను నీకేం అన్యాయం చేశాను? జగన్‌ని చంపేశావు హంతకుడా! నాగేశ్వరరావు అని నీకు తెలిపివుంటే అతడినే పొట్టన పెట్టుకుందువు. ఇప్పుడే పోలీసులకు చెబుతాను. జగన్‌ని చంపింది నువ్వే! అని."

రాజశేఖరం తేరుకున్నాడు. పైశాచికంగా నవ్వాడు. తప్పుచేసినట్టు అతడికి తెలిపిపోయింది ఆ తప్పును వెనక్కి తిప్పుకోలేడు. కాని....

"కమలినీ! నేను ఈ హత్య చేశానంటే పోలీసులు నమ్మరు. యాక్సిడెంటుగా కేసు నమోదు చేయించి యిటు వచ్చాను. నాగేశ్వరరావుతో నువు....ఎలా....సుఖపడతావో....చూస్తాను...."

టెలిఫోన్ మ్రోగింది.

రాజశేఖరం అదే చేత్తో చురుకుగా రిసీవరందుకున్నాడు.

"ఇటీజ్ క్రైంబ్రాంచ్."

"చెప్పండి ఇన్‌స్పెక్టర్‌గారూ!"

"చంద్రగిరి గుట్టమీద మీకు రైఫిల్ కాల్పులు వినిపించాయా?"

"అవును సార్! వినిపించాయి."

"మిమ్మల్ని హత్యాప్రయత్నం నుండి వారించడానికి మీవైపు సైతం ఒక తూటా ప్రేల్చారట!"

"హత్యాప్రయత్నమా? ఏమిటిసార్? ఎవరుసార్?"

"చంద్రగిరి గుట్టమీద ఎన్ పి.సి. యూనిట్ ఒకటి రైఫిల్ షూటింగులో శిక్షణ పొందుతోంది. మీరూ జగన్ అక్కడ విచిత్రమైన పరిస్థితిలో వున్నట్టు వాళ్ళు బైనాక్యులర్స్ లోంచి చూశారు. మిమ్మల్ని అందుకోలేకా, మీ ప్రయత్నం ఆపాలని రైఫిలు మీవైపు ప్రేల్చారు. అయినా సరే మీ ప్రయత్నంలో మీరు విజయం పొందారు. బైది బై....స్టీరింగ్ వీల్‌మీద జగన్ వ్రేలిముద్రలు లేవు. మీ వ్రేలిముద్రలు మాత్రమే వున్నాయి...." ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో చెప్పుకుపోతున్నాడు.

రాజశేఖరం చేతిలోంచి రిసీవర్ జారిపడింది. □

అలవాటు!



సీరియల్

కాంచన శిఖరం

వాశిష్ట

(గతసంచిక తరువాయి)

"మీరు చెప్పింది నిజమే. రాత్రి ఇతన్ని పులి చంపింది. అయితే ఇక్కడకాదు. ఎక్కడో చంపి ఇక్కడకు ఈడ్చుకొచ్చింది" అంటూ దాదా వారికి పులి అడుగుజాడలు చూపించాడు. అక్కడక్కడా చచ్చిపోయిన మనిషి పంచె

తాలూకు గుడ్డ ముక్కలు ముళ్ళపొదలకు అంటుకుని వున్నాయి.

"ఎవరో పాపం?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఇక్కడికి దగ్గర్లోనే అక్కడక్కడా కొన్ని పల్లె లున్నాయి. అక్కడివాడై వుంటాడు" అన్నాడు జ్వాలా.

"మనిషిని చంపిన పులి శవాన్ని తన గుహకి తీసికెళ్ళి రోజూ కొంచెం కొంచెం తింటుందని అంటారే" అన్నాడు ఫణీంద్ర.

"దానికొక స్థావరం వుంటే అట్లాగే తీసికెళ్తుంది కాని అది ఎక్కడో దూరంగా వుంటే ఏం చేస్తుంది. ఇట్లాగే తిన్నంత తిని వదిలివేస్తుంది" అన్నాడు జ్వాలా.

"దాదా! పులి మళ్ళీ ఈ రాత్రికి వస్తుందంటావా?" అన్నాడు కృష్ణమూర్తి.

"వస్తుంది. అది రాత్రి మనల్ని పసిగట్టింది. మంట వెలుగుని చూసి అక్కడ మనుష్యులున్నారని తెలుసుకుంది. మనిషిని తినడానికి అలవాటుపడిన పులి ఎప్పుడూ మనిషినే తినాలని కోరుకుంటుందట" అన్నాడు జ్వాలా.

"అయితే మనం ఈ చోటు తొందరగా వదిలితే మంచిది" అన్నాడు కృష్ణమూర్తి.

"వదలక ఇక్కడే కూర్చుంటామా! చీకటి పడింది కాబట్టి ఆగాం అంతే" అన్నాడు ఫణీంద్ర.

ముగ్గురూ కాలకృత్యాలు తీర్చుకుని టెంట్ దగ్గరికి వెళ్ళారు.

అపర్ణ 'టీ' అందించింది.

"దాదా! ఈ అడవిలో మనిషి ఎక్కడ దొరికాడు ఆ పెద్దపులికి?" అంది అపర్ణ.

"అడవిలో దొరకడం కాదమ్మా! ఎక్కడో పల్లెలో

చంపి ఈడ్చుకొచ్చింది” అన్నాడు జ్వాలా.

“మీరు వచ్చారుగా. మేము స్నానంచేసి వస్తాం. రా! అపర్ణా!” అన్నాడు కిశోర్.

ఇద్దరూ సెలయేటి దగ్గరకు వెళ్ళారు.

12

“దాదా!....” అనే కేక అడవి మారు మ్రోగేలా వినిపించింది.

ఆ కేక పెట్టింది అపర్ణ.

ఆమె కేక విని జ్వాలా, అతని వెనుకే ఫణీంద్ర, కృష్ణమూర్తి పరుగుతీశారు సెలయేటి దగ్గరికి.

అపర్ణ తడిబట్టలతో ఒడ్డున నిల్చుని ఏడుస్తూ వుంది. కిశోర్ నీళ్ళల్లో కొట్టుకుంటున్నాడు.

“కిశోర్ ఏం జరిగింది?” గట్టిగా అరిచాడు జ్వాలా.

“కాళ్ళు.... కాళ్ళు ...” కిశోర్‌కి నోటివెంట మాటలు రావడంలేదు. గొంతువరకూ మునిగిపోయివున్నాడు. ఇంకా మునగకుండా చేతులతో కొట్టుకుంటూ అతికష్టం మీద ప్రయత్నిస్తున్నాడు.

“దాదా! కిశోర్‌ని రక్షించండి.....” ఏడుస్తూవుంది అపర్ణ.

ఫణీంద్ర నీటిలోకి దూకబోయాడు. జ్వాలా అతన్ని వారించాడు.

“మొసలి పట్టుకుందేమో! మనం లోపలికెళ్తే లాభం లేదు. త్వరగా టెంట్‌కెళ్ళి తాడు పట్టుకురండి” అన్నాడు దాదా.

కృష్ణమూర్తి మెరుపువేగంతో పరిగెత్తికెళ్ళి లావుపాటి కొబ్బరితాడు తెచ్చాడు. జ్వాలా దాన్ని నీటిలోకి విసిరేసి “కిశోర్ తాడు పట్టుకో” అన్నాడు.

అతికష్టంమీద కిశోర్ తాడు పట్టుకోగలిగాడు. నెమ్మదిగా అతన్ని ఒడ్డుకి లాగారు. అతనితోపాటు కాళ్ళకి చుట్టుకున్న పాము బైటికి వచ్చింది! ఆ పాము కొండచిలువలా చాలాలావు వుంది. దాదాపు పది అడుగులు పొడవు గూడా వుంది.

"అమ్మో! పాము" అని అరిచింది అపర్ణ.

"భయపడకు. ఇదేం చెయ్యదులే" అంటూ జ్వాలా చేతితో దాని మెడ దగ్గర పట్టుకుని నెమ్మదిగా లాగాడు. మెడదగ్గర పట్టుకోగానే అది భయంకరంగా నోరు తెరిచింది. కోరల్లాంటి పళ్ళు చూస్తుంటే భయం కలిగింది. కిశోర్ కాళ్ళబంధం వదిలిపోగానే 'హమ్మయ్య' అన్నాడు. కాళ్ళకి రక్తం కారుతూవుంది. పాము కొరికివుంటుంది. అపర్ణ గుడ్డతో రక్తం తుడుస్తూ "ఎంత గండం తప్పింది" అంది ఏడుపు ఆపుకుంటూ.

కిశోర్ నేలమీద పడిపోయి రొప్పుతున్నాడు.

"దాదా! పాముపళ్ళు కాల్లో దిగాయి. దాని విషప్రభావం చూపించదు గదా!" అన్నాడు కృష్ణమూర్తి.

"దానికి విషం వుండదు భాయ్! నీటిపాము" అన్నాడు జ్వాలా.

"నీళ్ళల్లో గూడా యింతలావు పాములుంటాయా దాదా! మా వూళ్ళో గూడా పంట కాలువల్లో నీటి పాముల్ని చూశాను. అవి చాలా చిన్నవి. ఇదేమో కొండచిలువలా వుంది" అన్నాడు ఫణీంద్ర.

"పాముల్లో ఎన్నో! వేల రకాలుంటాయి భాయ్! అందులో ఇదొకటి. ఇది నీళ్ళల్లోనే వుంటుంది. చేపల్ని, కప్పల్ని తింటూ వుంటుంది. ఇది సామాన్యంగా ఒడ్డుకి రాదు" అన్నాడు దాదా.

కొంచెం సేపటికి కిశోర్ తేరుకున్నాడు. నెమ్మదిగా లేచి నిల్చున్నాడు.

"నడవగలవా?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఊఁ" అన్నాడు. అపర్ణ అతని చేతిని భుజంమీద వేసుకుని నెమ్మదిగా నడిపించింది.

టెంటుకి వెళ్ళేసరికి మేఘనాధ్ రెడ్డి నిద్రలేచి వున్నాడు.

"అందరూ కలిసి ఎక్కడికి వెళ్ళారు?" అంటూనే కిశోర్ కాళ్ళకి వున్న నెత్తురు చూసి "అరె ఆ నెత్తురు ఏమిటి ఏం జరిగింది?" అన్నాడు కంగారుపడుతూ.

ఫణీంద్ర జరిగిందంతా చెప్పాడు,

కిశోర్ టెంట్‌లోకి వెళ్ళి పడుకున్నాడు పొడిబట్టలు కట్టుకుని. దాదా అతని కాళ్ళకి అయిన గాయాల్ని డెట్టాల్‌తో కడిగి, మందువేసి కట్టుకట్టాడు.

"అరేయ్! మూర్తీ ఆ పాము ఇంకా అక్కడే ఉందా?" అన్నాడు మేఘనాధ్.

"ఆఁ—ఒడ్డునే వుంది. చూస్తావా?" అన్నాడు కృష్ణమూర్తి.

"చూడ్డంకాదు. ఫొటో తీస్తాను" అంటూ మేఘనాధ్ కెమేరా పట్టుకొని సెలయేటి ఒడ్డుకి పరిగెత్తాడు. కాని వెంటనే తిరిగి వచ్చాడు.

"లేదురా! నీళ్ళలోకి వెళ్ళిపోయివుంటుంది" అన్నాడు నిరాశగా.

అపర్ణ వేడి వేడిగా ఉప్మా ఆకులో పెట్టి యిచ్చింది. మధ్యాహ్నం తినడానికి రొట్టెలు చేసింది.

పదిగంటలకు టెంట్ తీసేసి అన్నీ సర్దుకుని బయల్దేరారు. రెండు మైళ్ళు నడిచాక ఒక చిన్నపల్లె తగిలింది.

13

చుట్టూ కొండలమధ్య లోయలో వుంది పల్లె. లోయలో పంటపొలాలు పచ్చటి తివాచీల్లా కనిపిస్తున్నాయి. అన్నీ కలిపి ఏభై ఇళ్ళుగూడా లేవు.

"దాదా! ఈ పల్లె పేరేమిటి?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏదో వుంది మర్చిపోయాను" అన్నాడు జ్వాలా.

తుపాకీ చేతబట్టుకుని హుందాగా నడిచి వస్తున్న జ్వాలాని చూసి దూరంనుంచే రెండు చేతులూ జోడించి నమస్కారాలు చేస్తూ వచ్చారు నలుగురు పల్లెవాళ్ళు.

"అయ్యా! మీ కోసమే చూస్తున్నాం" అన్నారు.

వాళ్ళు హిందీలో మాట్లాడుతుంటే కొంచెం కొంచెం అర్థమౌతోంది.

"నా కోసం ఎదురుచూడ్డం ఏమిటి?" ఆశ్చర్యపోతూ అన్నాడు జ్వాలా.

"మీ కోసం కబురుపెట్టాం దొరా!" అన్నారు వాళ్ళు.

"ఈ వూరు పేరేమిటి?"

"వేదీ దొరా!"

"చూడు భాయ్! మేము మీ వూరికని ప్రత్యేకంగా రాలేదు. పైకి వెళ్తున్నాం. దారిలో మీరు కలిశారు. అంతే" అన్నాడు దాదా.

పల్లెవాళ్ళు నోళ్ళు తెరిచారు. అసలు సంగతి అప్పుడు చెప్పారు. ఒక పెద్దపులి ఆ ప్రాంతంలో మనుషుల్ని చంపడానికి అలవాటుపడింది. పట్టపగలే దారికాచి మీద పడుతోంది. దాన్ని చంపి రక్షణ కల్పించమని ఫారెస్ట్ వాళ్ళకీ, పోలీసులకు విజ్ఞాపన పంపుకున్నారు. కాని యింతవరకూ యెవరూ రాలేదు. తుపాకీ తీసుకుని వస్తుంటే పులిని చంపడానికి గవర్నమెంట్ వాళ్ళు పంపారని సంబరపడ్డారు

పాపం.

ఈ కథ చెప్తుంటే వూళ్లో వాళ్ళంతా అక్కడకు చేరు కున్నారు. ఆ పులి ఈ చుట్టుప్రక్కల పల్లెల్లో ఎంత మందిని చంపిందీ చెప్పుకొచ్చారు.

"మీరు చెప్పేది నిజమే. రాత్రిగూడా అది యెవర్నో చంపింది. శవం చూశాం" అన్నాడు జ్వాలా.

"అయ్యా! ఆ పులిని చంపి పుణ్యం కట్టుకోండి. గవర్న మెంటు వాళ్ళు పట్టించుకోవడంలేదు. ఇంకా అది ఎందర్ని చంపుతుందో!" అని వాళ్ళు ప్రతిమాల సాగారు.

జ్వాలా పని యిరుకున పడింది. అందరి వంకా చూశాడు.

"ఏం చేద్దాం?" అన్నాడు.

"నీ ఇష్టం దాదా!" అన్నాడు మేఘనాధ్.

జ్వాలా ఆలోచించి "సరే భాయ్! మీరు అంతగా అడుగుతుంటే కాదనలేకపోతున్నాను. మేము వుండడానికి ఏదైనా ఏర్పాటు చెయ్యండి" అన్నాడు.

"ఆ మాత్రం చెయ్యలేమా దొరా! పులిని చంపండి. నెత్తిన పెట్టుకుంటాం" అంటూ వాళ్ళు సామాన్లు బలవంతంగా లాక్కుని వూళ్ళోకి తీసికెళ్ళారు.

విశాలమైన ఇంట్లో విడిది ఏర్పాటు చేశారు.

"అయ్యా! మీరు యెన్ని రోజులున్నా ఫరవాలేదు. మాకు ఆ పులి పీడా విరగడ చెయ్యండి" అన్నారు వాళ్లు.

జ్వాలా నవ్వుతూ తలవూపాడు.

"దాదా! ఆ పులిని ఎక్కడ పట్టుకుంటావు?" అన్నాడు మేఘనాధ్ అంతా వెళ్ళిపోయాక.

"సెలయేటి దగ్గర శవాన్ని తినటానికి మళ్ళీ వస్తుంది పులి. అక్కడ కాచుకుని దెబ్బతియ్యాలి. అది రాకపోతే

ఎక్కడైనా ఎరవేసి మాటుమీద కూర్చుని చంపాలి"
అన్నాడు జ్వాలా.

"పాత రోజుల్లో ఎప్పుడైనా పులిని చంపావా దాదా?" ప్రశ్నించాడు మేఘనాధ్.

"రాజులం మాకు వేరేపని ఏం వుంటుంది? ఎప్పుడూ వేటపనే. లెక్కలేనన్ని పులుల్ని చంపాను" అన్నాడు జ్వాలా నవ్వుతూ.

14

సాయంకాలానికే మంచెమీదకు చేరుకున్నారు జ్వాలా ప్రతాప్, మేఘనాధ్‌లు. చెట్టుమీద పదిహేను అడుగుల పైనవుంది మంచె. చెట్టు నిటారుగా వుండడంవల్ల ఎక్కడం కొంచెం కష్టంగా వుంది మేఘనాధ్‌కి. జ్వాలా సులభంగానే ఎక్కి కూర్చున్నాడు.

"ఇంత పైకి ఎందుకు కట్టించావు దాదా! చాలా ఎత్తుగా లేదూ!" అన్నాడు మేఘనాధ్ ఆయాసపడుతూ.

జ్వాలా నవ్వి "పులుల సంగతి నీకు తెలియదు. పెద్ద పులి పదిహేను అడుగుల పైకి ఎగురుతుంది. అంటే అది భూమిమీద నుంచి ఈ మంచెపైకి ఎగరగలదన్నమాట. ఇక అదే చిరుతపులి అయితే మనలాగే చెట్టు ఎక్కి మన పని పడుతుంది" అన్నాడు.

మేఘనాధ్ ఆశ్చర్యపోయి "ఇంత పైకి ఎగురుతుం దన్న మాట" అన్నాడు.

"భయపడకు. అది ఎగిరే టైమ్‌లోనే దాని డొక్క చించుతా" అని నవ్వాడు జ్వాలా.

"నాకేం భయం. కావాలంటే దాన్ని నేనే చంపుతా" అన్నాడు మేఘనాధ్ ధైర్యంగా.

"గుడ్" అని అతని వెన్నుతట్టాడు జ్వాలా.

"అయితే చిరుతపులి కంటే పెద్దపులిని చంపడమే తేలికంటావా దాదా?" ఆలోచిస్తూ అన్నాడు మేఘనాధ్.

"అవును భాయ్! పెద్దపులి అంత తెలివైంది కాదు. చిరుతపులి జిత్తులమారిది. ఇది సామాన్యంగా మనుష్యుల జోలికి పోదు. ఒకసారి మనిషిని తిన్నదా! ఇక వేరే మాంసం రుచించదు దానికి. ఎప్పుడూ మనుష్యుల్నే చంపడానికి ప్రైని చేస్తుంది. ఏ చెట్టుమీదో కూర్చుంటుంది మనుష్యులు నడిచే దారి కనిపెట్టి. దగ్గరికి రాగానే ఎగిరి మీదకు దూకుతుంది. పారిపోయే అవకాశం గాని, ప్రతిఘటించడానికి సమయంగాని వుండదు. అంతలావు మనిషినైనా నోట కరుచుకుని పరిగెడుతుంది."

"చిరుతపులి చూడ్డానికి చిన్నదే గదా! మనిషిని యెత్తుకెళ్ళగలదా?"

"భలేవాడివి. చిరుతని నువ్వెక్కడ చూశావు?"

"జూలో."

"పిల్లని చూసివుంటావు. ఆఫ్రికా చిరుతలకంటేగూడా మనదేశపు చిరుతలు సైజులో పెద్దవి. ఏడు, ఎనిమిది అడుగుల పొడుగు వుంటాయి. మనిషినే కాదు, మనిషి కంటే బరువైన జంతువుల్ని చంపి లాక్కెళ్ళగలుగుతుంది."

"దానికి అంత బలం వుందన్నమాట."

"బలానికి బలం, తెలివికి తెలివిగూడా వుంది దానికి. ఎలుకల్ని పట్టడానికి పిల్లి యెంత నిశ్శబ్దంగా నడుస్తుందో ఇదీ అంతే. పిల్లికి లాగానే దీనికీ కాళ్ళ అడుగున మాంసం కండ వుంటుంది. అందుకని ఇది నడిచేటప్పుడు చప్పుడు కాదు. దీని ముందుకాళ్ళకు ఐదు గోళ్ళు. వెనుక కాళ్ళకు నాలుగు గోళ్ళు వుంటాయి. నడిచేటప్పుడు గోళ్ళ

అరిగిపోకుండా వాటిని ముడుస్తుంది. అవసరం వచ్చినప్పుడు పంజా విప్పి గోళ్ళతో దెబ్బకొడుతుంది?"

"చిరుతపులికి, పిల్లి మేనమామ అంటారు. దీనికి మేనమామ తెలివితేటలన్నీ వచ్చివుంటాయి" అన్నాడు మేఘనాథ్ నవ్వుతూ.

"ఆఁ....అదంతా కాకమ్మ కథలే. ఇది పిల్లికంటేగూడా తెలివైంది తెలుసా! అడవుల్లో పచ్చిక మేసే ఆవుల్ని, గేదెల్ని చంపాల్సి వచ్చినప్పుడు ఏం చేస్తుందో తెలుసా? సామాన్యంగా పశువులు వాసనని పసిగట్టి పులుల రాక తెలుసుకుని పారిపోతాయి. అందుకని చిరుతపులి ముందుగా బురదగుంటలో పొర్లి, వంటినిండా బురద పూసుకుని బయల్దేరుతుంది. ఇది నడుస్తుంటే బురదవాసన వస్తుంది తప్ప, పులివాసన రాదు. దూరంనుంచి చూసినా ఏదో పంది అనుకుంటాయి పశువులు. దగ్గరగా వెళ్ళి ఒక్క దెబ్బకి పశువుని కొట్టి ఈడ్చుకుపోతుంది."

"ఆశ్చర్యంగా వుంది."

"అవును భాయ్! పెద్దపులిని చంపడం తేలికేగాని, దీన్ని చంపడం చాలా కష్టం. జిత్తులమారి నక్క. వేటగాణ్ణి ముప్పతిప్పలు పెడుతుంది." అన్నాడు జ్వాలా.

"కొంపదీసి ఇక్కడ మనుష్యుల్ని చంపుతున్నది చిరుత కాదుగదా!"

"కాదు."

"ఎలా తెలుస్తుంది దాదా!"

"దాని అడుగులు చూసి గ్రహించాను" అన్నాడు జ్వాలా.

సంధ్యకాంతులు మాయమై చీకటి అలుముకుంటున్నది. మనిషి శవం వున్న చోట్లో మేకని ఎరగా కట్టేశారు.

చీకటి పడేకొద్దీ అది భయంతో అరవసాగింది.

జ్వాలాకి ఇలా మంచెమీద మాటువేసి వేటాడ్డం మామూలే. కాని మేఘనాధ్‌కి ఇది సరికొత్త అనుభవం. ఎంతో ఎక్సయిటింగ్‌గా వుంది.

రాత్రి ముదురుతోంది. చీకటి ముద్దలు ముద్దలుగా జారుతున్నట్లు వాతావరణం నల్లగా మారిపోయింది. చెట్టు కొమ్మల్లోంచి చుక్కలు తొంగిచూస్తున్నాయి.

దూరంగా కొండలు నిద్రపోతున్న ఏనుగుల్లా కనిపిస్తున్నాయి.

తెల్లటి మేఘాలు ఆకాశంలో అటూ ఇటూ పరుగులు తీస్తున్నాయి.

చల్లటి గాలి హాయిగా వీస్తోంది.

మంచు సన్నగా కురుస్తోంది.

వుండీ, వుండీ మేక అరుస్తోంది.

మేఘనాధ్ వాచీ చూశాడు. రేడియమ్ డైల్ పదకొండు గంటలైనట్లు చూపించింది.

ఆవులింతలు వస్తున్నాయి.

అతనికి నిద్ర వస్తున్నట్లు అనిపిస్తోంది. బోర్‌గా వుంది. కబుర్లు చెప్పుకోడానికి వీల్లేదు. లేకపోతే వేట గురించి, జంతువుల అలవాట్లు దావా యెన్నయినా చెప్పేవాడు.

"దాదా! కాసేపు పడుకోనా!" చెవులో నెమ్మదిగా అన్నాడు.

"లాభం లేదు. ఫ్లాస్క్‌లో 'టీ' త్రాగు. నాక్కూడా కొంచెం ఇవ్వు. నువ్వు నిద్రపోతే నాకూ నిద్ర రావొచ్చు. మనం హాయిగా నిద్రపోతే పెద్దపులి వచ్చి మేకని తిని తర్వాత మన పని పడుతుంది" నవ్వుతూ అన్నాడు జ్వాలా.

మేఘనాథ్ మారు మాట్లాడకుండా ఫ్లాస్క్ వంచి టీ త్రాగి. తర్వాత జ్వాలాకి అందించాడు.

టీ వెచ్చగా కడుపులోకి దిగిన తర్వాత నిద్ర దూరమై నట్లు అనిపించింది. హుషారుగా లేచి నిల్చున్నాడు.

ఇంతలో చెట్టుక్రింద ఆకులు గలగలలాడాయి, ఎండిన ఆకులు చప్పుడు చేస్తున్నాయి.

కళ్ళు పెద్దవిచేసి చెట్టుక్రిందకు చూశారు. నక్షత్రాల వెలుగు తప్ప వేరే వెలుగు లేదు. ఏమీ కనిపించడంలేదు.

చెవులు రిక్కించి విన్నారు అకులమీద యెవరో కదులు తున్నట్లు చప్పుడు వినిపిస్తోంది. నిశ్శబ్దంగా పడుకున్న మేక గట్టిగా అరవసాగింది.

మేఘనాథ్‌కి అయోమయంగా వుంది. చెట్టుక్రింద కదు లుతున్న జంతువు ఏమిటి? అది పులి కాదా? పులి అయితే ఇంతసేపు మేకని చంపకుండా యెందుకు వుంటుంది.

"దాదా! ఏమిటది?" చెవులో గుసగుసలాడాడు.

"బ్యాట్రీ లైటు ఇటు ఇవ్వు" అన్నాడు జ్వాలా.

అతను అందించాడు.

జ్వాలా బ్యాటరీలైటు అందుకుని చెట్టుక్రిందకు ఫోకస్ చేశాడు. త్రీసెల్స్ లైటు తెల్లగా వెలుగుతో ఆ ప్రాంతాన్ని నింపివేసింది.

కాంతి తనమీద పడడంతో బుస్సున లేచింది నల్లటి త్రాచుపాము.

మేఘనాథ్ గుండె అదిరింది కోపంతో అది చేస్తున్న శబ్దానికి.

త్రాచు పడగ ఆటూ ఇటూ కదుపుతూ బుసలు కొడు తోంది. ఆరు అడుగుల పైనే వుంటుంది. దాని పొడుగు. మంచి కోడె వయసులో హుషారుగా వుంది, శత్రువు

వునికి తెలియగానే మీద పడడానికి ఎలర్ట్‌గా వుంది.

"దాని శరీరం చూశావా భాయ్! నల్లగా నిగనిగలాడుతూ యెలా వుందో?" అన్నాడు దాదా.

"ష్ ...మాట్లాడకు దాదా! మన వునికి కనిపెట్టి చెట్టు యెక్కుతుందేమో!" భయంగా అన్నాడు మేఘనాధ్.

జ్వాలా పకపకా నవ్వాడు.

"దానికి చెవులు లేవు భాయ్! మన మాటలు వినడానికి" అన్నాడు.

"ఈజిట్!" ఆశ్చర్యపోయాడు.

"యస్ బాయ్ పాముకు చెవులు వుండవు."

"మరి అది నాగస్వరం యెలా వింటుంది?"

"వినదు."

"నేను నమ్మను దాదా! ఏన్నోసార్లు స్వయంగా చూశాను. పాములవాడు నాగస్వరం వూదుతూ వుంటే పాము పడిగ వూపుతూ వుంటుంది."

"అది తల వూపేది నాగస్వరం విని కాదు."

"మరి?"

"పాములవాడు నాగస్వరం పలికే బుర్రని అటూ ఇటూ వూపుతూ వుంటాడు. దాన్ని చూసి పాముగూడా తలవూపుతుంది."

"మరి పాము శబ్దాన్ని గ్రహించలేదా?"

"గ్రహిస్తుంది. దాని పొట్ట అడుగున వున్న పొలుసుల ద్వారా చప్పుడు గ్రహిస్తుంది."

పాము పడగ దించి వెనక్కి వెనక్కి జరుగుతూ వున్నది.

"దాదా! ఫైర్" అన్నాడు మేఘనాధ్ కంగారుగా.

జ్వాలా నెమ్మదిగా నవ్వాడు.

"అదే పోతుంది. పోనీ..." అన్నాడు.

"మళ్ళీ వస్తుందేమో!"

"రాదు."

"ఎందుకైనా మంచిది, కాల్చి పారెయ్యరాదా?"

"కాల్చిపారెయ్యడం పెద్ద సమస్య కాదు. కాని మన ప్రయత్నం అంతా వృధా అయిపోతుంది."

"ఏం?"

"ఈ చుట్టుపక్కల ఎక్కడైనా పులి వుందనుకో. తుపాకీ శబ్దం విని బెదిరిపోతుంది."

"అలాగా!" అన్నాడు మేఘనాధ్.

త్రాచుపాము జరజరా ప్రాకిపోయింది. కనిపించినంత దూరం దానిమీద లైటు ఫోకస్ చేస్తూనే వున్నాడు జ్వాలా.

"పాముని చూస్తే మనకి ఎంత భయమో దానికీ అంతే. ప్రాణభయంతో వణికిపోతూ వుంటుంది. తప్పని పరిస్థితిలోనే అది ఎదురు తిరుగుతుంది."

మేక అరిచి అరిచి పడుకుంది.

కాలం కరిగిపోతూ వుంది.

చాలాసేపటికి దూరంగా పులి గర్జన వినిపించింది. ఇద్దరూ ఎలర్ట్‌గా కూర్చున్నారు.

రాత్రి తను చంపిన మనిషి శవంకోసం అది వెతుకుతూ వుండొచ్చు.

పులి గర్జన విని మేక భీకరంగా అరవసాగింది. దానికీ తెలిసిపోయినట్లుంది తనకు మృత్యువు సమీపించిన విషయం.

మేక అరుపులు విని పులి వురుకులు పరుగులమీద వస్తున్నట్లు చప్పుడు వినిపిస్తోంది.

పులి గర్జన వింటుంటే మేఘనాధ్ గుండె దడదడలాడ

సాగింది. శరీరంలో సన్నటి వణుకు ప్రారంభమైంది.

పులి పంజాదెబ్బకి మేక హృదయవిదారకంగా అరిచింది. కొన్ని క్షణాల్లోనే దాని మూలుగు గాలిలో కలిసిపోయింది.

'ధన్....' మని తుపాకీ చప్పుడు, ఆ వెనువెంటనే పులి చేసిన భీకరమైన అరుపు వినిపించాయి. పైకి లేచి దబ్న క్రిందపడిన శబ్దం వినిపించింది.

"లైట్...." అన్నాడు జ్వాలా.

మేఘనాథ్ లైట్ ఫోకస్ చేశాడు.

పెద్దపులి గిలగిల కొట్టుకుంటూ అరుస్తోంది. జ్వాలా గురిచూపి తలమీద మరొక దెబ్బ కొట్టాడు తల పగిలి నెత్తురు చిమ్మింది. కొంచెం సేపటికే దానిలో చలనం ఆగిపోయింది.

"శభాష్ దాదా!" మెచ్చుకోలుగా అన్నాడు మేఘనాథ్.

15

పెద్దపులి బారినుంచి తమను రక్షించినందుకు వేదీ గ్రామప్రజలు కానుకగా యిచ్చిన రెండు గాడిదలు ఎంతో వుపయోగంగా వున్నాయి. సామానంతా గాడిదల మీద వేసి హాయిగా చేతులూపుకుంటూ సరదాగా నడుస్తున్నారు.

పేర్చిపెట్టినట్లు దొంతులు దొంతులుగా వున్నాయి కొండలు. కొండల మధ్య లోతుగా వున్న లోయలు మనోహరంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడా స్ఫటికంలాగ స్వచ్ఛమైన సెలయేళ్ళు గలగల పారుతున్నాయి. వాటిలో పారే నీళ్ళు తియ్యగా కడుపులోకి జారిపోతున్నాయి.

సామాన్లు మోసేపని లేనందువల్ల ఎంత దూరం నడిచినా అలసట కలగటం లేదు.

అపర్ణ మాత్రం వెనుక పడుతూనే వుంది. ఆమెతో పాటే కిశోర్ గూడా అడుగులు వేస్తున్నాడు. ఇద్దరూ చేతులు పట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నారు.

ప్రయాణం రెండు రోజులు సాగింది. మధ్యలో చిన్న చిన్న పల్లెలు తగిలాయి. చీకటిపడిన చోట టెంట్ వేసుకోవడం, వంట చేసుకుని నిద్రపోవడం, రాత్రి వంతుల వారీగా మంట దగ్గర కాపలా వుండడం వారికి సరదాగానే గడిచిపోయింది. పాములు, కుందేళ్ళు, జింకలు వంటి మామూలు ప్రాణులు తప్ప క్రూరమృగా లేవీ ఎదురు కాలేదు రెండు రోజులలో దాదాపు అరవై మైళ్ళు ప్రయాణం సాగివుంటుంది.

మూడోరోజు సాయంకాలమైంది.

సూర్యుడు కొండలచాటుకు దిగుతున్నాడు.

ఊడలు దిగిన విశాలమైన మర్రిచెట్టు కనిపించింది. చెట్టుక్రింద చల్లగా, హాయిగా వుంది.

"దాదా! ఈ రాత్రికి యిక్కడే మకాం. ఈ చెట్టుక్రింద యెంత హాయిగా వుందో!" అన్నాడు కృష్ణమూర్తి మానుకు ఆనుకుని నిల్చుంటూ.

జ్వాలా తల అడ్డంగా వూపాడు.

"దగ్గర్లోనే పిద్ధీ అనే చిన్న పల్లెవుంది. ఈ రాత్రికి అక్కడ వుండొచ్చు. ఆ వూళ్ళో వాళ్ళు గూడా చాలా మంచివాళ్ళు. వేదీ గ్రామస్తుల్లా మర్యాదస్తులు. పాలు, పెరుగు గూడా సమృద్ధిగా దొరుకుతాయి గూడా" అన్నాడు.

చెట్టుక్రింద ఆగిన వాళ్ళంతా మళ్ళీ బయల్దేరారు.

ఎండ పూర్తిగా పోయింది.

సంధ్యకాంతులు పశ్చిమాన వెలుగుతున్నాయి.

ఫర్లాంగు దూరం చకచకా నడిచారు. కృష్ణమూర్తి ముందున్న గాడిదల్ని అదిలించాడు. అవి కొంత దూరం పరుగుతీశాయి. ఊరు చేరుకోగానే విశ్రాంతి తీసుకోవచ్చు గదా అనే హుషారులో అంతా తొందరగా నడుస్తున్నారు.

దూరంగా యిళ్ళు కన్పిస్తున్నాయి.

విశాలమైన లోయలో ప్లాన్డ్‌గా కట్టినట్లు బొమ్మల్లా కనిపిస్తున్నాయి ఇళ్ళు. ఊరికి ఆనుకునే పచ్చగా కనిపిస్తు న్నాయి వాళ్ల సాగుచేస్తున్న పొలాలు. దూరంగా పెద్ద చెరువు వుంది. దానినుంచి వచ్చే నీళ్ళతోనే భూమి సాగు చేస్తూవుండాలి అనుకున్నారు.

కొండనుంచి వూళ్లోకి వెళ్ళడానికి విశాలమైన కాలిబాట వుంది. త్వరత్వరగా దిగారు. ఊరు దగ్గర పడింది.

ఒక్కసారిగా గాలి వీచింది. భయంకరమైన దుర్వాసన ముక్కులకు సోకింది. అంతా చేతిరుమాళ్ళతో ముక్కులు మూసుకున్నారు. అయినా వాసన ఆగడంలేదు. కడుపులో పేగుల్ని తిప్పుతోంది.

"దాదా! ఏమిటీ దుర్వాసన?"

"కొంపతీసి మనం స్మశానంలోకి వెళ్ళడంలేదు గదా!"

జ్వాలా మాట్లాడ్డం లేదు. కళ్లు పెద్దవిచేసి ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ ముందుకు వెళ్ళాడు. నాలుగు అడు గులు వేసి ఆగిపోయాడు. అందర్నీ ఆగమని సంజ్ఞ చేశాడు. తుపాకీ గట్టిగా పట్టుకున్నాడు.

ఊళ్లోనుంచి ఏవో అరుపులు వినిపిస్తున్నాయి. అవి జంతువుల అరుపులే. సందేహంలేదు. కాని అవి ఏ జంతు వులో యెవరికీ అర్థంకాలేదు.

"దాదా! ఏమిటా అరుపులు? ఈ దుర్వాసన ఏమిటి?" అన్నాడు మేఘనాధ్.

"భరించలేం దాదా! ఈ వాసన. వాంతి అయ్యేట్లు వుంది."

"వెనక్కి పోదాం."

జ్వాలా వాళ్ళవంక చూపి "భయపడకండి. ఆ అరుపులు తోడేళ్ళవి" అన్నాడు.

"తోడేళ్ళవా! ఊళ్ళోనుంచి అరుపులు వినిపిస్తున్నాయి గదా!"

"అదే ఆలోచిస్తున్నాను. తోడేళ్ళు వూళ్ళోనుంచి ఎందుకు అరుస్తున్నాయి? వూరి చివర్నించి అరుస్తున్నాయేమో? ఏదైనా జంతువుని తింటున్నాయేమో? ఈ వాసన ఆ జంతువుదేమో?"

"ఈ వూరివాళ్ళు తోడేళ్ళు పెంచరు గదా!" కిశోర్ సందేహం వెలిబుచ్చాడు.

జ్వాలా నవ్వి "తోడేళ్ళని ఎవరూ పెంచరు" అన్నాడు.

"తోడేళ్ళ అరుపులూ, భయంకరమైన దుర్వాసనా చూస్తుంటే యేదో దారుణం జరిగినట్లు అనిపిస్తోంది" అన్నాడు జ్వాలా.

"వెళ్ళి చూద్దామా?" ప్రశ్నించాడు మేఘనాథ్.

"తోడేళ్ళు మన పైకి దూకవు కదా?" అనుమానం వ్యక్తంచేశాడు ఫణీంద్ర.

"రెండో మూడో అయితే తుపాకీతో సమాధానం చెప్పొచ్చు. అవి గుంపుగా వుంటే కష్టం. మనం గూడా గుంపుగా వున్నాం కనుక తొందరపడవు."

"ఇంతదూరం వచ్చి వెనక్కి వెళ్ళడం దేనికి? చూద్దాం ఏం జరిగిందో?" అన్నాడు మేఘనాథ్.

"పదండి...." అన్నాడు జ్వాలా ముందుకు దారితీసి.

చీకటి పడడానికి సిద్ధంగా వుంది. వెలుగు మాసిపోతూ

వుంది.

దుర్వాసన దుర్భరమైపోయింది.

అపర్ణ వాంతిచేసుకుంది. కిశోర్ ఆమెను కూర్చోబెట్టి రెండు చెవులూ మూశాడు. తర్వాత కొంచెం మంచి నీళ్ళిచ్చాడు.

జ్వాలా అందర్నీ ఒక పెద్ద పొదచాటున కూర్చోబెట్టాడు. తను ఒంటరిగా తుపాకి చేతబట్టుకుని వెళ్ళాడు.

ఒక యింటి వెనక్కి వెళ్ళి చూశారు.

ఆ దృశ్యం చూసి జ్వాలాప్రతాప్ గుండె అవిసి పోయింది.

ఊరి జనమంతా శవాలై మధ్యలో పడివున్నారు. బట్ట లన్నీ నెత్తురుతో తడిసి ఎర్రగా భయంకరంగా కనిపిస్తు న్నాయి. శవాలమీద పడి తోడేళ్ళు ఆత్రంగా తింటు న్నాయి.

16

జ్వాలా వెనక్కి తిరిగి ఒక్క పరుగులో పొద దగ్గరికి చేరుకున్నాడు.

"క్విక్....బయల్దేరండి" రొప్పుతూ అన్నాడు.

"ఏం జరిగింది దాదా?" ఆదుర్దాగా ప్రశ్నించాడు మేఘనాథ్.

"తర్వాత చెప్తాను. ముందు నడవండి. కాదు పరిగెత్తాలి. అవి మనల్ని చూస్తే డేంజర్" అన్నాడు జ్వాలా.

చీకటి పడిపోయింది.

కొండ దిగేటప్పుడు త్వరగానే సులభంగా దిగారు. ఎక్కేటప్పుడు చాలా కష్టంగా వుంది. నడిచి నడిచి అంతా అలిసిపోయి వున్నారు. పైగా చీకటి. బ్యాటరీ లైటు వెలుతురు అందరికీ చాలడంలేదు.

కొండపైకి ఎక్కిన తర్వాత గూడా జ్వాలా ఆగలేదు. అతని అడుగులు ముందుకు పడుతూనే వున్నాయి. చీకట్లోనే అరగంట నడిచారు. పెద్దపెద్ద చెట్లు ఏమీ లేకుండా మైదానంలా వున్న ప్రాంతంలో టెంట్ బిగించారు. పుల్లలు ఏరి మంటవేశారు.

అపర్ణ చాలా నీరసంగా వుంది. తను వంట చెయ్యలేనని అంది. జ్వాలా రొట్టెలు చేశాడు. వేదీ గ్రామస్థులు యిచ్చిన యెండిన లేడిమాంసం తునకలు వేపి సూప్ చేశాడు కృష్ణమూర్తి. ఆకలితో వున్నవారికి అవి యెంతో రుచిగా వున్నాయి. ఒక్క రొట్టెగూడా మిగలకుండా ఖాళీ చేశారు.

చల్లటిగాలి వీస్తోంటే ప్రాణం తేలిపోతోంది. అంతా నిద్రకి సిద్ధమయ్యారు.

అప్పుడు మేఘనాధ్ అడిగాడు సిద్ధీగ్రామంలో దాదా చూసిన భయకర దృశ్యం గురించి.

జ్వాలా తను చూపింది చెప్పాడు.

"అది భయంకరమైన దృశ్యం. మీరెవరైనా చూస్తే ఈ పూట భోజనం సహించేది కాదు. అంత వికారం కలిగేది ఏం జరిగిందో తెలీదుగాని గ్రామస్థులంతా వూరి మధ్య శవాలై పడున్నారు. ఆ శవాలు యెన్ని వుంటాయో వూహకు అందలేదు. సిద్ధీగ్రామంలో ఒక్క వ్యక్తిగూడా బ్రతికివుండి వుండదు. తోడేళ్ళ గుంపు ఆ శవాలమీద పడి కోలాహలం చేస్తూ ఆనందంగా తింటున్నాయి. ఆ గుంపులో కనీసం పాతిక, ముప్పై అయినా వుంటాయి తోడేళ్ళు. ఆ గుంపు కంటిలో మనం పడ్డామంటే ఒక పట్టాన వదలవు. అందుకే త్వరపడ్డాను."

"దాదా! వూరు వూరంతా ఒక్కసారి శవాలైపోవటం

అపరాధ పరిశోధన పోటీ-192

[ఫలితాలు]

జూలై '84 నెల "అపరాధ పరిశోధన పోటీ — 192"కి సరియైన సమాధానాలు:

1. కాంగ్రెస్ - ఐ.
2. డిస్కో సంగీతం.
3. భూటాన్.
4. భీవండి.
5. ధనార్జన.

పై జవాబుల ప్రకారం నలుగురు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి అక్టోబరు '84 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంప బడుతుంది.

(1) శ్రీమతి ప్రణీతా దీప్తి, 10-5-93, నిర్మాణిపేట, వరంగల్ - 506 002.

(2) శ్రీ ఎన్. సత్యనారాయణ, ఫ్యాన్సీ స్టోర్, నారాయణ పురం - 534 407, తాడేపల్లిగూడెం-తాలూకా, ప. గో. జిల్లా.

(3) శ్రీ వి. కె. విశ్వనాథ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు, కొత్త గూడెం - 507 101, ఖమ్మం జిల్లా.

(4) శ్రీ పి. రాంబాబు, ఎల్.సి.ఇ., c/o వి. సాంబశివ రావు, 17/92 ఎడేపల్లి, పోలీస్ క్లబ్ దగ్గర, మచిలీపట్టణం - 521 001.

ఏమిటి విచిత్రంగా లేదూ!"

"విచిత్రంగానే వుంది. ఇటువంటి సంఘటన నేను పుట్టాక విని ఎరుగను" అన్నాడు దాదా.

"ఎం జరిగివుంటుంది దాదా?"

"అదే అర్థం కావడంలేదు."

"ఊళ్ళో ఏదైనా పెళ్ళి జరిగివుంటుంది. అంతా విందు భోజనం చేసివుంటారు. ఆ భోజనం విషమైవుంటుంది."

"కావచ్చు."

"బందిపోట్లు వూరిమీదపడి దోచుకుని, గ్రామస్తుల్ని కాల్చి పోయారేమో?"

"ఎంత బందిపోట్లయినా వూరందర్నీ చంపిపోతారా?" అన్నాడు దాదా.

పిర్దీగ్రామంలో మూకుమ్మడి చావుల గురించి రకరకాల వూహాగానాలు చేస్తూ విశ్రాంతి తీసుకున్నారు.

17

అర్ధరాత్రి.

అంతా నిద్రపోతున్నారు.

మేఘనాధ్ సెంట్రీ డ్యూటీ చేస్తున్నాడు. అతనికిగూడా నిద్ర ముంచుకొస్తోంది. టైమ్ చూశాడు. పన్నెండు దాటింది. డ్యూటీ రెండింటి వరకూ. తర్వాత కృష్ణ మూర్తిని నిద్రలేపి తను పడుకోవచ్చు.

'టీ' కెటిల్ నెగడుమీద వుంచి వెచ్చచేశాడు. తర్వాత గ్లాసులోకి వంచుకున్నాడు. వేడి వేడి 'టీ' గొంతులోకి వంచుకున్నాడు. వేడి వేడి 'టీ' గొంతులోకి దిగాక ఆవలింతలు తగ్గాయి. ముఖం నీళ్ళతో కడుక్కొని అటూ ఇటూ పచార్లు చేయసాగాడు భుజంమీద తుపాకీ వుంది. ఇప్పుడు సడన్‌గా పెద్దపులి మీదకు దూకితే తను దాన్ని ఎదుర్కొని

అపరాధ పరిశోధనపోటీ-194

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1-00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-9-'84 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '84 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. ఇండియా బాగుపడాలంటే ఇది తప్పనిసరి—?
(అధ్యక్షతరహా పాలన, రెండు పార్టీల వ్యవస్థ)

2. ఈ నెలలో 'ఒలింపిక్ గేమ్స్' ఈ దేశంలో ప్రారంభమయ్యాయి—?
(అమెరికా, రష్యా)

3. నలుగురు దొంగలు కలిసి ఒక ఇంటిని దోచుకుంటె దానిని ఏమంటారు—?
(దోపిడి, దొంగతనం)

4. తుఫానులకు ఎక్కువగా గురవుతున్న రాష్ట్రం—?
(ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్)

5. ఈ 'కొరత' మనకు తీరేనా—?
(న్యూస్‌ప్రింట్, మూనెలు)

చంపగలడా? అనే ఆలోచన వచ్చింది. కాని ఎట్లా వస్తుంది? నెగడులో మంట వున్నంతసేపూ దానికి భయమే. తన ఆలోచనకు నవ్వు వచ్చింది.

గాలి ఎక్కువగా వీస్తోంది. నెగడులో మంట పైపైకి పోతోంది.

సన్నగా మూలుగు వినిపించింది. మేఘనాధ్ ఒక్క క్షణం ఆగాడు. ఎవరో మూలుగుతున్నారు. ఎవరికైనా వంట్లో బాగోలేదేమో, అపర్ణ వాంతిచేసుకోడం, సరిగా భోజనం చేయకపోవడం గుర్తొచ్చింది. ఆమెకేమైనా జ్వరం వచ్చిందేమో అని అనుమానం వచ్చింది

టెంట్ లోకి వెళ్ళి చూశాడు. బెడ్ లైటు సన్నగా వెలుగుతోంది. అంతా గాఢనిద్రలో వున్నారు. ఒక్క నిముషం అందరివంకా చూశాడు. మూలుగు వినిపించడం లేదు. అపర్ణ చెయ్యిపట్టుకుని చూశాడు. చల్లగానే వుంది. ఎవరూ మూలగడంలేదు. ఆశ్చర్యంగా వుందే అనుకున్నాడు.

టెంట్ లో నుంచి బైటకు వచ్చాడు.

మళ్ళీ పహార్లు సాగించాడు.

మూలుగు సన్నగా వినిపిస్తోంది.

అతనికి ఆశ్చర్యం ఎక్కువైంది. టెంట్ లో తప్ప ఈ అడవిలో నరసంచారం లేదు. అందులో వాళ్ళెవరూ మూలగడంలేదు. మరి మూలుగు ఎక్కడ్నుంచి వస్తోంది?

నెగడులో కట్టెలువేసి మంట పెద్దది చేశాడు. టెంట్ కి దూరంగా వెళ్ళి నిల్చున్నాడు. చెవులు రిక్కించి కళ్ళు మూసుకుని మూలుగు ఎటువైపు నించి వస్తున్నదో అద్దిర్వ చేశాడు. దక్షిణం వైపు గుబురుగా వున్న చెట్లలో నుంచి మూలుగు వినిపిస్తోంది.

"హెూమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టుఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా మీ నంబరు కూడా మారుతుంది.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. అయితే ఈ స్కీము అపన ఏజెంట్లు వున్న ప్రాంతా లకు వర్తించదు. మీరు హోమ్ డెలివరీ సభ్యత్వము పంపే ముందు మీ వూరిలో మా ఏజెంటు లేడనే విషయం నిర్ధారణ చేసుకోండి.

నేడే మీరూ 'హెూమ్ డెలివరీ' లో చేరండి!

ఇరవై గజాల దూరంలో వున్నాయి చెట్లు. ఆ లోపల ఎక్కడ్నుంచో వస్తోంది మూలుగు. ఆ మూలుగుతున్నది మనిషేనా? లేక ఏదైనా జంతువా? సందేహం కలిగింది.

ఏమైనా సరే వెళ్ళి చూడాలనుకున్నాడు. కాని టెంట్‌లో నిద్రపోతున్నవారిని వదిలి పోవడం క్షేమంకాదు.

జ్వాలాని నిద్రలేపాడు.

"ఏమిటి భాయ్? ఏం జరిగింది?" అంటూ లేచి కూర్చున్నాడు.

"దూరంగా చెట్లలో ఎవరో మూలుగుతున్నారు."

"ఎవరు?"

"ఏమో?"

జ్వాలా టెంట్ బైటకు వచ్చాడు.

మూలుగు తీవ్రంగా వినిపిస్తోంది.

"మనిషేనా భాయ్? లేక ఏదైనా జంతువా?" ప్రశ్నించాడు మేఘనాథ్.

"మనిషే. మూలుగుతోపాటు 'మా' అనే మాట గూడా వినిపించడంలా" అన్నాడు జ్వాలా.

మేఘనాథ్ జాగ్రతగా విని "అవును" అన్నాడు.

"నువ్వు ఇక్కడే వుండు నేను వెళ్ళి ఎవరో కనుక్కొని వస్తాను" అన్నాడు జ్వాలా.

"ఒంటరిగా వెళ్తావా?"

"ఏం?"

"ఏంలేదు. ఆ మూలుగుతున్నది ఎవరో ఏమిటో? ఎందుకైనా మంచిది. నేనూ వస్తాను."

"సరే పద"

"ఎవర్నయినా నిద్రలేపి పోదాం" అన్నాడు మేఘనాథ్.

తల వూపాడు దాదా.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-9-'84 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '84 నెల సంచికలో ప్రకటిస్తాము.

జూలై '84 పోటీ ఫలితాలు

(1) జూలై '84 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ప్రాచీన పోరాటం !
నవీన ప్రయోగం ! !

పంపినవారు: శ్రీ పి.వి. హరనాథ్, ఎల్.ఐ.జి-231, అలకానంద కాలనీ, కంటోన్మెంట్, విజయనగరం - 3.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కదిలానంటే —
కదన రంగమే ! !

పంపినవారు: శ్రీ ఆర్. జీవన్ బి.ఏ., పెంటాకలాన్, వయా: అంథం - 503 245, నిజామాబాదు జిల్లా.

కృష్ణమూర్తిని నిద్రలేపి కూర్చోబెట్టి ఇద్దరూ గుబురుగా వున్న చెట్ల వైపు నడిచారు.

మేఘనాథ్ బ్యాటరీలైట్ ఫోకస్‌చేస్తూ ముందుకు దారి చూపిస్తుంటే, జ్వాలా తుపాకీ పట్టుకుని అప్రమత్తతతో అడుగులు వేస్తున్నాడు.

కాళ్ళక్రింద ఎండుటాకులు నలిగిన చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది. అప్పటివరకూ మూలుగు వినిపించింది. చెట్లలోకి ప్రవేశించాక మూలుగు ఆగిపోయింది.

జ్వాలా ఆగిపోయాడు.

వెనుకనే మేఘనాథ్ నిలబడ్డాడు.

"మూలుగు ఆగిపోయింది" అన్నాడు జ్వాలా.

మేఘనాథ్ ప్రశ్నార్ధకంగా చూశాడు.

"కౌన్ హై భాయ్?" జ్వాలా పెద్దగా అన్నాడు.

రెస్పాన్స్ రాలేదు.

"మేము శత్రువులం కాదు. నీకు సహాయం చేయాలని వచ్చాం" హిందీలో అన్నాడు జ్వాలా.

జ్వాలా అదే మాటను నాలుగైదు సార్లు రిపీట్ చేశాడు.

ఫలితం కనిపించింది.

పదిగజాల దూరంలో వెలుగు కనిపించింది. ఆ వ్యక్తి అగ్గిపుల్ల వెలిగించి తన వునికి వెల్లడిచేశాడు.

ఇద్దరూ దగ్గరగా వెళ్ళారు.

ఆ వ్యక్తికి ముప్పై ఏళ్ళుండొచ్చు. జుత్తు వత్తుగా పెరిగి వీపుమీదకు వుంది. మీసాలు గుబురుగా పెరిగి పైకిలేచి వున్నాయి. కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. మనిషి గోధుమ రంగులో వున్నాడు. పడుకుని వుండబట్టి తెలియడం లేదు గాని పొడగరే. నల్లటి చొక్కా, ప్యాంటు గూడా నల్లటి రంగుదే. రెండు కాళ్ళకూ గాయాలు కనిపిస్తున్నాయి.

శ్రీ మహాలక్ష్మీ వారి వెరైటీ నవలలు

ఆగస్టు - విడుదల !

కొత్త శత్రువు

రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి

సిగ్గు - సిగ్గు

(ఆంధ్రభూమి సీరియల్)

రచన: N. R. నంది

ఆటవికం

రచన: వసుంధర

వెలుగు నీడలు

రచన: వేల్పూరి సుభద్రాదేవి

ప్రేమ మందిరం

రచన: 'మీరా' లక్ష్మి

అడ్వాన్సు పంపని ఆర్డర్లు అంగీకరించబడవు.
పూర్తి కేటలాగుకై నేడే వ్రాయండి.

ఫోన్ : 63322

శ్రీ మహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ - 2

ఆకుపచ్చటి దుప్పటి కొమ్మలమీద పరిచి దానిమీద పడుకున్నాడు. పక్కనే తుపాకీ, తూటాల బెల్టు వున్నాయి.

"ఎవరు మీరు!" మూలుగుతూ ప్రశ్నించాడు.

"బాటసారులం" అన్నాడు జ్వాలా.

"మంగల్‌సింగ్ మనుషులు కదూ?" జ్వాలా మాట నమ్మినట్లు లేదు.

"మంగల్‌సింగ్ ఎవరు?" ప్రశ్నించాడు జ్వాలా.

"ఢాకూ."

"మంగల్‌సింగ్ యెవరో మాకు తెలీదు."

"పోలీసులు కాదు గదా?" మళ్ళీ అనుమానంగా ప్రశ్నించాడు.

"కాదు."

"ఈ అడవిలోపడి ఎక్కడికి వెళ్తున్నారు మీరు?" అన్నాడా వ్యక్తి.

"ఢోల్‌పూర్ వెళ్తున్నాం" అన్నాడు జ్వాలా,

"చాలా దూరం వుంది గదా!"

"అవును."

"ఎక్కడ్నుంచి బయల్దేరారు?"

"విజయపూర్ నుంచి."

"ఢోల్‌పూర్ మీ స్వగ్రామమా?"

"కాదు. బంధువులున్నారు."

ఆ వ్యక్తి మరికొన్ని ప్రశ్నలు అడిగి వాళ్ల మంగల్‌సింగ్ అనుచరులుగాని, పోలీసులుగాని కాదని నిర్ధారించుకున్నాడు. —(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.